RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ | 1 జనవరి 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:178

## యూరియా సరఫరాపై నిరంతర పర్యవేక్షణ – మంత్రి తుమ్మల

హైదరాబాద్: రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ చేపడుతోందని, అన్ని జిల్లాల్లో సమృద్ధిగా నిల్వలు ఉన్నప్పటికీ రైతులలో అనవసర ఆందోళనలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.రబీ సీజన్‌కు అవసరమైన మొత్తం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో ఇప్పటికే సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు మంత్రి తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్ నెల అమ్మకాలతో పోలిస్తే, ఈ డిసెంబర్‌లో రైతులు లక్ష మెట్రిక్ టన్నుల మేరకు అదనంగా యూరియా కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.రాష్ట్రంలో గత ఏడాది రబీ సీజన్‌లో 79.54 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా, ఈ సంవత్సరం ఇప్పటివరకు 13.89 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఇందులో ప్రధాన పంటలైన వరి 3.94 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తవగా, మొక్కజొన్న 5.45 లక్షల ఎకరాల్లో సాగైనట్లు తెలిపారు.ప్రస్తుతం దుక్కిలో వేసుకునే డి.ఏ.పీ మరియు కాంప్లెక్స్ ఎరువులను రైతులు అధికంగా కొనుగోలు చేస్తున్నారని, మొక్కజొన్న సాగు చేస్తున్న జిల్లాలలో మరియు కొన్నిచోట్ల రైతులు ముందస్తు జాగ్రత్తగా యూరియా బస్తాలు కూడా కొనుగోలు చేస్తున్నారని మంత్రి చెప్పారు. అయితే ముందుగానే అవసరమైన మేరకు ఎరువులను రాష్ట్రానికి తెప్పించి నిల్వ ఉంచినందున రైతులకు ఎక్కడా కొరత లేకుండా సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, ఇప్పటికే రైతులకు సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. సొసైటీకి గానీ, రిటైల్ షాప్ కు గానీ వచ్చే ప్రతి రైతుకూ యూరియా బస్తాలు అందుతున్నాయని చెప్పారు.మండల అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, సహాయ సంచాలకులు అన్ని మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ రైతులకు

**రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో సమృద్ధిగా నిల్వలున్నప్పటికి రైతులలో అనవసర ఆందోళనలు సృష్టించే ప్రయత్నాలు – మంత్రి తుమ్మల**

**రబీకి అవసరమైన 10.40 లక్షల టన్నులు యూరియాలో ఇప్పటికే 4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా – మంత్రి తుమ్మల**


**గత సంవత్సరం డిసెంబర్ నెల అమ్మకాలతో పోల్చుకుంటే ఈ డిసెంబర్ లో లక్ష టన్నులు అదనంగా యూరియా కొనుగోలు చేసిన రైతులు – మంత్రి తుమ్మల**

**యాప్ అమలు చేస్తున్న జిల్లాలలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతులకు అందుతున్నాయి– ఈ యాప్ పై కూడా దుష్ప్రచారం – మంత్రి తుమ్మల**

**సొసైటీకి గాని, రిటైల్ షాప్ కు వచ్చే ప్రతి ఒక్క రైతు కూడా అందుతున్న యూరియా బస్తాలు – మంత్రి తుమ్మల**



ఎలాంటి ఇబ్బందులు రాకుండా యూరియా సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు. డీలర్ల వద్ద ఉన్న నిల్వల సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలని, అందరూ ఒకే కేంద్రానికి వచ్చి ఇబ్బందులు పడకుండా మండలాల్లో ఉన్న అన్ని రిటైల్ కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచాలని సూచించారు.యాప్ అమలవుతున్న జిల్లాలలో యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 5 జిల్లాల్లో దాదాపు లక్ష మంది రైతులు యాప్ ద్వారా 3.19 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.




## మద్యం సేవించి వాహనాలు నడిపేవారి పట్ల ఏమాత్రం ఉపేక్షించే ప్రసక్తి లేదు

### ఈ తనిఖీలు కేవలం ఈ రోజుకే పరిమితం కాకుండా జనవరి మొదటి వారం అంతా కొనసాగుతుందని నగరవాసులకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కఠిన హెచ్చరికలు



హైదరాబాద్ డిసెంబర్ 31 ;నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నగరవాసులకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కఠిన హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారి పట్ల ఏమాత్రం ఉపేక్షించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ మరియు రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా పోలీసులు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశారు.ఈ సందర్భంగా పలు కీలక ప్రకటనలు చేశాడు. ఈ రోజు రాత్రి నగరం అంతటా 120కి పైగా కీలక పాయింట్లలో ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించబోతున్నట్లు తెలిపాడు. ఈ తనిఖీలు కేవలం ఈ రోజుకే పరిమితం కాకుండా జనవరి మొదటి వారం అంతా కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే భారీ జరిమానా విధించడంతో పాటు, వాహనాన్ని సీజ్ చేస్తామని, అలాగే కోర్టు ద్వారా జైలు శిక్ష మరియు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే ప్రక్రియను చేపడతామని హెచ్చరించారు. కేవలం డ్రంక్ అండ్ డ్రైవ్ మాత్రమే కాకుండా అతివేగంగా వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం, బహిరంగ ప్రదేశాల్లో నలుగురికి ఇబ్బంది కలిగించేలా న్యూసెన్స్ చేయడం వంటి పనులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు తెలిపారు. మద్యం సేవించిన వారు బాధ్యతాయుతంగా వ్యవహరించి, స్వయంగా డ్రైవింగ్ చేయకుండా క్యాబ్ సేవలను లేదా డ్రైవర్లను ఆశ్రయించాలని సూచించారు. కొత్త సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి క్షేమంగా, సంతోషంగా జరుపుకోవాలని పోలీస్ యంత్రాంగం కోరింది.



ఇటీవల మోకాలి శస్త్ర చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ని పరామర్శించిన ఋఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,రోహిణ్‌రెడ్డి

## రాష్ట్ర ప్రజలకు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నూతన సంవత్సర(2026) శుభాకాంక్షలు తెలిపారు



**ఆందోల్, నియోజకవర్గ ప్రతినిధి డిసెంబర్ 31 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** ఈ కొత్త ఏడాది ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రతి ఇంట ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు, వర్ధిల్లాలని, మంత్రి ఆకాంక్షించారు, ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేసి, కొత్త సంవత్సరంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తామని, మంత్రి పేర్కొన్నారు,, (ఎన్ సిడీల)పై ఫోకస్ 2026,లో నాన్ కమ్యూనికేబుల్, డిసీజెస్ నివారణ, నియంత్రణ, పాలియేటివ్ కేర్ పై, మరింత ఫోకస్ చేస్తామని, మంత్రి వెల్లడించారు,ఇప్పటికే, (ఎన్ సి డి సి క్లినింక్స్, డే కేర్ క్యాన్సర్ క్లినిక్స్, ద్వారా గ్రామాల సమీపంలోకి, వైద్య సేవలను తీసుకెళ్తామని, మంత్రి గుర్తు చేశారు,( కొత్త ఏడాదిలో నాలుగు కొత్త హాస్పిటల్స్) దశాబ్దాల ఉస్మానియా నూతన హాస్పిటల్ ఆకాంక్షను 2025 లో నెరవేర్చుకున్నామని, మంత్రి గుర్తు చేశారు, రాష్ట్రవ్యాప్తంగా పలు మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటల్ కు కొత్త భవనాలు నిర్మించుకున్నామన్నారు, 2026 లో 4,,కొత్త మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ను, ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని, ఆయన వెల్లడించారు, గుండె కిడ్నీ వంటి జబ్బులు, క్యాన్సర్ లాంటి మొండి వ్యాధులను సైతం పేదలు పైసా ఖర్చు లేకుండా, కార్పొరేట్ స్థాయి వైద్యం పొందెల ఈ హాస్పిటల్ లో తీర్చి ధిద్దుతామని తెలిపారు, మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటల్ లో, అన్ని సాకర్యలు అందుబాటులోకి తీసుకొచ్చి, వైద్య విద్య వ్యవస్థను, మరింత బలోపేతం చేస్తామని, మంత్రి పేర్కొన్నారు..

## నార్లాపూర్ నూతన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క మేడారం జాతర దృష్ట్యా కీలక ముందడుగు



ములుగు తాడ్వాయి మండలం మేడారం నందు నూతనంగా నిర్మించిన నార్లపూర్ పోలీస్ స్టేషన్‌ను గౌరవ రాష్ట్ర పంచాయతీ,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సీతక్క గారు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం ములుగు జిల్లా ఎస్పీ శ్రీ సుధీర్ రామనాథ్ కేకాన్ ఐపీఎస్ గారి అధ్యక్షతన జరుగగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర గారు, ఓఎస్డీ శ్రీ శివం ఉపాధ్యాయ, ఏఎస్పీ ఏటూరునాగారం మనన్ బట్ గారు పాల్గొన్నారు.ఈ పోలీస్ స్టేషన్ లో స్టేషన్ హౌస్ అధికారి ఎస్ఐ హెడ్ కానిస్టేబుల్,కానిస్టేబుల్ స్థాయిలలో సుమారుగా 30 మంది పనిచేయనున్నారు.ఈ నూతన పోలీస్ స్టేషన్ ప్రారంభం మేడారం మహాజాతర దృష్ట్యా ఎల్లప్పుడూ ప్రజలకు భక్తులకు గుత్తికొయా గిరిజన ప్రజలకు అందుబాటులో ఉంటూ, శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.జాతర సమయంలో లక్షలాది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వేగవంతమైన పోలీస్ సేవల అందించడంలో ఈ స్టేషన్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.నార్లాపూర్ పోలీస్ స్టేషన్ హౌస్ అధికారిగా ఎస్ ఐ ఏ. కమలాకర్ గారు విధులు నిర్వహించనున్నారు, పస్రా పరిధిలో ఈ స్టేషన్ పనిచేస్తుంది పస్రా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దయాకర్ గారు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తారు.జిల్లాలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఈ నూతన స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు, ఇది ప్రజలకు మరింత చేరువైన, సమర్థవంతమైన సేవలకు నాంది పలుకుతుందని అన్నారు.

ప్రజాబలం

1 జనవరి 2026 గురువారం

# రాజకీయ వ్యూహాలు.... కుటుంబ బంధాలు !

మహారాష్ట్ర రాజకీయాల్లో ఊహించని మలుపు చోటుచేసుకుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా రాజకీయంగా దూరంగా ఉన్న అన్నదమ్ములు ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే మళ్లీ ఒక్కటయ్యారు. ఈ కలయిక మహారాష్ట్ర రాజకీయాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా కూడా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా 2026 ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో వీరిద్దరూ కలిసి పనిచేయాలని నిర్ణయించుకోవడం రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ముంబైలోని శివాజీ పార్క్ సమీపంలో ఉన్న శివసేన వ్యవస్థాపకుడు బాలాసాహెబ్ థాకరే స్మారక చిహ్నం వద్ద ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఒకే కారులో రాజ్ థాకరే ఇంటి నుంచి రావడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇది కేవలం ఒక కుటుంబ సమావేశం మాత్రమే కాకుండా, రాబోయే రాజకీయ మార్పులకు సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.విభేదాలు, వ్యక్తిగత అపార్థాల కారణంగా విడిపోయిన ఈ కుటుంబం మళ్లీ కలవడం మరాఠీ ఓటర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ప్రత్యేకంగా ఏక్‌నాథ్ షిండే వర్గంతో తీవ్రంగా పోరాడుతున్న ఉద్ధవ్ థాకరేకు, తమ్ముడు రాజ్ థాకరే మద్దతు లభించడం ఒక పెద్ద ప్లస్ పాయింట్‌గా కనిపిస్తోంది. ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఉద్ధవ్ థాకరే రాజకీయ భవిష్యత్తుకు అత్యంత కీలకంగా మారాయి. ఎందుకంటే ఈ ఎన్నికల్లో గెలుపు సాధిస్తేనే శివసేన అసలైన వారసుడు ఎవరు అన్న విషయం ప్రజల్లో స్పష్టతకు వస్తుంది.మరాఠీ మనుషుల హక్కుల కోసం, ముంబై ఆత్మగౌరవం కోసం తామంతా ఒక్కటయ్యామని ఈ ఇద్దరు నాయకులు ప్రకటించారు. కులమతాలకు అతీతంగా ముంబై ప్రజలందరినీ కలుపుకుని ముందుకు వెళ్తామని శివసేన నాయకులు పేర్కొన్నారు. విడిపోయి పోరాడితే అది ఇక్కడి అమరవీరులకు చేసే అవమానమని కూడా వారు స్పష్టం చేశారు.రాజ్ థాకరే తన ప్రసంగంలో ఐక్యతను బలంగా చాటారు. వ్యక్తిగత అపార్థాల కన్నా మహారాష్ట్ర గౌరవమే ముఖ్యమని అన్నారు. సీట్ల పంచకాలు కన్నా ముంబై ప్రయోజనాలే తమకు ప్రాధాన్యత అని, నాసిక్ వంటి ఇతర కార్పొరేషన్లలో కూడా ఈ పొత్తు కొనసాగుతుందని వెల్లడించారు. ఈ పొత్తు ద్వారా ముంబై పీఠాన్ని తప్పకుండా దక్కించుకుంటామని రాజ్ థాకరే ధీమా వ్యక్తం చేశారు.అయితే ఈ రాజకీయ పొత్తు ద్వారా నిజంగా లాభం ఎవరికీ? నష్టం ఎవరికీ? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో వినిపిస్తున్నాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ కలయిక వల్ల లాభం నేరుగా ముంబై ప్రజలకు చేరుతుందా? లేక ఈ ఇద్దరు సోదరులకు, వారిని నమ్ముకున్న నాయకులకు మాత్రమే పరిమితమవుతుందా? అన్న సందేహాలు ఉన్నాయి.మరోవైపు, ఈ పొత్తు వల్ల షిండే వర్గానికి, అలాగే మహారాష్ట్రలోని ఇతర రాజకీయ పార్టీలకు ఇది పెద్ద సవాల్‌గా మారనుంది. మరాఠీ ఓటు బ్యాంక్ మళ్లీ ఒకే చోట చేరితే, రాబోయే ఎన్నికల్లో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.మొత్తంగా చూస్తే, థాకరే బ్రదర్స్ కలయిక కేవలం ఒక కుటుంబ పునర్మిళనం మాత్రమే కాదు. ఇది మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలక మలుపు. దీని ఫలితం ముంబై మున్సిపల్ ఎన్నికలతో పాటు, రాష్ట్ర రాజకీయాల దిశను కూడా నిర్ణయించనుంది. ఈ పొత్తు ద్వారా ఎవరు గెలుస్తారు, ఎవరు నష్టపోతారు అన్నది కాలమే తేల్చాలి. కానీ ఇప్పటికైతే, ఈ కలయిక మహారాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా కొనసాగుతోంది.2023లో ఎన్సీపీ చీలిక తర్వాత ఉప్పు-నిప్పులా విడిపోయిన బాబాయ్-అబ్బాయ్ (శరద్ పవార్, అజిత్ పవార్) మళ్లీ చేతులు కలిపారు. రాబోయే పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోసం రెండు వర్గాలు కలిసి పోటీ చేస్తాయని ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అధికారికంగా ప్రకటించారు. "రాష్ట్ర అభివృద్ధి కోసం కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. గడియారం, ట్రంపెట్ గుర్తులు ఇప్పుడు ఏకమయ్యాయి. పవార్ కుటుంబం మళ్లీ ఒక్కటైంది" అని ఆయన పేర్కొనడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.పింప్రి-చించ్వాడ్ ప్రాంతం దశాబ్దాలుగా పవార్ కుటుంబానికి కంచుకోటగా ఉంది. 1999 నుంచి 2017 వరకు ఇక్కడ పవార్ల హవానే నడిచింది. అయితే 2017లో బీజేపీ ఈ కోటను కైవసం చేసుకుంది. అయితే ఇప్పుడు ఆ పాత వైభవాన్ని తిరిగి తెచ్చుకోవడమే లక్ష్యంగా ఇరు వర్గాలు పొత్తుకు సిద్ధం అయ్యాయి. కేవలం కుటుంబం కలవడమే కాకుండా.. ఓట్లు చీలిపోకుండా చూసి బీజేపీని దెబ్బకొట్టాలనేది వీరి మాస్టర్ ప్లాన్. సీట్ల సర్దుబాటుపై చర్చలు ఇప్పటికే ముగిశాయని.. త్వరలోనే తుది జాబితా విడుదల చేస్తామని అజిత్ పవార్ స్పష్టం చేశారు.ఈ పొత్తుపై మహాయుతి కూటమిలోని ఇతర భాగస్వామ్య పక్షాల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. బీజేపీ నేత నవనీత్ రాణా మాట్లాడుతూ.. "అజిత్ పవార్ ఎప్పుడూ శరద్ పవార్ మాట వింటారని మాకు తెలుసు. ఇప్పుడు వారు కలవడం సంతోషకరం. త్వరలోనే శరద్ పవార్ కూడా ఎన్డీయేలో చేరుతారని ఆశిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. అయితే ఏక్‌నాథ్ షిండే శివసేన వర్గం మాత్రం దీనిని తీవ్రంగా విమర్శించింది. మహారాష్ట్ర ప్రజలు కేవలం 'ఇంటి పేరు' చూసి ఓట్లు వేయరని.. అభివృద్ధి చేసే వారికే పట్టం కడతారని షైనా ఎన్సి వంటి నేతలు ఎద్దేవా చేశారు.ముంబై, పుణెతో పాటు పింప్రి-చించ్వాడ్ సహా మొత్తం 29 మున్సిపల్ కార్పొరేషన్లకు 2026 జనవరి 15వ తేదీన పోలింగ్ జరగనుంది. మరుసటి రోజు అంటే జనవరి 16వ తేదీన ఓట్ల లెక్కింపు చేపడతారు. నామినేషన్ల దాఖలుకు డిసెంబర్ 30 చివరి తేదీ కావడంతో.. పవార్ల పొత్తు ప్రకటన అభ్యర్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. పుణె రీజియన్‌లో పట్టు సాధించేందుకు 'పవార్ పరివార్' వేసిన ఈ ఎత్తుగడ ఏ మేరకు ఫలిస్తుందో చూడాలి.



# ఉద్యోగుల పెండింగ్ బిల్లులు రూ.713 కోట్లు విడుదల

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల్లో డిసెంబర్ మాసానికి సంబంధించి రూ.713 కోట్లు విడుదల చేస్తూ డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మల్లు ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ సీఎం ఆదేశం మేరకు ఆర్థిక శాఖ అధికారులు డిసెంబర్ మాసానికి సంబంధించిన రూ.713 కోట్ల బిల్లులు బుధవారం విడుదల చేశారు. ఉద్యోగ సంఘాలకు ప్రతినెల రూ 700 కోట్ల చొప్పున విడుదల చేస్తామని గతంలో ప్రజా ప్రభుత్వం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. జూన్ నెలాఖరులో రూ.183 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఆ తర్వాత ఆగస్టు మాసం నుంచి ప్రతినెల కనీసంగా 700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వస్తోంది.విడుదల చేసిన బిల్లులో ఉద్యోగుల గ్రాట్యూటీ, జిపిఎఫ్, సరెండర్ లీవులు అడ్వాన్స్ లకు సంబంధించిన బిల్లులు ఉన్నాయి.





హైదరాబాద్ బేగంపేటలోని IAS ఆఫీసర్స్ అసోసియేషన్ క్లబ్ లో నూతన సంవత్సర వేడుకలుముఖ్య అతిథిగా హాజరై శు భాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీనియర్ IAS అధికారులు, అసోసియేషన్ సభ్యులు.

## ఏపి డిప్యూటీ సిఎం కొండగట్టు పర్యటన ఏర్పాట్లు పరిశీలన

## డిప్యూటీ సిఎం పర్యటన విజయవంతం చేయాలి,జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల, : జనవరి 3న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొండగట్టు పర్యటన సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లు పరిశీలించారు. డిప్యూటీ సిఎం పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, సభా స్థల ఏర్పాట్లు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం హెలిప్యాడ్, శిలాపలకం, గుడి ఆవరణ ప్రదేశంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పర్యటనను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఆలయ ఈవో, డీఎస్పీ తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వేములవాడ, సిరిసిల్ల మున్సిపాలిటీలను బిజెపికి అప్పగించండి.

**అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తాం.**

**ప్రజలకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి.**

**ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి ముఖ్య నాయకులు అంత మున్సిపాలిటీలో పాదయాత్ర చేయాలి.**

**బిజెపి నాయకులంతా ఐక్యంగా ఉంటే, వేములవాడ, సిరిసిల్ల మున్సిపాలిటీలను కైవసం చేసుకోవడం తధ్యమని వెల్లడి.**

**ఆశావాహుల జాబితాను రెడీ చేసి పంపాలని జిల్లా నేతలకు ఆదేశం. సర్వే ఆధారంగా గెలుపు గుర్రాలకే టికెట్ ఇస్తామని స్పష్టీకరణ.**

**ఎన్నికల సమయంలో గొడవలు పెట్టుకునే నేతలను ఉపేక్షించబోమని హెచ్చరిక.**

**వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని వెల్లడి.**

**జిల్లా నేతలతో బండి సంజయ్ సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం.**

**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** 10 సంవత్సరాల బిఆర్ఎస్, రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారిందని కేంద్ర ంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన ఆవేదనను వ్యక్తం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలలో ఈ రెండు మున్సిపాలిటీలలో బిజెపిని గెలిపిస్తే, అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదే విషయాన్ని ప్రజలకు వివరించేందుకు సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలలో పాదయాత్ర చేసి ఇంటింటికి వెళ్లాలని ఆయన బిజెపి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ టికెట్ల విషయంలో పైరవీలు, మొహమాటలకు తాగలేదని, సర్వే రిపోర్టుల ఆధారంగా గెలుపు గుర్రాలకే పార్టీ నాయకత్వం బిజెపి టికెట్లు కేటాయిస్తుందని ఆయన స్పష్టం చేశారు. టికెట్ల కోసం తనతో పాటు తన కుటుంబ సభ్యులకు ఫోన్లు కూడా చేయవద్దని, ఎవరైనా ఒత్తిడి తెస్తే వాళ్లకు వచ్చే టికెట్లు కూడా రావని ఆయన హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం రోజున సిరిసిల్లలోని మణికంఠ ఫంక్షన్ హాలులో జిల్లా ముఖ్య నేతలతో బండి సంజయ్ సమావేశం నిర్వహించారు. బండి సంజయ్ తో పాటు జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, మాజీ అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, చెన్నమనేని వికాసరావు, ఎర్రం మహేష్, కుమ్మరి శంకర్, బోయినపల్లి ప్రవీణ్ రావు తదితరులు హాజరయ్యారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలలోని పట్టణ, జోన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులు హాజరైన



సమావేశంలో బండి సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యంశాలు, వేములవాడ, సిరిసిల్ల మున్సిపాలిటీలలో బిజెపికి మంచి వాతావరణము ఉంది. ప్రజలంతా బిజెపి వైపు చూస్తున్నారు. మీరంతా కలిసి ఉంటే ఈ రెండు మున్సిపాలిటీలలో కాషాయం జెండా ఎగరవేయడం తథ్యం. ఈసారి గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తాం. సర్వే ఆధారంగానే టికెట్లు పంపిణీ ఉంటుంది. టికెట్ ఆశించడంలో తప్పు లేదని, గెలవలేని పరిస్థితి ఉన్నప్పుడు అర్థం చేసుకొని పార్టీ గెలుపు కోసం పని చేయాలి. టికెట్లు రాకపోయినా పార్టీ పరంగా, నామినేటెడ్ పోస్టుల పరంగా వారికి న్యాయం చేస్తా. ఈసారి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎక్కువ మందికి నామినేటెడ్ పోస్టులు దక్కేల కృషి చేస్తా. ఎన్నికల సందర్భంగా టికెట్ల కోసం ఇతరాత్ర విషయాల్లో గొడవలకు దిగిన నాయకులను ఎట్టి పరిస్థితులలోను ఉపేక్షించేది లేదు. వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేస్తాం. టికెట్లు రాలేదని కోపంతో పార్టీని వదిలి వెళ్లాలనుకునే వారి రాజకీయ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈసారి తెలంగాణలో రాబోయేది బిజెపి ప్రభుత్వ మేనని, రాజకీయ భవిష్యత్తును చేజేతుల నాశనం చేసుకోవద్దు. నాకు పార్టీ గెలుపు, పార్టీ ప్రయోజనాలు ముఖ్యమని ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ అభివృద్ధి విషయంలో పదేళ్లలో బిఆర్ఎస్, రెండేళ్లలో కాంగ్రెస్ చేసింది ఏమీ లేదు. కేంద్ర నిధులతోనే ఆయా మున్సిపాలిటీలలో అభివృద్ధి జరుగుతుంది. రెండు ఏళ్ల కాంగ్రెస్ పాలనలో కార్పొరేషన్, మున్సిపాలిటీలకు ఇచ్చింది గాడిద గుడ్డు మాత్రమే. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలేని బీఆర్ఎస్ కు ఓటేస్తే డ్రైనేజీలో వేసినట్టే, ఈ నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలను బిజెపికి అప్పగిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిద్దాం. ఇదే విషయాన్ని మీరు ప్రజలకు విస్తృతంగా తీసుకెళ్లండి. అందుకోసం రెండు, మూడు రోజుల్లో ఈ రెండు మున్సిపాలిటీల పరిధిలో పాదయాత్ర మొదలు చేసి ఇంటింటికి వెళ్లి ఇదే విషయాన్ని చెప్పి బిజెపికి ఓటేసేలా ప్రచారం చేయండి అని పేర్కొన్నారు.

# డీలిమిటేషన్ డ్రాఫ్ట్‌పై భారతీయ జనతా పార్టీ తీవ్ర అభ్యంతరాలు

### జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి బిజెపి ప్రతినిధుల బృందం

### జనాభా ప్రామాణికమా విస్తీర్ణం ప్రామాణికమా ఓటర్ల సంఖ్య ప్రామాణికమా

### ప్రశ్నించిన ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్



.హైదరాబాద్.డిసెంబర్ 31 జీహెచ్ఎంసీ పరిధిని విస్తరిస్తూ, శివారు మున్సిపాలిటీలను విలీనం చేసి, ప్రస్తుతం ఉన్న 150 డివిజన్లను 300 డివిజన్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన డీలిమిటేషన్ డ్రాఫ్ట్‌పై భారతీయ జనతా పార్టీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో జరుగుతున్న డీలిమిటేషన్ ప్రక్రియను పర్యవేక్షించే భాగంగా, బీజేపీ డీలిమిటేషన్ పర్యవేక్షణ కమిటీ సభ్యులు జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి ఈ ప్రక్రియపై విస్తృతంగా చర్చించారు.ఈ సమావేశంలో బిజెపి మాజీ ఎమ్మెల్యే డా.ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ , పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గౌతం రావు , మాజీ మేయర్ బండా కార్తీక రెడ్డి , బీజేపీ నాయకులు శ్రీకాంత్ , భానుప్రకాష్ , మహేందర్ ¢ రాధా ధీరజ్ రెడ్డి తో కూడిన బీజేపీ ప్రతినిధి బృందం పాల్గొని, డీలిమిటేషన్‌లో ఉన్న లోపాలు, అభ్యంతరాలపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్లింది.అనంతరం.. జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసిన అనంతరం బిజెపి మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూమా చర్చల సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు విడుదల చేసిన 300 డివిజన్ల తుది జాబితా అనేక తప్పులతడకలతో నిండి ఉందని మేము స్పష్టంగా ప్రశ్నించాం. ఒక్కొక్క అంశంపై నిలదీసి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేసినప్పటికీ, జీహెచ్ఎంసీ అధికారుల నుంచి ఒక్క స్పష్టమైన సమాధానం కూడా రాలేదన్నారుఒక్క డివిజన్ రెండు శాసనసభ నియోజకవర్గాల్లో ఉండటం,ఒక్క డివిజన్ రెండు రెవెన్యూ జిల్లాల్లో విస్తరించి ఉండటం,జనాభా ప్రామాణికమా? విస్తీర్ణం ప్రామాణికమా? ఓటర్ల సంఖ్య ప్రామాణికమా?ఇలాంటి మౌలిక అంశాల్లో ఏ ప్రామాణికాన్ని తీసుకొని జీహెచ్ఎంసీలో డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంచారో చెప్పాలని ప్రశ్నించగా, దానికి కూడా అధికారులు సరైన సమాధానం ఇవ్వలేకపోయారు.ఇది జీహెచ్ఎంసీ స్వయంగా రూపొందించిన 300 డివిజన్ల మ్యాప్‌లా కనిపించడం లేదని, గాంధీభవన్, దారుస్సలాంలో కూర్చొని ఒక ప్రైవేట్ సర్వే ఏజెన్సీ రూపొందించిన ప్రతిపాదనలా ఉందని మేము కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై జీహెచ్ఎంసీ అధికారులు కూడా తబ్బిబ్బుకు గురైన పరిస్థితి కనిపించింది.డీలిమిటేషన్‌పై ప్రజల నుంచి దాదాపు 10 వేల అభ్యంతరాలు, సూచనలు వచ్చినప్పటికీ, వాటికి సమాధానం చెప్పే తీరిక కూడా జీహెచ్ఎంసీకి లేదని స్పష్టమవుతోంది. అక్కడక్కడ కేవలం పేర్లు మాత్రమే మార్చారు తప్ప, సహజ భౌగోళిక స్వరూపం, జనాభా సమతుల్యత, ఓటర్ల ప్రామాణికం వంటి కీలక అంశాల్లో ఎక్కడా దిద్దుబాటు జరగలేదు.జీహెచ్ఎంసీ ప్రజలను అడ్డుపెట్టుకుని, విస్తీర్ణాన్ని కారణంగా చూపుతూ వేల కోట్ల రూపాయల విదేశీ రుణాలు తెచ్చుకోవాలనే లక్ష్యంతోనే ఈ పరిధి విస్తరణ జరిగిందని భారతీయ జనతా పార్టీ ఆరోపిస్తోంది.ఇది సాధారణ, సామాన్య పౌరులకు మెరుగైన పరిపాలన అందించేందుకు కాదు.. కేవలందారుస్సలాం-గాంధీభవన్ చేతుల్లో జీహెచ్ఎంసీని అప్పగించేందుకు రూపొందించిన ప్రక్రియలా కనిపిస్తోంది తప్ప,ప్రజాప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయంగా కనిపించడం లేదు.ఇది సామాన్య పౌరులకు మెరుగైన పాలన అందించాలనే ఉద్దేశంతో తీసుకున్న నిర్ణయం కాదని స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం గాంధీభవన్, దారుస్సలాం చేతుల్లో జీహెచ్ఎంసీని అప్పగించేందుకే రూపొందించిన ప్రణాళికలా ఈ డీలిమిటేషన్ ప్రక్రియ ఉందని భారతీయ జనతా పార్టీ అభిప్రాయపడుతోంది.

నిన్న కూడా నగరంలో కుక్క కాటుతో ఒక పసిప్రాణం తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకున్నప్పటికీ, కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా కూడా ప్రభుత్వం ఇప్పటివరకు జీహెచ్ఎంసీలో కనీస పరిపాలన అందించలేని పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ప్రభుత్వం, అధికారులు 300 డివిజన్లలో ప్రజలకు ఎలా సమర్థవంతమైన పాలన అందిస్తారు? అనే తీవ్రమైన సందేహం ప్రజల్లోఉత్పన్నమవుతోందన్నారుఈ ప్రజావ్యతిరేక, అవ్యవస్థిత డీలిమిటేషన్ ప్రక్రియపై భారతీయ జనతా పార్టీ స్పష్టమైన కార్యాచరణ రూపొందించి, ప్రజల్లోకి వెళ్లిఉద్యమిస్తుందన్నారు.దారుస్సలాం-గాంధీభవన్ నిరంకుశ పరిపాలన తీరును ప్రజల ముందు ఎండగడతామన్నారు.జీహెచ్ఎంసీ విస్తరణ పేరిట జరుగుతున్న అక్రమాలు, ప్రజావ్యతిరేక నిర్ణయాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికలు పెడతామంటే అడ్డుకుంటాం

### బీసీ రిజర్వేషన్లు పెంచే బాధ్యత బిజెపి, కాంగ్రెస్ పార్టీలదే

### బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం అసెంబ్లీ వేదికగా రాజకీయ కార్యచరణ ప్రకటించాలి

### ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలు పెడతామంటే అసెంబ్లీ ముట్టడిస్తాశీ

జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి హైదరాబాద్ డిసెంబర్ 31 బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తే వేలాది మందితో రాష్ట్ర అసెంబ్లీని ముట్టడిస్తామని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు నేడు హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో, గుజ్జ కృష్ణ సమన్వయం తో అఖిలపక్ష పార్టీలు బీసీ సంఘాల సంయుక్త సమావేశం జరిగింది ఈ సమావేశానికి హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కాంగ్రెస్ నేత వి.హెచ్, టిఆర్ఎస్ నేతలు సీ మధుసూనా చారి, వి శ్రీనివాస్ గౌడ్, టీజేఎస్ నేత పల్లె వినయ్, సిపిఐ నేత ధనుంజయ నాయుడు హాజరయ్యారు మొదటగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ప్రభుత్వం ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల నిర్వహిస్తామంటే ఎట్టి పరిస్థితుల్లో ఒప్పుకునే ప్రసక్తి లేదని కామారెడ్డి డిక్లరేషన్ చట్టబద్ధంగా అమలు చేసిన తర్వాతనే ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో చర్చించి కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి పెంచడానికి అఖిలపన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి రాజకీయ పోరాట కార్యక్రమం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు బీసీ రిజర్వేషన్లు పెంచకుండా బిజెపి మోకాలు అడ్డుతుందని, బిజెపికి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే నూతన సంవత్సరంలోనైనా బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలిపాలని ఆయన డిమాండ్ చేశారు బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం జనవరిలో బీసీ సర్పంచుల రాష్ట్ర సమాచార ఏర్పాటు చేస్తామని ఫిబ్రవరి రెండో వారం నుండి బీసీల రథయాత్ర రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టి ఏప్రిల్ మాసంలో లక్షల మందితో హైదరాబాదులో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు బీసీల పోరాట ఫలితంగానే బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలు 86 సర్పంచులుగా గెలిచారని ఇది తమ పోరాట విజయమని ఆయన తెలిపారు హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల అంశం జాతీయస్థాయి పరిధిలో ఉందని బీసీ సంఘాలు ఒక్కతాటి మీదికి వచ్చి బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం జాతీయస్థాయిలో పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు ఓబీసీ ప్రధానిగా ఉన్న నరేంద్ర మోడీ సామాజిక న్యాయం అమలు చేయడానికి ముందు వరుసలో ఉన్నారని మోడీ గారిని ఒప్పించి మెప్పిచ్చి బీసీ రిజర్వేషన్లు సాధిద్దామని త్వరలోనే ప్రధాని మంత్రి సమయం కోరుతామని బీసీ రిజర్వేషన్ అంశంలో ప్రధానమంత్రిని కలవడానికి ప్రయత్నిస్తానని దత్తాత్రేయ వెల్లడించారు కాంగ్రెస్ నేత వి హనుమంతరావు మాట్లాడుతూసీ రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని పైన ఒత్తిడి పెంచడానికి వచ్చే బడ్జెట్ పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రైవేటు బిల్లు ప్రవేశపెడతామని ప్రవేటు బిల్లు ప్రవేశపెట్టే బాధ్యతను కూడా కాంగ్రెస్ సాధిస్తారని తనకు అప్పజెప్పిందని ఆయన వెల్లడించారు బీసీ రిజర్వేషన్ అంశంపై ప్రైవేట్ బిల్లు పార్లమెంటులో ప్రవేశ పెట్టిన తర్వాత బీసీలకు అణుకులు ఎవరో వ్యతిరేకులు ఎవరో తేలిపోనుందని అందరూ అనుకూలమైతే బీసీ బిల్లు ఆమోదమై 42 శాతం రిజర్వేషన్లు సాధిస్తామని ఆయన వెల్లడించారు టిఆర్ఎస్ శాసనసభ పక్ష నేత సిరికొండ మధు సుధనా చారి, మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం విద్యా, ఉద్యోగాలు, చట్ట సభలలో మరియు కాంట్రాక్ట్ లలో 42 చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేయడం జరిగింది.రాబోయే మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 42 రిజర్వేషన్లు కల్పించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు.

లేకుంటే తెలంగాణ ఉద్యమం తరహా ప్రజలతో మమేకమై ప్రజా ఉద్యమాలతో ఉద్యమ కార్యచరణ ప్రకటించి 42 బీసీ రిజర్వేషన్లు సాధిద్దామని పిలుపు నిచ్చారు. సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 రిజర్వేషన్లు ఇవ్వకుండా మోసం చేయడమే కాకుండా, ఉన్న రిజర్వేషన్ల ను తగ్గించి 17 రిజర్వేషన్లు మాత్రమే బీసీలకు ఇవ్వడం జరిగిందనీ.కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు అనుకుంటే వెంటనే బీసీ రిజర్వేషన్లు ఇవ్వొచ్చు, కానీ బిజెపి పార్టీ తనకు పట్టనట్లు, సంబంధం లేదన్నట్లు ఉంటు, బీసీలను మోసం చేస్తున్నది కాంగ్రెస్, బిజెపి పార్టీ లే అని వారు విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల పై బిఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉంది,

అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల పెంపు తీర్మానానికి మద్దతు తెలపడం జరిగింది, అఖిల పక్ష భేటీలో మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉందనీ వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, కోచైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందరం గణేష్ చారి, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కుర్మా, బీసీ మహిళా సంఘం అధ్యక్షులు బి మని మంజరి సాగర్, బీసీ జేఏసీ వైస్ చైర్మన్ దీటి మల్లయ్య, కాటేపల్లి వీరస్వామి, పిట్ల శ్రీధర్, బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్, బీసీ జేఏసీ కన్వీనర్ మట్ట వెంకట్ గౌడ్, జాజుల లింగం గౌడ్, ఇదిగ శ్రీనివాస్ గౌడ్, వేముల రామకృష్ణ, గూడూరు భాస్కర్ మేరు, ఉదయ్ నేత, తారాకేశ్వరి, మాధవ్ మేరు, తదితరులు పాల్గొన్నారు.




# సంఘాలది కపట నాటకం.. సర్కార్‌ది స్నేహ హస్తం!

### టి.ఎస్.జే.యు. రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని

### పదేళ్లు నిద్రపోయిన సంఘాలే.. నేడు మొసలి కన్నీరు కారుస్తున్నాయి – ఆ ఆందోళనల వెనుక ఉన్నది జర్నలిస్టుల సంక్షేమం కాదు.. స్వార్థ రాజకీయమే – రేవంత్ రెడ్డి ప్రభుత్వానిది జర్నలిస్టు ఫ్రెండ్లీ విధానం: తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ స్పష్టీకరణ – కమిషనర్‌తో భేటీలో సమస్యల పరిష్కారంపై హామీ

హైదరాబాద్ (డిసెంబర్ 31): ః(ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అక్రిడిటేషన్ రగడకు కారణం ప్రభుత్వం కాదు.. దశాబ్దాలుగా వ్యవస్థను శాసిస్తున్న కొన్ని యూనియన్ల స్వార్థమే. గత బి. ఆర్. ఎస్. ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా పెదవి విప్పని, పాదం కదపని నాయకులు.. ఇప్పుడు చేస్తున్న ధర్నాలు కేవలం ¢కపట నాటకాలు¢ మాత్రమే. కానీ రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం మాత్రం జర్నలిస్టుల పట్ల అత్యంత సానుకూలంగా ఉంది ః అని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ స్పష్టం చేసింది.మంగళవారం సమాచార శాఖ కమిషనర్‌ను కలిసిన అనంతరం టి.ఎస్.జే.యు. నాయకులు మాట్లాడుతూ , సంఘాల మోసాన్ని నమ్మొద్దు: ఃగత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టు నిధులు పక్కదారి పడుతున్నా, ఇన్సూరెన్స్ ఆగిపోయినా చోద్యం చూసిన కొన్ని సంఘాలు.. ఇప్పుడు తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రభుత్వంపై బురద చల్లుతున్నాయి. జీవో రూపకల్పనలో లోపాలకు కారణం ఆ సంఘాల తప్పుడు సలహాలే. ఇప్పుడు జర్నలిస్టులు తిరగబడేసరికి.. ప్లేట్ ఫిరాయించి ఆందోళనల పేరుతో కొత్త డ్రామాలు ఆడుతున్నాయి. జర్నలిస్టులు ఈ మోసాన్ని గమనించాలిః అని టి.ఎస్.జే.యు.హెచ్చరించింది.ప్రభుత్వం సానుకూలం – కమిషనర్ భరోసా: ఃజర్నలిస్టుల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందన చాలా సానుకూలంగా ఉంది. అర్హులైన జర్నలిస్టులకు అన్యాయం చేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్ది అందరికీ న్యాయం చేస్తామని ఆయన భరోసా ఇచ్చారుః అని తెలిపారు.చర్చల్లోని ముఖ్యాంశాలు – విజయాలు:ఇన్సూరెన్స్ పక్కా: జర్నలిస్టుల కుటుంబాలకు రక్షణగా నిలిచే ¢గ్రూప్ ఇన్సూరెన్స్¢ పథకాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని, త్వరలోనే దీనిపై నిర్ణయం వెలువడుతుందని తెలిపారు.డెస్క్ జర్నలిస్టులకు గుర్తింపు: క్షేత్రస్థాయి జర్నలిస్టులతో సమానంగా డెస్క్ జర్నలిస్టులకు కూడా ప్రభుత్వ పథకాలు, అక్రిడిటేషన్ వర్తింపజేసేలా జీవోలో మార్పులు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు.చిన్న పత్రికలకు న్యాయం: గతంలో మాదిరిగా కాకుండా, చిన్న పత్రికల ఎంపానెల్మెంట్ ప్రక్రియను సరళతరం చేసి, వాటికి అండగా ఉంటామని ప్రభుత్వం చెప్పినట్లు వెల్లడించారు.ప్రజా ప్రభుత్వంపై నమ్మకం ఉంది: కొన్ని సంఘాలు చేస్తున్న విష ప్రచారాన్ని నమ్మవద్దని, రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం జర్నలిస్టుల పక్షపాతని.. త్వరలోనే అన్ని సమస్యలకు సానుకూల పరిష్కారం లభిస్తుందని టి.ఎస్.జే.యు. ఆశాభావం వ్యక్తం చేసింది.ఈ కార్యక్రమంలో టి.ఎస్.జే.యు. రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని , ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ తోకల, ఆర్గ నైజింగ్ సెక్రటరీ క్రాంతి తదితరులు తదితరులు పాల్గొన్నారు.



# వల్లభనేని వంశీ మోహన్ మిస్సింగ్

విజయవాడ, డిసెంబర్ 31, వల్లభనేని వంశీ మోహన్ మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కొత్త కేసులు చుట్టుముట్టడంతో అనుచరులతో కలిసి అండర్ గ్రౌండ్ లోకి వెళ్లారు. అయితే ఆది నుంచి వల్లభనేని వంశీ విషయంలో ఒక దూకుడు కనిపించింది. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఆయన టిడిపి ఎమ్మెల్యే. పార్టీ ఫిరాయించారు సరే. కానీ అదే పనిగా చంద్రబాబుతో పాటు లోకేష్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దానికి ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నారు. వాస్తవానికి వల్లభనేని వంశీ మోహన్ పై కొత్తగా కేసులు నమోదు చేయలేదు కూటమి ప్రభుత్వం. తనకు తానుగా చేసిన తప్పిదాలకు ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు వంశి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి శ్రేణులపై ఆయన దాడి చేయించారు. దీంతో ఆయనతో పాటు అనుచరులపై కేసు నమోదు అయింది. ఎక్కడ అరెస్టు చేస్తారేమోనని ఆయన పరారీ అయ్యారు. కోర్టుల నుంచి తన అరెస్టు విషయంలో సానుకూలత వచ్చేవరకు ఆయన పరారీ లోనే ఉంటారువల్లభనేని వంశీ మోహన్ జగన్మోహన్ రెడ్డికి రాజకీయంగా అండగా నిలిచారు. టిడిపిలో గెలిచి వైసీపీలో ఫిరాయించారు. అయితే నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేస్తూ చంద్రబాబుతో పాటు లోకేష్ ను డామేజ్ చేయాలని చూశారు. కానీ అది వర్కౌట్ కాలేదు సరి కదా ఇప్పుడు ఇబ్బందుల్లో పడ్డారు వంశీ మోహన్. ఇప్పటికే జైలుకు వెళ్లి అనారోగ్యానికి గురయ్యారు. రాజకీయంగా కూడా అంత యాక్టివ్ కాలేకపోతున్నారు. మరోసారి అజ్ఞాతంలోకి అంటే ఎప్పటికైనా మళ్లీ అరెస్టు జరిగే అవకాశం ఉంది. అందుకే జగన్మోహన్ రెడ్డి గన్నవరం విషయంలో ఒక నిర్ణయానికి రాబోతున్నట్లు ప్రచారం సాగుతోంది. వంశీని సైడ్ చేసి కొత్త నేతను తెచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.వల్లభనేని వంశీ విషయంలో జరిగిన వ్యవహారం పై ఎవరూ నోరు మెదపడం లేదు. పైగా సానుభూతి చూపించడం లేదు. నిజంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు జగన్మోహన్ రెడ్డిని అభిమానించి.. సంప్రదాయ రాజకీయానికి అలవాటు పడిన ఏ ఒక్క నేత అప్పట్లో వల్లభనేని వంశీ వాడిన భాష, వ్యాఖ్యలను ఇష్టపడలేదు. వైయస్సార్ పార్టీ ఓటమికి ఇటువంటి నేతలే కారణం అన్న అభిప్రాయం కూడా ఉంది. అయితే ఇప్పుడు వల్లభనేని వంశీ మోహన్ కోసం వెయిట్ చేసే ఉద్దేశం జగన్మోహన్ రెడ్డికి లేదు. అందుకే ప్రత్యామ్నాయ నేతను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.గన్నవరంలో ప్రత్యామ్నాయ నాయకులు చాలామంది ఉన్నారు. వారందరూ యాక్టివ్ అవుతున్నారు. ఇంకోవైపు కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా నేత ఒకరు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటికే బలమైన నాయకత్వం ఉండగా గన్నవరం టిక్కెట్ ఇచ్చారు చంద్రబాబు 2014లో వల్లభనేని వంశీ మోహన్ కు. 2019లో సైతం రెండోసారి టిక్కెట్ ఇచ్చారు. రెండుసార్లు టికెట్ ఇచ్చి గెలిపించుకున్న చంద్రబాబుపై అనుచితంగా మాట్లాడారు వల్లభనేని వంశీ మోహన్. కానీ ఇప్పుడు ఎవరికోసమైతే ఇదంతా చేశారో అదే జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు గన్నవరం నియోజకవర్గం గురించి సీరియస్గా ఆలోచిస్తున్నారు. తప్పకుండా గన్నవరం నియోజకవర్గానికి కొత్త ఇన్చార్జ్ రావడం ఖాయం అని ప్రచారం నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# తిరుమల తరహాలో చెంచులకు శ్రీశైలంలో ప్రాధాన్యం

కర్నూలు, డిసెంబర్ 31, శ్రీశైలం దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీశైలంలో చెంచులకు ఉచితంగా మల్లికార్జునస్వామి స్పర్శ దర్శనం కల్పిస్తున్నారు. చెంచులకు ఉచిత స్పర్శ దర్శనాన్ని శ్రీశైలం దేవస్థానం బోర్డు ఛైర్మన్ రమేష్ నాయుడు, శ్రీశైలం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రతి మంగళవారం రోజున 500 మంది చెంచులు శ్రీశైలం మల్లన్న స్పర్శ దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి నెలా ఒకరోజు చెంచులకు ఉచితంగా స్పర్శ దర్శనం కల్పించనున్నట్లు వివరించారుతిరుమల.. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులకు పవిత్ర పుణ్య క్షేత్రం. జీవితంలో ఒక్కసారైనా తిరుమల కోనేటి రాయుడి దర్శనం చేసుకోవాలని ప్రతి మనసూ తపిస్తూ ఉంటుంది. అలాగే తిరుమల శ్రీవారి వైభవాన్ని, తిరుమల ఆధ్యాత్మిక వాతావరణాన్ని కళ్లారా చూడాలని ప్రతి వ్యక్తి కోరుకుంటాడు. ఈ నేపథ్యంలోనే శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు చేపడుతూ వస్తోంది. దేవుడి దర్శనం మొదలుకొని వసతి వరకూ ప్రతి విషయంలోనూ అత్యంత జాగ్రత్తతో వ్యవహరిస్తూ వస్తోంది. అలాగే స్థానికులకు తిరుమల శ్రీవారిని మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో తిరుపతి వాసులకు.. శ్రీవారి దర్శనం ఉచితంగా కల్పిస్తోంది.ప్రతి నెలలో ఓ రోజు స్థానికులకు శ్రీవారి దర్శన భాగ్యం కల్పిస్తోంది.

ప్రతి నెలా మెదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం అవకాశాన్ని టీటీడీ కల్పిస్తోంది. అయితే తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే శ్రీశైలం దేవస్థానం కూడా కీలక నిర్ణయం తీసుకుంది.

శ్రీశైలంలో చెంచులకు ఉచితంగా స్పర్శ దర్శనం కల్పిస్తోంది. ప్రతి నెలలో ఒకరోజుచెంచులకు ఉచితంగా శ్రీశైలం మల్లన్న స్పర్శ దర్శనం కల్పిస్తున్నారు. చెంచులకుఉచిత స్పర్శ దర్శనాన్ని శ్రీశైలం దేవస్థానం బోర్డు ఛైర్మన్ రమేష్నాయుడు, ఈవో శ్రీనివాసరావు ప్రారంభించారు. మంగళవారం రోజున సుమారుగా 500 మంది చెంచు గిరిజనులు శ్రీశైలంలో స్పర్శ దర్శనం చేసుకున్నారు.

శ్రీశైలం దేవస్థానం పాలకమండలి నిర్ణయం మేరకు ప్రతి నెలా ఒకరోజు చెంచులకు ఉచితంగా స్పర్శ దర్శనం కల్పిస్తామని ఆలయ అధికారులు చెప్తున్నారు. స్వామిని గిరిజనులకు మరింత చేరువ చేయాలనే మంచి ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రతి నెలలో ఓ రోజు చెంచులలో కొంతమందిని ఎంపిక చేసి.. వారికి స్పర్శ దర్శనం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం ఐటీడీఏ సహకారం తీసుకుంటామని.. ఐటీడీఏ సహకారంతో ఉచిత స్పర్శ దర్శనానికి చెంచు గిరిజనులను ఎంపిక చేస్తామన్నారు. దర్శనంతో పాటుగా వారి రాకపోకలకు, వసతి ఏర్పాట్లు కూడా చేయనున్నట్లు వివరించారు.

# అనంతపురానికి మహర్దశ

అనంతపురం, డిసెంబర్ 31, పారిశ్రామిక అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే నినాదంతో పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు భారీ పెట్టుబడులు వస్తున్నాయి. రేమండ్ గ్రూప్, స్కై ఫ్యాక్టరీ, గిన్ఫ్రా ప్రెసిషన్, సుగ్నా స్పాంజ్ పవర్ వంటి కంపెనీలు.. భారీ పెట్టుబడులుతో యూనిట్లను నెలకొల్పడానికి ముందుకు వచ్చాయి. కాగా, ఏడాదిన్నర కాలంలోనే అనంతపురం జిల్లాలో రూ. 4,194 కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3 వేల మందికి పైగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.వ్యవసాయంతో పాటు పారిశ్రామిక అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు నేతృత్వంలో అడుగులు వేస్తోంది. అందులో భాగంగాపెట్టుబడులు ఆకర్షించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది ఏపీ ప్రభుత్వం. అయితే పరిశ్రమలను ఒకేచోట కేంద్రీకృతం చేయకుండా.. జిల్లాల్లో కూడా ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తోంది. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ముఖ్యంగా వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా అనంతపురం జిల్లాకు పరిశ్రమల రాకతోనే ఆర్థిక పురోగతి సాధ్యమవుతుందని విశ్వసిస్తోంది. అందులో భాగంగా ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులను ప్రోత్సహిస్తోంది. జిల్లాకు క్యూ కట్టేలా.. రాయితీలు, ప్రోత్సాహకాలు, భూమి, నీరు కేటాయింపులు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తోంది. ఏడాదిన్నర కాలంలోనే దాదాపు రూ. 4,194 కోట్ల పెట్టుబడులు అనంతపురం జిల్లాకు వచ్చినట్లు ప్రభుత్వం చెబుతోంది. దీని ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా సుమారు 3 వేల మందికి పైగా ఉద్యోగాలు రానున్నట్లు చెప్పింది. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో అనంతపురం జిల్లాకు పలు రకాల పెట్టుబడులు రాగా.. ఇప్పటికే సీఎం చంద్రబాబు కొన్నింటికి శంకుస్థాపన కూడా చేశారు.ప్రభుత్వం చెప్పిన వివరాల ప్రకారం.. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో.. రేమండ్ గ్రూప్ మూడు యూనిట్లను నెలకొల్పనుంది.ఈ మేరకు ఆ సంస్థ రూ. 1200 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఇందులో రాప్తాడు దగ్గర అప్పారెల్ పార్కు కోసం రూ. 497 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి వద్ద ఆటో కాంపొనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంటు నెలకొల్పడానికి రూ. 441 కోట్లు, టేకులోడు వద్ద ఏరోస్పేస్ పరికరాల తయారీ యూనిట్ కోసం రూ. 262 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ మూడు యూనిట్లతో.. 6,500 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నట్లు తెలిపింది.స్కై ఫ్యాక్టరీ అనే సంస్థ కళ్యాణదుర్గంలోని తిమ్మసముద్రం వద్ద ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందు రూ. 1,300 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. వెయ్యి ట్యాక్సీల తయారీ లక్ష్యంగా ఈ యూనిట్ 2027 నాటికి ఉత్పత్తి ప్రారంభించనుంది.

ఈ పరిశ్రమ ద్వారా 180 మందికి పైగా ఉద్యోగాలు లభించనున్నాయి. దీనికి సమీపంలోనే గిన్ఫ్రా ప్రెసిషన్ ప్రైవేటు లిమిటెడ్ అనే కంపెనీ.. బై మాడ్యూలర్ ఛార్జ్ సిస్టమ్స్ తయారు చేసేందుకు యూనిట్ను ఏర్పాటు చేసేందుకు రూ. 1,150 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ సంస్థ 121 ఎకరాల్లో తయారీ యూనిట్ నెలకొల్పేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.తాడిపత్రి మండలం బోగసముద్రం వద్ద కార్యకలాపాలు నిర్వహిస్తున్న సుగ్నా స్పాంజ్ పవర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ.. మరో యూనిట్ నెలకొల్పేందుకు రూ. 1,247 కోట్ల పెట్టుబడులకు ప్రభుత్వం నుంచి అనుమతులు పొందింది. ఈ కొత్త తయారీ

# చిన్నారుల ఫ్యాషన్ షో అదరహో

ఆసక్తి, ఉత్సాహం ఉంటే అంగవైకల్యం అడ్డు రాదని చిన్నారులు నిరూపించారు. వైకల్యాన్ని అధిగమిస్తూ చిన్నారులు ర్యాంపుపై బుడిబుడి హంస నడకలతో చిట్టిపొట్టి చిన్నారులు అలరించారు. జూబ్లీహిల్స్ లో లుక్స్ ప్రొడక్షన్, బిగ్బాస్ ఫేమ్ కౌశల్ ఆధ్వర్యంలో లిటిల్ మిస్టర్, మిస్ ఇండియా అందాల పోటీలను నిర్వహించారు. మూడేళ్ల నుంచి 19 ఏళ్ల వయసు వరకు 8 విభాగాల్లో ఫ్యాషన్ షో జరిగింది. మూగ, చెవిటి చిన్నారులు పాల్గొని ఔరా అనిపించారు. 3-6 సంవత్సరాల విభాగంలో లిటిల్ మిస్ సౌత్ ఇండియా విన్నర్ సౌఖ్య. రెండో స్థానంలో శ్రీ అక్ష మూడో స్థానంలో షనాయా నిలిచారు. 3-6 సంవత్సరాల లిటిల్ మిస్టర్ సౌత్ ఇండియా మొదటి స్థానంలో యువ వర్మ, రెండో స్థానంలో సాయి, రేయాన్స్, మూడో స్థానంలో మనీష్ జైన్ నిలిచారు.

# కాపు దళిత నినాదంతో కొత్త పార్టీ

విజయవాడ, డిసెంబర్ 31, ఆంధ్రప్రదేశ్ రాజకీయ యవనికపై మరో కొత్త అధ్యాయం మొదలుకానుందా? గడిచిన ఎన్నికల్లో కూటమి ప్రభంజనం ముందు డీలాపడ్డ ప్రతిపక్షం.. ఇప్పుడు సరికొత్త వ్యూహానికి తెరలేపుతోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం జోరుగా సాగుతున్న ప్రచారం ప్రకారం.. ఏపీలో కాపు, దళిత సామాజిక వర్గాల కలయికతో ఒక కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. సస్పెండెడ్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ వ్యూహ రచన, దివంగత నేత వంగవీటి మోహన రంగా కుమార్తె వంగవీటి ఆశ భాగస్వామ్యంతో ఈ కొత్త శక్తి తెరపైకి రాబోతోందని విశ్వసనీయ సమాచారం.కొంతకాలం క్రితం సస్పెండెడ్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. "కాపులు, దళితులు ఏకతాటిపైకి వస్తేనే రాజ్యాధికారం సాధ్యం. కాపు సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి పీఠం, దళితులకు ఉపముఖ్యమంత్రి పదవి దక్కాలి" అనేది ఆయన ప్రతిపాదన. ఒక మాజీ అధికారిగా కాకుండా, ఒక పొలిటికల్ స్ట్రాటజిస్ట్ లా ఆయన చేసిన ఈ వ్యాఖ్యల వెనుక వైసీపీ పెద్దల హస్తం ఉందనేది బలంగా వినిపిస్తున్న ఆరోపణ. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కీలక బాధ్యతలు నిర్వర్తించి, ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనే ముద్ర పడిన సునీల్ కుమార్.. ఇప్పుడు తెరవెనుక ఉంటూ ఈ కొత్త రాజకీయ ప్రయోగానికి రూపకల్పన చేస్తున్నట్లు తెలుస్తోంది.ఈ కొత్త సమీకరణంలో ప్రధాన ఆకర్షణ వంగవీటి ఆశ. దివంగత వంగవీటి మోహన రంగాకు కాపు సామాజిక వర్గంలో ఉన్న ఆరాధన భావం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇటీవల విశాఖలో నిర్వహించిన 'రంగా సేన' ఆత్మీయ సమ్మేళనం ఈ కొత్త పార్టీ ఊహాగానాలకు ఊపిరి పోసింది. ఈ సభలో కాపులతో పాటు దళితులు, బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగా ఆశయ సాధన కోసం కొత్త వేదిక అవసరం అని మెజారిటీ కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేయడం గమనార్హం. వంగవీటి రాధా రాజకీయంగా మౌనంగా ఉంటున్న తరుణంలో, రంగా వారసత్వాన్ని అందిపుచ్చుకుని, ఆయన ఇమేజ్ ద్వారా కాపు యువతను ఆకర్షించడానికి వంగవీటి ఆశను ముందు పెడుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.2024 ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఘనవిజయం సాధించడానికి ప్రధాన కారణం కాపు ఓట్ల ఏకీకరణ. పవన్ కళ్యాణ్ చొరవతో కాపు ఓట్లు గంపగుత్తగా కూటమికి పడ్డాయి. ఇది వైసీపీని కోలుకోలేని దెబ్బ తీసింది. వచ్చే ఎన్నికల నాటికి ఈ ఓటు బ్యాంకును చీల్చకపోతే వైసీపీకి భవిష్యత్తు కష్టమే. అందుకే, నేరుగా వైసీపీలో చేరలేని కాపు, దళిత వర్గాలను ఆకర్షించడానికి ఒక మూడో ప్రత్యామ్నాయం లేదా కొత్త పార్టీ అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే.. రంగా సెంటిమెంట్ ను వాడుకుని కాపు ఓట్లను చీల్చడం, దానికి దళిత ఓట్లను జత చేయడం ద్వారా కూటమి ఓటు బ్యాంకుకు గండి కొట్టాలనేది మాస్టర్ ప్లాన్ గా కనిపిస్తోంది. పీవీ సునీల్ కుమార్, వంగవీటి ఆశలతో పాటు మరికొందరు వైసీపీ సానుభూతిపరులు, మేధావులు ఈ పార్టీలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.అయితే, కేవలం సామాజిక సమీకరణాలతో పార్టీని నడపడం అంత సులభం కాదు. వంగవీటి ఆశకు క్షేత్రస్థాయిలో రాజకీయ అనుభవం తక్కువ. పవన్ కళ్యాణ్ లాంటి ఛరిష్మా ఉన్న నేత ముందు ఆమె ఎంతవరకు నిలబడగలరనేది ప్రశ్న. గతంలో కాపు, దళిత సామాజిక వర్గాలను ఏకం చేయడానికి జరిగిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. బీఎస్పీ-జనసేన పొత్తు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. ఈ రెండు వర్గాల మధ్య క్షేత్రస్థాయిలో ఉన్న అంతరాలను చెరిపివేయడం కత్తి మీద సాము లాంటిది. అన్నిటికీ మించి ఈ కొత్త పార్టీ వెనుక జగన్ మోహన్ రెడ్డి ఉన్నారనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళితే, అది అంతిమంగా ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది.మొత్తానికి, ఏపీలో మరో కొత్త పార్టీ ఆవిర్భావానికి రంగం సిద్ధమవుతోందన్నది కాదనలేని సత్యం. వచ్చే ఎన్నికల నాటికి పూర్తిస్థాయిలో యాక్టివ్ అయ్యేలా గ్రౌండ్ వర్క్ జరుగుతోంది. ఇది కేవలం ఓట్ల చీలిక కోసమే పుడుతోందా? లేక నిజంగానే బడుగు, బలహీన వర్గాలకు ప్రత్యామ్నాయ వేదిక అవుతుందా? అనేది కాలమే నిర్ణయించాలి.

# పెరగనున్న రైళ్ల సంఖ్య..

విజయవాడ, డిసెంబర్ 31, రైళ్ల రద్దీని తగ్గించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రానున్న ఐదేళ్లలో దేశంలోని 48 ప్రధాన రైల్వే స్టేషన్ల నుంచి రైళ్ల సంఖ్యను రెట్టింపు చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి నడిచే రైళ్ల సంఖ్య రెట్టింపు కానుంది. ప్రస్తుతం 37 రైళ్లు నడుస్తుండగా, ఈ సంఖ్య 74కు చేరుకుంటుంది. రూ.500 కోట్లతో స్టేషన్ అభివృద్ధి, ప్లాట్‌ఫారాల విస్తరణతో పాటు, కొత్త కోచింగ్ డిపో ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.రాబోయే ఐదేళ్లలో విశాఖపట్నం నుంచి నడిచే రైళ్ల సంఖ్య రెట్టింపు అవుతుందని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని కేంద్ర రైల్వే శాఖ ప్రకటించింది. ఇదిలా ఉంటే ఇప్పటికే రూ. 500 కోట్లతో విశాఖ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల సంఖ్యను 8 నుంచి 14కు పెంచుతామని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. రాబోయే ఐదేళ్లలో విశాఖపట్నం డివిజన్‌లో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతాయని రైల్వే వర్గాలు వెల్లడించాయి.ప్రస్తుతం విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి రోజుకు 37 రైళ్లు నడుస్తున్నాయి. కేంద్రం నిర్ణయం ప్రకారం, రాబోయే ఐదేళ్లలో ఈ సంఖ్య 74కు చేరుకుంటుంది. అంటే, విశాఖ నుంచి డిమాండ్ అధికంగా ఉండే సికింద్రాబాద్, బెంగళూరు, చెన్నై, తిరుపతి, ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్, కోల్‌కతా, రాయ్‌పూర్ వంటి నగరాలతో పాటు, అరకులోయ వంటి పర్యాటక ప్రాంతాలకు కొత్త రైళ్లు అందుబాటులోకి వస్తాయి. వీటితో పాటు విశాఖ నుంచే కాశీ వంటి పుణ్యక్షేత్రాలకు కూడా రైళ్లు నడిచే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే తిరుపతి, బెంగళూరులకు వందేభారత్ రైళ్లు నడపాలనే ప్రతిపాదనలు కూడా కార్యరూపం దాల్చుతాయి.విశాఖపట్నం రైల్వే స్టేషన్ రద్దీగా మారింది. ఇక్కడ లైన్ల సంఖ్య పరిమితంగా ఉండటంతో, కొన్ని రైళ్లు దువ్వాడ దాటిన తర్వాత స్టేషన్ బయటే ఆగిపోతున్నాయి. మరికొన్ని రైళ్లను ఒకటి, 2 రోజుల తర్వాత షెడ్యూల్ చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో వాటిని నిలిపి ఉంచడానికి సరైన చోటు లేక, నగర శివారు మార్గాల్లో ఖాళీగా ఉన్న లైన్లలో వాటిని నిలిపి ఉంచుతున్నారు. దీనివల్ల రైళ్ల నిర్వహణ కష్టమవుతోంది.అయితే ఈ సమస్యలకు పరిష్కారంగా.. జగన్నాథపురాన్ని శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని అధికారులు ప్రతిపాదించారు. అక్కడ పెద్ద కోచింగ్ మెయింటెనెన్స్ డిపోతో పాటు, భారీ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని ఆలోచనలో ఉన్నారు. ఇందుకోసం ఇప్పటికే రూ. 2,800 కోట్లతో ప్రతిపాదనలు రైల్వే బోర్డుకు పంపించారు.ఇదిలా ఉంటే.. విశాఖపట్నంలో రైల్వే యార్డును ఆధునీకరించడానికి డీపీఆర్ సిద్ధమైంది. ఇందులో 5 కొత్త లైన్లు, 10 స్టేబిలింగ్ లైన్లు, అదనపు ప్యాసింజర్ ప్లాట్‌ఫారాలు, ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని బోర్డుకు ప్రతిపాదించారు. వీటితో పాటుగా ఫ్లైఓవర్లు, బైపాస్‌లు, ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్‌లను కూడా నిర్మించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు రైల్వే వర్గాలు తెలిపాయి. ఇవన్నీ పూర్తయితే ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలోఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# తిరుపతిలో స్పోర్ట్స్ సిటీకి భూమి

తిరుపతి, డిసెంబర్ 31, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. తిరుపతి జిల్లా దామినేడులో స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి భూములు కేటాయించింది. దామినేడులో నేషనల్ స్టాండర్డ్ స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు కోసం గతంలో 28.37 ఎకరాల భూమిని ఏపీ టూరిజం అథారిటీకి కేటాయించారు. అయితే ఆ ప్రాజెక్టు దిశగా అడుగులు పడకపోవటంతో.. తాజాగా జరిగిన ఏపీ మంత్రిమండలి సమావేశంలో ఈ భూమిని స్పోర్ట్స్ సిటీ నిర్మాణం కోసం శాప్‌కు ఇవ్వాలని నిర్ణయించారు ఈ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం లభించటంతో దామినేడులో 28.37 ఎకరాల భూమిని ఉచితంగా శాప్‌కు బదిలీ చేయనున్నారు.మరోవైపు రాజధాని అమరావతిలో ఏపీ ప్రభుత్వం అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు రచిస్తున్న సంగతి తెలిసిందే. దీనితో పాటుగా ప్రతి నియోజకవర్గంలోనూ క్రికెట్ గ్రౌండ్లు ఉండేలా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా క్రికెట్ మైదానాలు, స్పోర్ట్స్ సిటీల నిర్మాణం ఆలోచన చేస్తోంది. ఈ క్రమంలోనే శాప్ ఆధ్వర్యంలో తిరుపతిలో స్పోర్ట్స్ సిటీ నిర్మించాలని నిర్ణయించారు. ఈ స్పోర్ట్స్ సిటీ నిర్మాణం కోసం తిరుపతి రూరల్ మండలం దామినేడు ప్రాంతాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ ఉన్న 28.37 ఎకరాలను టూరిజం అథారిటీ నుంచి శాప్‌కు ఉచితంగా బదిలీ చేస్తూ ఇటీవలే రెవెన్యూశాఖ నిర్ణయం తీసుకుంది.ఈ ప్రతిపాదనలకు తాజాగా జరిగిన ఏపీ కేబినెట్ భేటీలో ఆమోదం లభించింది. మరోవైపు దామినేడులో ఎకరా భూమి విలువ సుమారుగా రెండున్నర కోట్ల వరకూ ఉన్నట్లు సమాచారం. దీంతో 28 ఎకరాల భూమిని ఉచితంగా కేటాయిస్తూ ఉండటంతో.. అధికారులు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కేటాయించిన భూమిని అవసరాలకు మాత్రమే వినియోగించాలని.. రెవెన్యూ శాఖ అనుమతి లేకుండా ఈ భూమిలో ఎలాంటి కేటాయింపులు, బదిలీలు చేయొద్దని సూచించినట్లు సమాచారంమరోవైపు దామినేడు వద్ద ఉన్న భూమిని శాప్‌కు కేటాయించాలంటూ శాప్ చైర్మన్ రవి నాయుడు గతంలో సీఎం చంద్రబాబును కలిసి కోరారు. తిరుపతిలో క్రీడల్ని ప్రోత్సహించేందుకు, స్పోర్ట్స్ సిటీ నిర్మాణం కోసం భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తికి సీఎం చంద్రబాబు అప్పట్లో సానుకూలంగా స్పందించారు. తాజాగా భూమిని కూడా కేటాయించడంతో తిరుపతిలో స్పోర్ట్స్ సిటీ నిర్మాణం వేగం పుంజుకునే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు తిరుపతిలోని గొల్లవానిగుంటలో కూడా ఓ క్రికెట్ స్టేడియం సిద్ధమైంది.రూ.3 కోట్లు ఖర్చు చేసి గొల్లవానిగుంటలో క్రికెట్ స్టేడియం నిర్మాణం చేపట్టారు. ఈ పనులు చివరి దశకు చేరుకోగా.. సంక్రాంతి నాటికి పూర్తి చేసి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ స్టేడియంలో.. 75 చదరపు గజాల విస్తీర్ణంలో 5 వికెట్ టర్ఫ్‌లు ఏర్పాటు చేశారు. నాలుగు నెట్‌లు, గ్యాలరీలు, వీఐపీలకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు.

# రోడ్డు భద్రతా ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ పాల్గోనాలి

## మంత్రి పొన్నం

హైదరాబాద్ జనవరి 1 వ తేదీ నుండి జరిగే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలి. రేపటి నుండి జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం అవుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ రవాణా శాఖ పక్షాన జనవరి 1 నుండి 31 వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నాం. అన్ని జిల్లాలు , మండలాలు , గ్రామాల్లో రోడ్డు భద్రత మాసోత్సవం కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్న. ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులతో రోడ్డు బద్రత నిబంధనలు పాటిస్తామని హామీ పత్రం ఇవ్వండి. ప్రతి పాఠశాల రోడ్ భద్రతా క్లబ్ లో చేరాలి. రవాణా శాఖ సూచనలు పాటించండి.. హెల్మెట్ ధరించాలి.. మద్యం తాగి వాహనం నడపరాదు,రాంగ్ రూట్లో ప్రయాణం వద్దు ,అతివేగంతో వాహనం నడపరాదు. రోడ్డు ప్రమాదాల వల్లే మరణాలు అధికంగా సంభవిస్తున్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ,అధికారులు , విద్యార్థులు,ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని అన్నారు.

# మూడేళ్ల ముందు నుంచే హడావిడి..

కాకినాడ, డిసెంబర్ 31, సాధారణంగా ఎన్నికలు దగ్గరపడుతుండడంతో సీట్లు దక్కించుకునేందుకు నేతలు పోటీ పడుతుంటారు.. దానికోసం ప్రచార అస్త్రాలతోపాటు ప్రజలతో మమేకమవ్వడం, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం.. అధినేతలను, ముఖ్యనేతలను కలుసుకుని తన గుర్తింపును పదిలపరచుకోవడం వంటివి చూస్తుంటాం.. కానీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రతిపక్షపార్టీ వైఎస్సార్ సీపీ లో పరిస్థితి దీనికి భిన్నంగా మారింది.. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల కాలం ఉన్నా వైసీపీ నాయకులు వైసీపీ అసెంబ్లీ సీటు కోసం నానా హైరానా పడుతున్నారు.. బరిలో మేమున్నామంటే మేమున్నామంటూ నియోజకవర్గ సమన్వయకర్తతో సంబంధం లేకుండా ఎవరికివారు తమ ఉనికిని చాటుకునేందుకు కాపాడుకునేందుకు వీర ప్రయత్నాలు చేస్తున్నారు.. 2012 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘోర పరాజయం తరువాత చాలా నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు.. ఇదే తీరు అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం నియోజకవర్గంలోకూడా కనిపించింది.. అయితే వైసీపీ నియోజకవర్గ ఇంచార్జ్ మార్పు తరువాత అనూహ్యమైన మార్పు కనిపిస్తోంది.. అమలాపురం నియోజకవర్గంలో తిరుగులేని పాత్ర పోషించిన మాజీ మంత్రి విశ్వరూప్ నియోజకవర్గానికి దూరమవ్వడం.. ఆయన కుమారుడు శ్రీకాంత్ నాయకత్వాన్ని అంగీకరించని కొందరు పార్టీ నేతలు పక్కచూపులు చూడడం.. మొత్తం మీద నియోజకవర్గంలో వైసీపీ ఐక్యతా రాగం బీటలువారి రిజర్వుడు కేటగిరిలో ఉన్న కొందరు నాయకులు తమ ఉనికిని చాటుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ప్రస్ఫుష్టంగా కనిపిస్తున్నాయి.. ఇటీవల ఉప్పలగుప్తంలో జరిగిన జగన్ జన్మదిన వేడుకలో ప్రోటోకాల్ పాటించలేదంటూ ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ అసహనం వ్యక్తం చేస్తూ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయముందని, అధిష్టానం ఎవరికి సీటు ఇచ్చినా వారి గెలుపుకోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.. అంటే అమలాపురం వైసీపీలో సీటు కోసం హీటు పెరిగిందా అన్న సెటైర్లు వినిపిస్తున్నాయి.. అమలాపురం పార్లమెంటు స్థానం నుంచి తొలిసారిగా ఎంపీగా పోటీచేసి విజయం సాధించిన మాజీ ఎంపీ చింతా అనురాధ ఇటీవల కాలంలో తన స్పీడు పెంచారు.. మొన్నటి ఎన్నికల్లో సీటు దక్కకపోవడంతో నియోజకవర్గానికి చాలా కాలం దూరమయ్యారు.. అయితే ఎన్నికల సమయంలో మాత్రం అడపా దడపా ప్రచారంలో పాల్గొన్న అనురాధ మొత్తం మీద సీఈసీ సభ్యురాలిగా పదవిని తెచ్చుకోగలిగారు. దీంతో అప్పటి నుంచి స్పీడు పెంచిన అనురాధ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు.. ఓ పక్క పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూనే ప్రత్యేకంగా తన వర్గంతో పరామర్శల నుంచి పలుకరింపుల వరకు ఒక్క రోజులో అనేక చోట్ల చుట్టేస్తున్నారు.. అంతటితో ఆగక సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఎంపీ అనురాధ వెంట నడుస్తున్నవారిలో ఎక్కవ మంది గతంలో మాజీ మంత్రి విశ్వరూప్ అనుచర వర్గమే ఉండడం కనిపిస్తోంది.. ఉప్పలగుప్తంలో జరిగిన జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలో మాజీ మంత్రి విశ్వరూప్, నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీకాంత్, ఎమ్మెల్సీలు ఫోటోలు లేకుండానే ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం అక్కడి వారు చింతా అనురాధా నాయకత్వాన్ని బలపరుస్తున్నట్టు చెప్పకనే చెప్పినట్లయ్యింది.. గుడ్ సీడ్ ఫౌండేషన్ ద్వారా విస్తృతంగా సేవాకార్యక్రమాలు నిర్వహించే వైసీపీ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిని తరచూ కలవడం, ఇటీవల జరిగిన జగన్ జన్మదిన వేడుక సందర్భంగా భారీ స్థాయిలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం ఎప్పటిలానే కనిపించినా ఈ ఏడాది అయితే మరింత జోరు పెంచినట్లు కనిపిస్తోంది.. అయితే గత కొన్ని నెలలుగా ఒకప్పుడు మాజీ మంత్రి విశ్వరూప్ అత్యంత సన్నిహితులుగా మెలిగిన వారిలో కొంత మంది రమణారావు వెంట కనిపిస్తున్నారు.. జగన్ అజెండాతో కొంత మంది పార్టీ యువత చేస్తున్న కార్యక్రమాలను ప్రోత్సహించడం, నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేయడంతోపాటు ఆ వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ తన ఉనికిని చాటుకునేందుకు మరింత స్పీడు పెంచినట్లు కనిపిస్తోంది.. ఇదిలా ఉంటే మాజీ ఎంపీ అనురాధ, రమణారావు పలు కార్యక్రమాలకు కలిసి పాల్గొనడం ఆ కార్యక్రమాల్లో నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీకాంత్ కానీ, ఇతర ముఖ్యనేతలు కనిపించకపోవడంపై చర్చ సాగుతోంది..నియోజకవర్గంలో మాజీ మంత్రి విశ్వరూప్ అనుచర వర్గంలో చాలా మంది పక్కచూపులు చూడడం ఇంతకాలం అసంతృప్తితోనే ఆయన వెంట నడిచారా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.. ఓటమి తరువాత అందులోనూ నియోజకవర్గ కోఆర్డినేటర్ బాధ్యతల మార్పు తరువాత వర్గీయులకు వంక దొరికిందా అన్న చర్చ జరుగుతోంది.. ఇటీవల ప్రకటించిన పార్టీ పదవుల్లో ఆశపడి భంగపడ్డ వారు, అధికారంలో ఉన్నప్పుడు తమకేమీ ఉపయోగపడలేదన్న అసంతృప్తితోనే దూరమవుతున్నట్లు కొందరు చెబుతున్నట్లు తెలుస్తోంది.. అయితే ముఖ్య అనుచరగణంలో కొందరు మాత్రం విశ్వరూప్ వెంటే ఉండగా విశ్వరూప్ స్థానికంగా పెద్దగా ఉండకపోవడంతో వారు ఇటీవలకాలంలో సైలెంట్ అవుతున్నారు.. ఇక తప్పక నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీకాంత్ పిలుస్తున్నప్పుడు వెళ్లి హాజరవుతున్నట్లు తెలుస్తోంది.. రాబోయే ఎన్నికల పండుగ కోసం ఎదురు చూస్తున్న కొందరు వైసీపీ నాయకులు ముందే కూసిన కోయిల చందంగా ప్రచారార్భాటాలతో దూసుకుపోతుండగా మీరు కోనసీమకు మళ్లీ రావాలంటూ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబుకు కొందరు వైసీపీ నాయకులు స్వాగతం పలుకుతున్నారని తెలుస్తోంది.. సోషల్ మీడియా వేదికగా కూటమి నేతలపై విరుచుకుపడుతున్న బొజ్జా ఐశ్వర్యకు వైసీపీ బెర్త్ ఖాయం అంటూ మరికొందరు జోష్యం చెప్పడం నియోజకవర్గంలో కనిపిస్తోంది.. ఎన్నికలకు చాలా సమయం ఉన్నా మొత్తం మీద అమలాపురం వైసీపీలో మాత్రం సీట్ కోసం హీట్ కనిపిస్తోంది..

# ఢిల్లీకి కవచం.. సుదర్శన చక్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్) దేశ రాజధాని ఢిల్లీలో భద్రతకు సంబంధించి కేంద్రంలోని మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం మొత్తం రూ.5,181 కోట్లతో స్వదేశీ సమీకృత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ ను కొనుగోలు చేయడానికి అనుమతించినట్టు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఈ మేరకు జాతీయ మీడియా కథనం వెల్లడించింది. 'సుదర్శన చక్ర' ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్ కింద ఢిల్లీలోని ముఖ్యమైన వీఐపీ-89 జోన్‌లో ఈ వ్యవస్థను ఏర్పాటుచేయనున్నారు

డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ దేశ రాజధాని చుట్టూ 30 కి.మీ. పరిధిలోని గగనతలంలో ఎటువంటి ముప్పునైనా నిరోధించగలదని సదరు వర్గాలు తెలిపాయి. అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో డ్రోన్ల వంటి ఆయుధాల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో మోదీ సర్కారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసేలా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధాలను కొనుగోలుచేయడానికి రక్షణ శాఖ సోమవారం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ఈ గగనతల రక్షణ వ్యవస్థ కొనుగోలు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారంప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ ఏడాది ఆగస్టు 15 ప్రసంగంలో గగనతల రక్షణ వ్యవస్థ గురించి ప్రకటించారు. 'సుదర్శన్ చక్ర' పేరుతో కీలక ప్రాంతాలను వైమానిక దాడుల నుంచి రక్షించేలా బహుళ అంచెల కవచం, ప్రతిదాడి వ్యవస్థలను మోహరించనున్నట్లు తెలిపారు. దేశంలోని వ్యూహాత్మక, పౌర, జాతీయ ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల భద్రతే దీని లక్ష్యం. ఇందులో భాగంగా శత్రువులు ప్రయోగించే క్షిపణులు, యుద్ధ విమానాలను ముందుగానే గుర్తించి, కూల్చివేసే వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. అలాగే, సైబర్ దాడులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కూడా ఈ వ్యవస్థలో అనుసంధానిస్తారు.డీఆర్డీవో, సైన్యం, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో దీన్ని ఏర్పాటు చేయడానికి కేంద్రం ఇప్పటికే సన్నాహకాలు ప్రారంభించింది. ఢిల్లీలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత గగనతల భద్రతను పటిష్టం చేయాలని భారత్ నిర్ణయించింది. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులకు దాయాది రగిలిపోయింది. సరిహద్దుల్లోని భారత సైనిక, వైమానిక స్థావరాలపై దాడులకు ప్రయత్నించగా.. వాటిని సైన్యం సమర్ధవంతంగా అడ్డుకుంది. ఎస్-400 వంటి గగనతల రక్షణ వ్యవస్థలను భారత్ వినియోగించింది. అంతేకాదు, పాక్‌పై ఎదురుదాడి చేసి, దాని మౌలిక వసతులు, సైనిక స్థావరాలపై విరుచుకుపడింది. పాక్ నూర్ ఖాన్ ఎయిర్ బేస్ సహా కీలకమైన వ్యవస్థలను ధ్వంసం చేసింది

# కొత్తగా అత్యాధునిక బస్ స్టాండ్

వరంగల్ డిసెంబర్ 31,తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా వరంగల్ నిలుస్తోంది. గడిచిన ఏడాది కాలంలో ఇక్కడ ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు మొదలయ్యాయి. అయితే.. ప్రతిష్టాత్మకమైన వరంగల్ ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం మాత్రం అడుగు ముందుకు పడటం లేదు. దాదాపు 74.50 కోట్ల రూపాయల వ్యయంతో స్మార్ట్ సిటీ పథకం కింద ఈ మోడల్ బస్టాండ్ నిర్మాణాన్ని ప్రతిపాదించారు. కానీ.. రెండేళ్లు గడుస్తున్నా పనులు ప్రాథమిక దశలోనే ఆగిపోవడం విమర్శలకు దారితీస్తోంది.వరంగల్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న అసంపూర్తి బస్టాండ్ ప్రాంగణం ప్రస్తుతం అధ్వాన్నంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు నిర్మాణం కోసం తీసిన గుంతల్లో నీరు నిలిచి, ఆ ప్రాంతమంతా ఒక చెరువులా కనిపిస్తోంది. ఈ దుస్థితిపై వరంగల్ బీజేపీ నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. బస్టాండ్ ప్రాంగణంలో నిలిచిన నీటిలో పడవలు, తెప్పలపై ప్రయాణిస్తూ ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన కమిషన్ల వివాదాల వల్లే ఈ పనులు ఆగిపోయాయని వారు ఆరోపిస్తున్నారు.కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ఆధ్వర్యంలో ఈ నిర్మాణ పనులు సాగాల్సి ఉంది. భవిష్యత్తులో 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ బస్టాండ్ డిజైన్ రూపొందించారు. ఇప్పటికే సాంకేతిక, పరిపాలనా అనుమతులన్నీ లభించినప్పటికీ.. నిధుల కొరత పనులకు ఆటంకంగా మారింది. కాళోజీ కళాక్షేత్రం కోసం ప్రభుత్వం ఇవ్వాల్సిన 70 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉండటం.. గతంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 'కుడా' ఇచ్చిన 45 కోట్ల రూపాయల అప్పు తిరిగి రాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.రైల్వే స్టేషన్ నుంచి దిగిన ప్రయాణికులు వెంటనే బస్సు ఎక్కడానికి వీలుగా ఉండే ఈ బస్టాండ్ నిర్మాణం ఆగిపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిధుల సర్దుబాటు లేకపోవడం వల్ల పనులు నిలిచిపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో... కొత్త సంవత్సరం ప్రారంభంలోనైనా నిధుల విడుదల జరిగి పనులు పునఃప్రారంభం అవుతాయని అధికారులు ఆశిస్తున్నారు. ఒకవేళ పనులు వేగవంతం అయితే.. 2026 నాటికి ఓరుగల్లు నగరం ఆధునిక హంగులతో కూడిన బస్టాండ్‌ను సొంతం చేసుకోనుంది.

## యూరియా కోసం రైతుల తిప్పలు

ఖమ్మం కొనిజర్ల మండల కేంద్రంలోని గ్రోమోర్ రైతు సేవ కేంద్రం వద్ద భారీగా యూరియా కోసం రైతులు బారులు తీరారు. బుధవారం తెల్లవారుజామున మూడు గంటల నుండి క్యూ లైన్ లో వేచి చూస్తున్నారు. రాష్ట్రీయ రహదారి పక్కనే షాపు ఉండడంతో రోడ్డు పక్కనే క్యూలు కట్టారు. యూరియా కోసం తప్పని రైతులకు తిప్పలు తప్పడం లేదు. క్యూలైన్లో మహిళ రైతులు కుడా వున్నారు. ముందు నేనంటే నేను అని గొడవపడుతున్నారు. యూరియా కొరత లేదని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రకటించినా క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇంకోలా వుంది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లాలో యూరియా కొరత రోజురోజుకు పెరుగుతోంది.

# 180 కిలోమీటర్ల వేగంతో హై స్పీడ్ ట్రెయిన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్) భారతీయ రైల్వే రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ రూపొందించిన వందే భారత్ స్లీపర్ రైలు తన సామర్థ్యాన్ని మరోసారి చాటుకుంది. రాజస్థాన్‌లోని కోటా - నాగ్దా సెక్షన్ల మధ్య నిర్వహించిన హై స్పీడ్ ట్రయల్స్‌లో ఈ రైలు గంటకు 180 కిలోమీటర్ల గరిష్ట వేగాన్ని నమోదు చేసి రికార్డు సృష్టించింది. కేవలం వేగాన్నే కాకుండా.. రైలు ప్రయాణంలో ఉండే స్థిరత్వాన్ని నిరూపించడానికి రైల్వే శాఖ వాటర్ టెస్ట్ నిర్వహించింది. దానికి సంబంధించిన వీడియోను రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఇప్పుడు వైరల్ అవుతోందివందే భారత్ స్లీపర్ రైలు తన గరిష్ట వేగం వద్ద ప్రయాణిస్తున్న సమయంలో కూడా దాని లోపల ఉంచిన నీటి గ్లాసుల నుంచి ఒక్క చుక్క నీరు కూడా కింద పడకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. వందే భారత్ స్లీపర్ కొత్త తరం టెక్నాలజీకి ఇదే నిదర్శనమని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ప్రయాణికులు నిద్రించే సమయంలో ఎలాంటి కుదుపులు లేకుండా.. అత్యంత ప్రశాంతమైన అనుభూతిని అందించడమే లక్ష్యంగా ఈ స్లీపర్ రైలు వెర్షన్‌ను రూపొందించినట్లు తెలిపారు.ఈ స్లీపర్ రైలులో మొత్తం 16 కోచ్‌లు ఉన్నాయి. వీటిని విలాసవంతమైన సౌకర్యాలతో.. అత్యాధునిక టెక్నాలజీతో తీర్చిదిద్దారు. ప్రయాణికుల కోసం 11 థర్డ్ ఏసీ, 4 సెకండ్ ఏసీ, ఒక ఫస్ట్ ఏసీ కోచ్‌లను ఏర్పాటు చేశారు. భద్రత కోసం స్వదేశీ టెక్నాలజీ అయిన కవచ్ వ్యవస్థను, విమాన తరహాలో బయో వాక్యూమ్ టాయిలెట్లు, సెన్సార్ లైటింగ్ వంటి ఎన్నెన్నో ప్రత్యేకతలను ఈ వందే భారత్ స్లీపర్ రైలులో ఏర్పాటు చేశారు. బెంగళూరులోని బీఈఎంఎల్ సంస్థ, చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) సంయుక్తంగా ఈ వందే భారత్ స్లీపర్ రైలును అభివృద్ధి చేశాయి.సుదూర ప్రాంతాల రాత్రి ప్రయాణాల కోసం ప్రత్యేకంగా సిద్ధమవుతున్న ఈ వందే భారత్ స్లీపర్ రైళ్లు.. అతి త్వరలోనే సామాన్య ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. మొదట్లో ఢిల్లీ - ముంబై.. ఢిల్లీ - పాట్నా వంటి రద్దీ మార్గాల్లో ఈ వందే భారత్ స్లీపర్ రైళ్లను నడిపే అవకాశం ఉంది. రాజధాని ఎక్స్‌ప్రెస్ కంటే తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేరడంతో పాటు.. అత్యుత్తమ ప్రయాణ అనుభవాన్ని ఈ రైళ్లు అందించబోతున్నాయి.

# ఆన్‌లైన్‌లో అభ్యంతరకరమైన కంటెంట్‌పై కొరడా

న్యూఢిల్లీ, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్) ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికలకు కేంద్రం మరోసారి తీవ్ర హెచ్చరికలు చేసింది. తమ వేధికల్లోని అశ్లీల, అసభ్యకరమైన కంటెంట్‌పై సరైన చర్యలు తీసుకోకపోతే చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వాటికి వార్నింగ్ ఇచ్చింది. ఈ మేరకు డిసెంబరు 29న ఐటీ శాఖ సర్క్యులర్ జారీ చేసింది. ఇందులో ఐటీ నిబంధనలు 2021 ప్రకారం, చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను తొలగించాలని, ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా చర్య తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది.ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికలకు కేంద్ర ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. తమ వేదికలపై అశ్లీల, అసభ్యకరమైన కంటెంట్‌పై సరైన చర్యలు తీసుకోకపోతే చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. డిసెంబర్ 29న కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వ శాఖ జారీచేసిన ఉత్తర్వులో ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికలు తమ అంతర్గత నిబంధనలను వెంటనే సమీక్షించుకోవాలని, చట్టవిరుద్ధమైన, అశ్లీల కంటెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇక, సుప్రీంకోర్టు కూడా ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికల్లో ప్రసారమయ్యే కంటెంట్‌ను పోర్నోగ్రఫీతో పోల్చింది.ఈ ఆదేశాలను పాటించడంలో విఫలమైతే చట్టపరమైన చర్యలు తప్పవని మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఆన్‌లైన్ వేదికలకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం సెక్షన్ 79 కింద లభించే బాధ్యత మినహాయింపు, తమ ప్లాట్‌ఫామ్‌లలోని మూడో పక్షం కంటెంట్‌పై 'తగిన జాగ్రత్త' తీసుకున్నప్పుడే వర్తిస్తుందని పేర్కొంది. ఇటీవలి సమీక్షలో అనేక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు అశ్లీల, అసభ్యకరమైన, ఇతర చట్టవిరుద్ధమైన కంటెంట్‌పై చర్యలు తీసుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమైంది. ఐటీ నిబంధనలు 2021 ప్రకారం.. అశ్లీల, పిల్లల లైంగిక వేధింపులకు సంబంధించిన లేదా పిల్లలకు హానికరమైన కంటెంట్‌ను అందుబాటులో ఉంచడం, అప్‌లోడ్ చేయడం, ప్రచురించడం, ప్రసారం చేయడం, పంచుకోవడం వంటివి నిరోధించడానికి సహేతుకమైన ప్రయత్నాలు చేయాలని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లకు మంత్రిత్వ శాఖ గుర్తు చేసింది.కోర్టు ఆదేశాలు లేదా ప్రభుత్వ నోటిఫికేషన్ అందిన వెంటనే చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను తొలగించాలని లేదా దానికి యాక్సెస్‌ను నిలిపివేయాలని స్పష్టం చేసింది. లైంగిక చర్యలలో ఒక వ్యక్తిని చిత్రీకరించే కంటెంట్‌పై ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా చర్య తీసుకోవడం తప్పనిసరి. అన్ని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు తమ కంటెంట్ మోడరేషన్ సిస్టమ్‌లను, అంతర్గత నియంత్రణ ప్రక్రియలను, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలను వెంటనే సమీక్షించుకోవాలని ఐటీ మంత్రిత్వ శాఖ కోరింది. ఇదిలా ఉండగా, ఆన్‌లైన్, సోషల్ మీడియాలో అశ్లీలత శృతిమించడంతో సామాజిక ఉద్యమకారులు, హక్కుల సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో సుప్రీంకోర్టు సైతం అనేక సందర్భాల్లో ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేసింది. వీటిని నియంత్రణకు మార్గదర్శకాలను రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది.



# మాదాపూర్ లో హిట్ అండ్ రన్ ట్రాఫిక్ హోమ్ గార్డ్ ను డీ కొట్టి పరారైన నిందితుడు

మాదాపూర్ పర్వత నగర్ సిగ్నల్ వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హోమ్ గార్డ్ నయీం(45) ను దుండగుడు కారు తో అతి వేగంగా వచ్చి ఢీ కొట్టి పరారైయాడు. గాయాలపాలైన హోమ్ గార్డ్ నయీం ను స్థానిక ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించారు. ఘటనలో నయీం కాలు విరిగినట్లు నిర్ధారించారు. ప్రస్తుతం హోమ్ గార్డ్ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న హోమ్ గార్డ్ నయీం ను ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్,ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ హనుమంత్ రావు పరామర్శించారు.

# గజగజ వణికిస్తున్న చలి

అదిలాబాద్, డిసెంబర్ 31, తెలంగాణను గడ్డకట్టే చలి వణికిస్తోంది. మూడు వారాలుగా కొనసాగుతున్న తీవ్ర చలితో జనజీవనం స్తంభించింది. ఆదిలాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. హైదరాబాద్‌లోనూ చలి తీవ్రత పెరిగింది. మేఘాలు లేకపోవడం, హిమాలయాల నుంచి చల్లని గాలులు రావడమే దీనికి కారణాలని నిపుణులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ అయ్యాయి.తెలంగాణ రాష్ట్రాన్ని గడ్డకట్టే చలి వణికిస్తోంది. గత మూడు వారాలుగా తీవ్రమైన చలిగాలులు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తోంది. వరుసగా 24వ రోజు కూడా చలి తీవ్రత ఏమాత్రం తగ్గకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు గజగజలాడుతున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోయి సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా తిర్యాణిలో అత్యల్పంగా 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ ఆయా ప్రాంతాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.భాగ్యనగరంలో కూడా చలి తీవ్రత ఊహించని స్థాయిలో పెరిగింది. సాధారణంగా కాస్త వెచ్చగా ఉండే హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడం గమనార్హం. శేరిలింగంపల్లిలోని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాల్లో 8.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. నగరంలోని ఇతర ప్రాంతాలైన రాజేంద్రనగర్ 10 డిగ్రీల సెల్సియస్, మౌలాలి 10.2 డిగ్రీల సెల్సియస్, గచ్చిబౌలి 10.9 డిగ్రీల సెల్సియస్ వంటి చోట్ల కూడా చలి గాలులు తీవ్రంగా ఉన్నాయి. తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కురుస్తుండటంతో ఆఫీసులకు వెళ్లేవారు. పాఠశాల విద్యార్థులు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వాతావరణ నిపుణుల విశ్లేషణ ప్రకారం, ఈ ఏడాది డిసెంబర్ నెలలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. దీనికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి. మేఘాలు లేకపోవడం వల్ల భూమి పగటిపూట గ్రహించిన వేడి రాత్రివేళ త్వరగా అంతరిక్షంలోకి వెళ్ళిపోతోంది. హిమాలయాల నుంచి వీస్తున్న పొడి, శీతల గాలులు నేరుగా తెలంగాణ మీదుగా ప్రవహిస్తున్నాయి. రాత్రి సమయాల్లో భూమి ఉపరితలం వేగంగా చల్లబడటం వల్ల కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి.కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రాష్ట్రంలోనే అత్యంత శీతల ప్రాంతంగా నిలిచింది. ఇక్కడ 5.6 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు చలి నుంచి తట్టుకోవడానికి ఉదయం, రాత్రి సమయాల్లో చలిమంటలనే ఆశ్రయిస్తున్నారు. రాబోయే రెండు మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉన్నందున.. వృద్ధులు, చిన్నపిల్లలు ఉదయం పూట బయటకు రాకపోవడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వేడి ఆహారం, గోరువెచ్చని నీటిని తీసుకోవాలని నిపుణులు సలహా ఇస్తున్నారు.

## వైకుంఠ ద్వాదశి సందర్భంగా శాస్త్రోక్తంగా చక్రస్నానం

తిరుమల వైకుంఠ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమలలో బుధవారం తెల్లవారుజామున స్వామివారి పుష్కరిణి తీర్థ ముక్కోటి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్ ను స్వామి పుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి చక్రస్నానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# కేడర్ లో జోష్ నింపిన కేసీఆర్



హైదరాబాద్, డిసెంబర్ 31, బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్ళీ రాజకీయ క్షేత్రంలో తనదైన శైలిలో గర్జించారు. తెలంగాణ రాజకీయాల్లో మునుపటి జోష్‌ను నింపుతూ పార్టీ రాష్ట్రస్థాయి సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడిన తీరు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించకుండానే, అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన సంధించిన విమర్శనాస్త్రాలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఎదుర్కొంటున్న వైఫల్యాలను ఎండగట్టిన ఆయన, ముఖ్యంగా ప్రజల ప్రాణధారమైన కృష్ణా జలాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. ఈ వ్యవహారంలో రెండు ప్రభుత్వాలు 'దొంగాట' ఆడుతున్నాయని, తెలంగాణ హక్కులను తాకట్టు పెడుతున్నాయని ఆయన మండిపడ్డారు.పాలనాపరమైన వైఫల్యాలపై కేసీఆర్ చేసిన విమర్శలు గంభీరంగా ఉండటమే కాకుండా, తెలంగాణ అస్తిత్వానికి సంబంధించిన అంశాల చుట్టూ కేంద్రీకృతమయ్యాయి. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పేరును ఎక్కడా ఉచ్చరించకుండానే, కేసీఆర్ తనదైన శైలిలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ వైఖరి వల్ల రైతులకు, సాధారణ ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను ఆయన సోదాహరణంగా వివరించారు. ముఖ్యంగా కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించే దిశగా జరుగుతున్న ప్రయత్నాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.తన పదేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధిని, ప్రస్తుత పరిస్థితిని పోలుస్తూ ఆయన చేసిన విమర్శలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. గతంలో కంటే మరింత స్పష్టతతో, పదునైన మాటలతో కేసీఆర్ రంగంలోకి దిగడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. కేసీఆర్ పునరాగమనం రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు దారితీస్తుందన్న సంకేతాలను ఈ సమావేశం బలంగా ఇచ్చింది.

జనవరి 2 నుంచి అసెంబ్లీకి...

14 ఏళ్ల పోరాటం. పదేళ్ల అధికారం. రెండేళ్ల ప్రతిపక్ష పాత్ర. ఒకే ఒక్కడు. ఆయనే కేసీఆర్. నాడు ఉద్యమ నాయకుడిగా అయినా..తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రిగా.. ఇప్పుడు ప్రతిపక్ష నేతగా..ఆయన ఫాంహౌస్‌లో ఉన్నా వార్తే. తెలంగాణ భవన్‌కు వచ్చినా హాట్ టాపికే. అసెంబ్లీకి అటెండ్ అయితే అందరిలో క్యూరియాసిటీ. అలాంటి సీనే మళ్లీ రిపీట్ అయింది. ఆఫ్టర్ ఏ లాంగ్ టైమ్ కేసీఆర్ మీడియా ముందుకు వచ్చారు.కృష్ణా జలాలు, పాలమూరు ఎత్తిపోతలపై కాంగ్రెస్ సర్కార్ తీరును తూర్పార బట్టారు. ఇక పోరు బాటే అంటూ హెచ్చరించారు. ఆ తర్వాత వారం రోజుల్లోనే అసెంబ్లీ స్టార్ట్ అయింది. మొదటి రోజు సమావేశాలకు సార్ అటెండ్ అయ్యారు. ప్రధాన ప్రతిపక్ష నేత అయిన కేసీఆర్ దగ్గరికి వెళ్లి మరీ సీఎం రేవంత్ పలకరించారు. ఆ తర్వాత సభలో 5 నిమిషాలు ఉండి వెళ్లిపోయారు మాజీ సీఎం. దీంతో కేసీఆర్ సభకు ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇంతకు జనవరి 2 నుంచి జరిగే అసెంబ్లీ సెషన్‌కు కేసీఆర్ వస్తారా రారా అన్నది హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో నందినగర్‌లోని తన నివాసంలో ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహిస్తూ..శాసనసభా వేదికగా సర్కార్‌ను ఇరకాటంలో పెట్టే ప్లాన్ చేస్తున్నారట గులాబీ దళపతి.అటు సర్కార్ కూడా జనవరి రెండు నుంచి జరిగే అసెంబ్లీ సెషన్‌లో కృష్ణా గోదావరి జలాలు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలపై చర్చకు సిద్ధమవుతోంది. అసెంబ్లీ ఎజెండాను కూడా ఫిక్స్ చేసింది. జనవరి 2న కృష్ణా, 3న గోదావరి బేసిన్‌పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సభలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు తమకు కూడా అవకాశం ఇవాలని ప్రతిపక్షం బీఆర్ఎస్ కోరుతోంది. కీలక అంశాలపై అసెంబ్లీలో చర్చ జరగనున్న నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ సభకు వస్తారా రారా అన్నదే ఆసక్తికరంగా మారింది.అయితే జనవరి రెండు నుంచి జరిగే అసెంబ్లీ సెషన్‌కు అటెండ్ కావాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. కృష్ణా-గోదావరి జలాలు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలపై చర్చలో పాల్గొని నిజానిజాలు చెప్పాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు టాక్. అసెంబ్లీకి హాజరుపై ముఖ్యనేతల సమావేశంలో గులాబీ బాస్ ఇండైరెక్ట్ హింట్ ఇచ్చినట్లు చెబుతున్నారు. ఏ అంశంపై అయినా చర్చకు మనం రెడీగా ఉన్నామ్. ప్రిపేర్ అయి రావాల్సింది అధికార పక్షం. మనది డైరెక్ట్ అటాకే. నీటి లెక్కలన్నీ నాలుక మీదే ఉన్నాయని కేసీఆర్ అన్నట్లుగా తెలుస్తోంది. దీంతో సార్ సభకు వస్తారన్న ప్రచారం బలంగా వినిపిస్తోంది.కృష్ణా జలాలు, పాలమూరు ఎత్తిపోతలపై మీడియా సమావేశంలో కేసీఆర్ చేసిన కామెంట్స్‌కు..సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. అన్ని అంశాలపై అసెంబ్లీలో చర్చించేందుకు ప్రభుత్వం రెడీగా ఉందని..దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని ఛాలెంజ్ చేశారు. దీంతో తాను సభకు హాజరు కాకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే స్వయంగా తాను సభకు హాజరై..కృష్ణాజలాలు, పాలమూరు ఎత్తిపోతలపై చర్చలో పాల్గొని కాంగ్రెస్ సర్కార్ తీరును ఎండగట్టాలని డిసైడ్ అయ్యారట గులాబీ బాస్.ఇరిగేషన్ విషయంలో సీఎంతో సహా మంత్రులెవరికీ సరైన అవగాహన లేదనేది కేసీఆర్ అంచనా అంటున్నారు. అందుకే వాళ్లు మాట్లాడాలంటే ప్రిపేర్ అయి రావాలి. మనది డైరెక్ట్ అటాకే అని కారు పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారట. మొత్తం అసెంబ్లీ సెషన్‌కు కాకపోయినా..నదీ జలాలు, పాలమూరు ఎత్తిపోతలపై చర్చకు మాత్రం తాను తప్పకుండా అటెండ్ కావాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే.. విమర్శలు, ప్రతి విమర్శలు..వాగ్వాదాలు..సభ ఎంత ఇంట్రెస్టింగ్‌గా కొనసాగుతుందో చూడాలి.

# అజారుద్దీన్ పదవికి గండం



హైదరాబాద్, డిసెంబర్ 31, నూహ్యంగా మంత్రి అయ్యారు. జూబ్లీహిల్స్ బైఎలక్షన్ వేళ..ముస్లిం ఈక్వేషన్ ఆయనకు అమాత్య యోగాన్ని తెచ్చి పెట్టింది. నిజానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచి గ్రేటర్ కోటాలో మంత్రి కావాలనుకున్నారు అజారుద్దీన్. అయితే ఎంఐఎం అబ్జక్షన్స్‌తో అజార్‌ను జూబ్లీహిల్స్ సీటు రేస్ నుంచి తప్పించారు కాంగ్రెస్ పెద్దలు. సరిగ్గా ఉపఎన్నిక జరుగుతున్న టైమ్‌లోనే ఆయన్ను హడావుడిగా మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. అయితే ఏ సభకు ఎన్నిక కాకుండానే మంత్రి అయిన..అజార్ ఆరు నెలల్లోపు ఏదో ఒక సభకు ఎన్నిక కావాల్సి ఉంది.అజారుద్దీన్‌ను ఎమ్మెల్సీగా చేసే ఆలోచనలోనే మంత్రివర్గంలోకి తీసుకుంది ప్రభుత్వం. కానీ గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై సస్పెన్స్ వీడటం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్ లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రభుత్వం నామినేట్ చేసింది. వీరి నియామకాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టుకు వెళ్లడంతో ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకం చెల్లదని వారి పదవులను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది.గత ఆగస్ట్ 30న జరిగిన క్యాబినెట్ సమావేశంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై చర్చించిన మంత్రిమండలి ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్‌ను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ గవర్నర్‌కు ఫైల్ పంపింది. అయితే కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకంపై వేసిన కేసులో తాము తుది తీర్పు ఇచ్చేంత వరకు కొత్త నియామకాలు చేపట్టొద్దని సుప్రీంకోర్టు చెప్పడంతో కోదండరాం, అజారుద్దీన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణస్వీకారం చేయలేదు. అయితే గత అక్టోబర్ 31న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అజారుద్దీన్ ఏప్రిల్ 30లోపు ఎమ్మెల్సీ లేదా ఎమ్మెల్యేగా ఎన్నిక కావాల్సి ఉంది.తెలంగాణలో ప్రస్తుతం ఎమ్మెల్సీ పోస్టులు ఖాళీ అయ్యే పరిస్థితి లేదు. వచ్చే ఏడాది నవంబర్‌లో మూడు ఎమ్మెల్సీలు ఖాళీ కానున్నాయి. కానీ అజారుద్దీన్ మంత్రిగా కొనసాగాలంటే అప్పటివరకు ఆగే పరిస్థితి లేదు. ఒకవేళ ఎమ్మెల్సీ కవిత రాజీనామాను స్పీకర్ ఆమోదించినా అది నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కావడంతో స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసేవరకు ఆ స్థానాన్ని భర్తీ చేసే అవకాశం లేదంటున్నారు. దీంతో అజారుద్దీన్ మంత్రి పదవి..సుప్రీంకోర్టు తుది తీర్పుపైనే ఆధారపడి ఉందని అంటున్నారు. సుప్రీంకోర్టు ఫైనల్ డెసిషన్ వచ్చే వరకు అజారుద్దీన్, కోదండరాం ఎదురు చూడటం తప్ప మరో మార్గం లేదని లీగల్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు.ఏప్రిల్ 30 వరకు అజారుద్దీన్ ఏదో ఒక సభలో సభ్యుడిగా ఎన్నిక కావాలి. లేకపోతే ఆయన మంత్రి పదవి ఊస్ట్ అయ్యే అవకాశముంది. దీంతో ఈ సమస్యను ఎలా అధిగమించాలనే దానిపై కాంగ్రెస్ నేతలు లీగల్ ఎక్స్‌పర్ట్స్‌తో చర్చిస్తున్నారట. ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో అప్పీల్ చేసైనా సరే ఎమ్మెల్సీల నియామకంపై సందిగ్ధతకు చెక్ పెట్టాలని భావిస్తున్నారట. లేకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి ఆరు నెలల ముచ్చటగానే మిగిలిపోనుంది.గతంలో నందమూరి హరికృష్ణ కూడా సేమ్ టు సేమ్ ఇలాంటి సిచ్యువేషనే ఎదుర్కొన్నారు. అప్పట్లో హరికృష్ణ కూడా ఏ సభలో సభ్యుడు కాకపోవడంతో మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత ఇక ఆయన రాజకీయాలకే దూరం కావాల్సి వచ్చింది. మళ్లీ చట్టసభలో ఎన్నడూ అడుగుపెట్టలేకపోయారు. ఇప్పుడు అజారుద్దీన్‌కు కూడా అలాంటి పరిస్థితి ఏర్పడిందంటున్నారు.ఒకవేళ ఏప్రిల్ 30లోపు సుప్రీంకోర్టు ఫైనల్ తీర్పు ఇవ్వకపోతే..అజారుద్దీన్‌తో రాజీనామా చేయించి మళ్లీ క్యాబినెట్‌లోకి తీసుకుంటారన్న ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. ఎలాగూ క్యాబినెట్ ప్రక్షాళన చేయాలనే ఆలోచన ఉండటంతో..అజార్‌ను రిజైన్ చేయించి..మళ్లీ మంత్రివర్గంలోకి తీసుకుంటే..ఇంకో ఆరు నెలల టైమ్ ఉంటుందని భావిస్తున్నారట. అప్పటిలోగా సుప్రీంకోర్టు తుది తీర్పు ఇవ్వడమో లేక..నవంబర్‌లో ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ సీట్లలో ఒక బెర్త్ కట్టబెట్టమో రెండింటిలో ఏదో ఒక ఆప్షన్ ఉంటుందనేది హస్తం పార్టీ పెద్దల ఆలోచన అంటున్నారు. ఏదైనా అజారుద్దీన్‌కు..హస్తం పార్టీకి పెద్ద కష్టమే వచ్చిందన్న చర్చ అయితే జరుగుతోంది.

# త్వరలో 14 వేల పోలీస్ కానిస్టేబుళ్ల భర్తీ

హైదరాబాద్, డిసెంబర్ 31, నిరుద్యోగులకు భారీ శుభవార్త. కొత్త సంవత్సరం 2026లో పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తుంది. సరికొత్తగా జాబ్ క్యాలెండర్ రీ షెడ్యూల్ చేసి శాఖల వారీగా ఖాళీలతో నివేదికలను రూపొందిస్తోంది. తాజాగా రిటైర్మెంట్లు పెరగడంతో ఏర్పడిన ఖాళీలను పదోన్నతులతో పాటు, నేరుగా నోటిఫికేషన్లతో నియమించుకోవాలన్న యాక్షన్ ప్లాన్ కు తుది మెరుగులు దిద్దుతోంది.ప్రైవేట్ రంగంలో భారీ సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు చర్యలు చేపడుతున్న ప్రభుత్వం.. ప్రభుత్వ రంగంలోనూ ఆయా శాఖల్లోని ఖాళీలను భర్తీకి పెద్ద సంఖ్యలో ఉద్యోగాల నియామకాలను చేపట్టేందుకు సిద్ధమవుతోంది.

ఇందుకోసం జనవరి, ఫిబ్రవరి నెలలో నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆర్టీసీలో 198 సూపర్ వైజర్ పోస్టులు, పోలీస్ నియామకాలకు సంబంధించిన ప్రకటనలు, యూనివర్శిటీల నియామకాల్లో జాప్యం, పలు శాఖల్లో కారుణ్య నియామకాలు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి.పోలీస్ శాఖలో త్వరలో భారీ సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 14వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయనున్నామని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. సుమారు 14వేల స్టయిపెండరీ క్యాడెట్ కానిస్టేబుళ్లతోపాటు ఇతర యూనిఫామ్ సర్వీసుల కానిస్టేబుళ్ల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు ఉన్నాయని డీజీపీ తెలిపారు. నూతన సంవత్సరంలో దీనికి సంబంధించిన ప్రకటన వెలవడుతుందని ఆయన చెప్పారు.

తెలంగాణ పోలీసు శాఖలో దాదాపు 14 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం నేరాలు తగ్గినప్పటికీ.. మహిళలపై అకృత్యాలు పెరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ పోలీసుల కృషి ప్రశంసనీయమని కొనియాడారు.తెలంగాణ పోలీసు శాఖలో ఖాళీల భర్తీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తీపి కబురు. రాష్ట్రంలో దాదాపు 14 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. చాలా కాలంగా నోటిఫికేషన్ కోసం నిరీక్షిస్తున్న వేలాది మంది అభ్యర్థుల్లో ఈ ప్రకటన కొత్త ఆశలు చిగురింపజేసింది. మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో.. 'తెలంగాణ నేర వార్షిక నివేదిక-2025'ను విడుదల చేసిన సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. డీజీపీ ప్రకటనతో త్వరలోనే నోటిఫికేషన్ వస్తుందని నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇక రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయన్న విమర్శలను డీజీపీ కొట్టిపారేశారు. గణాంకాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య 2.33 శాతం మేర తగ్గుముఖం పట్టిందన్నారు. 2023 నవంబర్ నాటికి రాష్ట్రంలో 2,34,158 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది నవంబర్ నాటికి ఆ సంఖ్య 2,28,695కు తగ్గిందని చెప్పారు. ముఖ్యంగా అల్లర్ల సంఖ్య 42 శాతం తగ్గడం పోలీసుల పనితీరుకు నిదర్శనమని డీజీపీ పేర్కొన్నారు. శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని, ప్రతిపక్షాల ఆరోపణల్లో వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు.'రాష్ట్రంలో మొత్తం నేరాలు తగ్గినప్పటికీ.. మహిళలపై జరుగుతున్న అకృత్యాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. మహిళల ప్రతిష్ఠకు భంగం కలిగించే కేసులు గత ఏడాదితో పోల్చితే 9.02 శాతం పెరిగాయి. 2021లో 4,476 గా ఉన్న ఇటువంటి కేసులు, 2025 నాటికి 6,476కు చేరుకోవడం గమనార్హం. మహిళలపై మొత్తం నేరాల సంఖ్య కూడా 3.16 శాతం పెరిగి 20,551కి చేరింది. అయితే, అత్యాచారాలు, వరకట్న వేధింపులు, కిడ్నాప్‌లు, ఆత్మహత్య ప్రేరణ వంటి కేసులు తగ్గడం కొంత ఊరటనిచ్చే అంశం. మోసపూరితంగా శారీరక సంబంధం పెట్టుకునే ఉదంతాలపై కొత్తగా అమల్లోకి వచ్చిన బీఎన్ఎస్ సెక్షన్ 69 కింద ఈ ఏడాది 69 కేసులు నమోదు చేశాం.

దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు 41 శాతం పెరుగుతుంటే.. తెలంగాణలో మాత్రం పోలీసుల ముమ్మర కసరత్తు వల్ల 3 శాతం తగ్గాయి. సైబర్ నేరాల వల్ల కలిగే ఆర్థిక నష్టాలు దేశస్థాయిలో 6 శాతం తగ్గగా, తెలంగాణలో ఏకంగా 21 శాతం తగ్గుదల నమోదైంది. తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (ఉఇఅూః) కృషి ఫలితంగా ఈ ఏడాది 24,498 మంది బాధితులకు రూ.159.65 కోట్లను తిరిగి ఇప్పించగలిగారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన 'ఈగల్' బృందం ఈ ఏడాది విశేష ఫలితాలను సాధించింది.

సుమారు రూ.172.93 కోట్ల విలువైన డ్రగ్స్‌ను జప్తు చేశారు. ఎన్‌డీపీఎస్ కేసుల నమోదులో 30.36 శాతం పెరుగుదల కనిపించింది, అంటే నిఘా పెరగడం వల్ల నేరస్థులు ఎక్కువగా పట్టుబడుతున్నారు. ఇక మావోయిస్టుల విషయానికి వస్తే, తెలంగాణ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే ఏడాది 509 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు.' అని డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు.

# 152 కేసులు...223 మంది ఉద్యోగులు

హైదరాబాద్, డిసెంబర్ 31,తెలంగాణలో అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్న ఏసీబీ (యాంటీ కరప్షన్ బ్యూరో) ఈ ఏడాది సరికొత్త రికార్డులు నమోదు చేసింది. కరప్షన్ కేసుల నమోదులో గత ఏడాదితో పోలిస్తే భారీగా పెరుగుదల కనిపించింది. అవినీతి అధికారులను వెంటాడుతూ ఏసీబీ చర్యలు చెప్పటినీది . ఈ ఏడాది ఇప్పటివరకు తెలంగాణ ఏసీబీ 220కు పైగా కేసులను నమోదు చేసింది. ఈ కేసుల్లో 150 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులను అరెస్ట్ చేయడం విశేషం. ముఖ్యంగా అధిక శాతం కేసులు ట్రాప్ కేసులే కావడం గమనార్హం. లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన అధికారుల సంఖ్య ఈ ఏడాది మరింత పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏసీబీ నమోదు చేసిన కేసుల సంఖ్య దాదాపు 100 వరకు ఎక్కువగా ఉంది. గత సంవత్సరం మొత్తం 152 కేసులు నమోదు కాగా, వాటిలో 223 మంది ఉద్యోగులను అరెస్ట్ చేశారు. అయితే ఈ ఏడాది కేసుల సంఖ్య మాత్రమే కాకుండా, దాడుల తీవ్రత కూడా పెరిగినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.అత్యధికంగా ఇరిగేషన్, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు ఏసీబీ వలలో చిక్కడం విశేషం. కీలక శాఖల్లో పనిచేస్తున్న అధికారులు లంచాలకు అలవాటు పడటంపై ఏసీబీ ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని ఏసీబీ స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది.మరోవైపు ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల నమోదులో కూడా ఈ ఏడాది పెరుగుదల కనిపించింది. అవినీతితో అక్రమంగా ఆస్తులు కూడబెట్టిన అధికారులపై ఏసీబీ దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే 17 మంది అవినీతి అధికారుల భరతం పట్టినట్టు ఏసీబీ వెల్లడించింది. మొత్తంగా చూస్తే, తెలంగాణలో అవినీతిపై ఏసీబీ చేపడుతున్న చర్యలు మరింత కఠినంగా మారాయి. భవిష్యత్తులో కూడా అవినీతిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఏసీబీ ముందుకెళ్తున్నట్టు స్పష్టమవుతోంది.

# కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిచ్చిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి కాంగ్రెస్ పార్టీలో చేరిన తాటిపాముల సర్పంచ్, వార్డు సభ్యులను వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

శ్రీరంగాపురం మండలం తాటిపాముల గ్రామ సర్పంచ్ శిరీష మద్దిలేటి వార్డు సభ్యులు రేణుక సురేష్, ఆంజనేయులు, అలివేలమ్మ లు, మండలాధ్యక్షులు రాములు యాదవ్ ఆధ్వర్యంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు కాంగ్రెస్ పార్టీలో స్థానం ఉంటుందని స్వేచ్ఛగా ఉండవచ్చునని ఎమ్మెల్యే వారికి సూచించారు.సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తను సర్పంచ్ గా గెలుపొందానని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై, గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, నేడు పలువురు వార్డు సభ్యులతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు శిరీష మదిలేటి పేర్కొన్నారు.10 సంవత్సరాలు ఃఖీూ పాలనలో గ్రామాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయని, నేడు ఇందిరమ్మ రాజ్యంలో గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

తాటిపాముల గ్రామానికి చెందిన 80 మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షులు వెంకటస్వామి, బాబు, చక్రవర్తి, వై రాములు తో పాటు మరో 80 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు.కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్దిలేటి ఔజఎ బాలరాజు, ఎల్ల స్వామి, కాంగ్రెస్ పార్టీ పాల్గొన్నారు.

## జనవరి 2 నుంచి పట్టాదారు పుస్తకాల పంపిణీ

రాష్ట్రవ్యాప్తంగా జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు 21.80 లక్షల పట్టాదారు పాస్పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ రాజముద్రతో కొత్తగా ముద్రించిన ఈ పాస్పుస్తకాలను రైతులకు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏమైనా తప్పులు గుర్తిస్తే సరిదిద్దుకునే అవకాశం కల్పించనున్నారు. ఊరూరా రెవెన్యూ గ్రామసభల ద్వారా పంపిణీ జరగనుంది. ఇటీవల కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు తేదీలను ఖరారు చేశారు.

# మాయం అవుతున్న గుట్టలు

హైదరాబాద్, డిసెంబర్ 31, రాత్రి పడితే చాలు మొరం మాఫియా రాత్రికి రాత్రి గుట్టలను గుటుక్కుమని మాయం చేస్తున్నారు. గ్రామ శివారులు పట్టణ శివారు లతోపాటు చెరువులు గుట్టలను తవ్వేస్తూ మొరం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది. సెలవు దినాలతో పాటు రాత్రి వేళల్లోనూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టరాజ్యంగా మొరం తరలిస్తూ లక్షలాది రూపాయలను అర్జిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ పరిధిలోని జుక్కల్ మద్నూర్ బిచ్కుంద పిట్లం పెద్ద కోడాప్గల్ నిజాంసాగర్ బీర్కూర్ నస్రుల్లాబాద్ నాగిరెడ్డిపేట్ ఎల్లారెడ్డి బాన్సువాడ, బీర్కూర్ కోటగిరి వర్ని చందూర్ పోతంగల్ రుద్రూర్ మోస్రా మండలాల్లో మొరం, మట్టి అక్రమ తరలింపు జోరుగా సాగుతుంది. అనుమతులు లేకుండా భారీగా మొరం తరలిస్తూ అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఒకటి టిప్పర్ వంటి వాహనాలకు మొరం కు ప్రభుత్వం నుంచి ఒక టన్నుకు రాయల్టీ డిఎంఎఫ్, ఎస్ఎంటి, ఇతర పన్నులు అన్ని కలిపి ఒక టన్నుకు రూ. 56 రూపాయల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఒక టిప్పర్ కు సుమారు రూ. 900 రాయల్టీ చెల్లించాలి. కానీ ఇవేవీ లేకుండానే మొరనీ తరలింపు చేస్తున్నారు. రోజుకు వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా మొరం ఒక్కో టిప్పర్ ధర రూ 4000 నుండి 4500 వరకు విక్రయిస్తున్నారు. రోజువారీగా సగటున బాన్సువాడ మండలం నుండే లక్షల్లో వాల్టా రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రావాల్సి ఉండగా ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన రాయల్టీ సొమ్ము, అక్రమార్కుల జేబుల్లోకి వెళ్తుండడంతో గుట్టలు స్వాహా చేస్తున్న మాఫియా పై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు మొరం కావాలంటే సవా లక్ష నియమ నిబంధనలు పెట్టే అధికారులు. అక్రమ రవాణా చేసే వ్యాపారులకు ఎలాంటి నిబంధనలు వర్తించవు. సెలవు వచ్చిందంటే చాలు ఏ అనుమతులు ఉండవు. సర్కారుకు వాల్టా రాయల్టీ చెల్లించరు. అయినా రాత్రి, పగలు అనే తేడా లేకుండా మొరం కొల్లగొడుతారు. ప్రభుత్వానికి ఎలాంటి వాల్టా రాయల్టీ చెల్లించకుండా అధికారులకు మచ్చిక చేసుకొని అక్రమ రవాణా చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట మొరం దందా సాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాన్సువాడ మండలం కొల్లూరు శివార్లలో, సోమేశ్వర్, దేశాయిపేట్, బుడిమి, జక్కల దాని తాండ కెనాల్ శివార్లలో గ్రామ శివారులోని గుట్టల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు కొనసాగుతున్నాయి. టిప్పర్లలో నిత్యం వందల ట్రిప్పుల మొరాన్ని సోమేశ్వర్ శివారు ప్రైవేట్ వెంచర్, బాన్సువాడ లోని ప్రైవేటు వెంచర్లకు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. అక్రమ రవాణా రెవెన్యూ, పోలీస్ అధికారులకు తెలిసినప్పటికీ తెరవెనుక ఈ అక్రమ దందా అధికారులు సంపూర్ణంగా వ్యాపారులకు సహకరిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ అక్రమ దందాకు అధికారులు అండగా ఉండడంతో మూడు పువ్వులు ఆరుకాయలుగా విరజిల్లింది. దీంతో ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు ఈ అక్రమ దందా కు వత్తాసు పలకడంతో వ్యాపారులకు ఈ అక్రమ దందా ద్వారా కాసులు వర్షం కురిపించేందుకే అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ జీతం తీసుకుంటూ ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాల్సిన అధికారులే ప్రభుత్వ గండి కొడుతున్న మాఫియాకు వత్తాసు పలుకుతూ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులకు ఏదైనా సమాచారం తెలుసుకు నేందుకు ఫోన్ చేస్తే మండల అధికారులు, జీపిఓలు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం బట్టి చూస్తే అధికారుల నిర్లక్ష్యం ఎలా ఉన్నదో ఇట్టే అర్థమవుతుంది. ప్రభుత్వ ఆదాయానికి గండికోడుతూ మొరం తరలించే వారికి అండగా ఉన్న మండల ఆయా శాఖల అధికారుల పై జిల్లా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు ఇంత జరుగుతున్న రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అక్రమార్కులు రాత్రిపూట తవ్వకాలు జరిపి గుట్టలను, చెరువులను మాయం చేస్తున్నారు. మైనింగ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినా అధికార పార్టీకి చెందిన నాయకుల పేరు చెప్పి తవ్వకాలు చేపడుతున్నారు. మొరం మాఫియా ఆగడాలు మితిమీరడంతో వనరులు, వృక్ష సంపద కనుమరుగవుతున్నది. అనుమతులు లేకుండా సాగుతున్న మొరం వ్యాపారంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నది. మొరం వ్యాపారం చేయాలంటే మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకొని రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇవ్వాలనే నిబంధన ఉన్నది. కానీ బాన్సువాడ డివిజన్లో నిబంధనలను తుంగలో తొక్కి దర్జాగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అక్రమ మొరం, మట్టి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖ అధికారులు మామూలు తీసుకొని అక్రమార్కులకు అండదండలు అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అభివృద్ధి పనుల పేరిట అధికారులకు తెలుపుతూ ప్రైవేటు వ్యక్తులు చేపడుతున్న ఇండ్ల నిర్మాణాలు, వెంచర్ల ఇతరత్రా నిర్మాణాలకు రాత్రి సమయాల్లో మట్టి, మొరం విక్రయాలతో వ్యాపారం సాగిస్తున్నారు. మట్టి, మొరం అక్రమ తవ్వకాలను నియంత్రించాలని స్థానికులు పేర్కొంటున్నారు. సెలవు దినాల్లో, రాత్రి వేళలో జరుగుతున్న అక్రమ మురం తవ్వకాలు రవాణాకు రెవిన్యూ పోలీస్ శాఖలో కొంతమంది అధికారులు కుమ్మక్కు అయినట్లు పలు ఆరోపణలు ఉన్నాయి. అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు పోలీస్ శాఖ పనిలో ఎదుట నుండే అక్రమ మొరం రవాణా సాగుతున్న పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు సైతం పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు ఉన్నాయి. ఇంత అక్రమ రవాణా జరుగుతున్న అటు రెవెన్యూ ఇటు పోలీస్ శాఖ నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాకుండా కొంతమంది అధికారుల ప్రమేయం ఉండడంతోనే రాత్రి వేళలో అక్రమ రవాణా సాగుతుందని పలు విమర్శలు కూడా తావు ఇస్తుంది ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక బృందంతో తనిఖీలు చేపట్టి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ప్రజలకు శాపంగా మారుతున్న మద్యం దుకాణాలు

కూకట్ పల్లి మద్యం ప్రియులకు మేలు చేసేలా తెరుచుకుంటున్న వైన్ షాపులు, సామాన్య ప్రజలకు మాత్రం శాపంగా మారుతున్నాయి. ఇప్పటికే కూకట్పల్లి ప్రాంతంలో వైన్ షాపుల సంఖ్య పెరిగినా, జనావాసాల మధ్యలోనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ నిర్లక్ష్యానికి ఉదాహరణగా కూకట్పల్లిలోని దారువాల వైన్స్ నిలుస్తోంది. నేషనల్ హైవే మీద ఇప్పటికే ట్రాఫిక్ సమస్యలు ఉండగా, అదే మార్గంలో ఈ మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం వాహనదారుల కష్టాలను రెట్టింపు చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలు సేదతీరేందుకు ఏర్పాటు చేసిన బతుకమ్మ కుంట, ఐడిఎల్ చెరువు సమీపంలోని పార్కులు, ఇప్పుడు మందుబాబుల అడ్డాలుగా మారాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
అనుమతులు లేకుండా, టౌన్ ప్లానింగ్ అధికారులను ప్ర భావితం చేసి రేకుల షెడ్డు ఏర్పాటు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.
పార్కుల్లోనే మద్యం సేవించడంతో మహిళలు, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక హైవే నుంచి హైటెక్ సిటీకి వెళ్లే హైస్పీడ్ రోడ్డుపై, యూటర్న్ వద్ద వైన్ షాప్ ఏర్పాటు చేయడం ప్రమాదాలకు ఆహ్వానం పలికినట్లేనని స్థానికులు హెచ్చరిస్తున్నారు. పక్కనే హెవీ వెహికల్ పార్కింగ్, రోజూ ట్రాఫిక్ రద్దీ ఉన్న ఈ రోడ్డుపై దారువాల వైన్స్ ప్రారంభం ప్రజలకు తీవ్రమైన కష్టంగా మారింది. బతుకమ్మ వేడుకలు, వినాయక నిమర్జన జరిగే ఈ ప్రాంతంలో ప్రజలకు ఇబ్బందిగా మారిన ఈ అక్రమ మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## టీటీడీ ఎస్వీ విద్యాదాన ట్రస్ట్ కు రూ 1 కోటి విరాళం



తిరుమల టీటీడీ నిర్వహిస్తున్న ఎస్వీ విద్యాదాన ట్రస్ట్ కు రూ 1 కోటి విరాళం అందింది. విజ్ఞాన్స్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్యచ క్యాంప్ కార్యాలయంలో చైర్మన్ బిఆర్ నాయుడుని కలిసి విరాళం డిడిని అందజేసారు. విజ్ఞాన్స్ సంస్థ తరపున విరాళం అందజేసిన దాతను చైర్మన్ అభినందించారు.

## కేటీఆర్ ను కలిసిన బీఆర్ఎస్ ఉపనేతలు



హైదరాబాద్ శాసన మండలిలో బీఆర్ఎస్ పార్టీ శాసనమండలి పక్ష ఉపనేతగా (డిప్యూటీ ఫ్లోర్ లీడర్గా) నియమితులైన పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మండలిలో పార్టీ విప్గా నియమితులైన దేశపతి శ్రీనివాస్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి వారితో ఉన్నారు.

## కూడళ్ళు, రోడ్ల మధ్యలో పచ్చదనం పెంచేలా చర్యలు చేపట్టండి.
## కమిషనర్ ఎన్.మౌర్య.



నగరంలో ప్రధాన రోడ్లలోని డివైడర్లలో, కూడళ్ళలో పచ్చదనం పెంచేలా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం నగరంలోని వెంగమాంబ కూడలి, వెస్ట్ చర్చి రోడ్డు, బాలాజీ కాలనీ, ఎస్.వి.నగర్, తదితర ప్రాంతాల్లో డివైడర్లను, కూడళ్ళను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని డివైడర్ల మధ్యలో పలు రకాల పూల మొక్కలు నాటి సుందరంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే కూడళ్ళలో కూడా పచ్చిక పెంచి మొక్కలు పెంచాలని తెలిపారు. డివైడర్లు, కూడళ్ళ మధ్య ఉన్న మొక్కలు పాడు కాకుండా ఇనుప గ్రిల్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రహరీ గోడలకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా పెయింటింగ్ చేయించేలా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, డి.ఈ.లు మధు, మహేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, అంబేద్కర్ పూలే ఫౌండేషన్ వ్యవస్థపాక అధ్యక్షులు పరసారత్నం, ప్రజలు తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే రాయలసీమలో

**పుట్టపర్తి నియోజవర్గంలోనీ అన్ని చెరువులను కృష్ణా జలాలతో నింపుతాం.**
**నూతన ఏడాదికి ఒకరోజు ముందుగానే అవ్వ తాత ,వితంతు,వికలాంగులకు పెన్షన్లు పండుగ**
**ప్రజలందరికీ 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు.**
**నియోజవర్గం లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



కొత్త చెరువు/పుట్టపర్తి : 31ఎడారి ప్రాంతమైన రాయలసీమ ప్రాంతానికి పూర్తిగా జలకల రావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక కృషితోనే సాధ్యమైందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువు మండలం బండ్లపల్లి పంచాయతీలోని నారాయణపురం ,అప్పలవాండ్లపల్లి ,గౌనికుంటపల్లి , పుట్టపర్తి మండలంలోని జగరాజుపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా వృద్ధులకు వితంతు వికలాంగులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామాల్లో ప్రజలు కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పూలవర్షం కురిపిస్తూ అపూర్వ స్వాగతం పలికారు. పింఛన్లు పంపిణీ తో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం లో జనవరి 1 తేదీ కంటే ఒకరోజు ముందుగానే డిసెంబర్ 31న ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ తో గ్రామాల్లో ఉన్న ప్రజలకు నూతన సంవత్సర 2026 వేడుకలు ప్రారంభమయ్యాయనీ నియోజవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తెలిపారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా రాయలసీమ ప్రాంతాల్లో నీటి కళ వచ్చిందన్నారు. ఈ ఐదేళ్లలో కూటమి ప్రభుత్వం లో నియోజవర్గం లోని అన్ని చెరువులకు కృష్ణా జలాలతో నింపుతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కులాలకు మతాలకు అతీతంగా అన్ని వర్గాలకు సమాన స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పెద్ద ఎత్తున సంక్షేమం ,అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన రాష్ట్రాలు ఏవి లేవని ఒక్క ఆంధ్ర ప్రదేశ్ లోనే సంక్షేమ ,అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్నాయని తెలిపారు. పెన్షన్లు రెట్టింపు తల్లికి వందనం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు సహాయం, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు సిలిండర్లు అందజేస్తున్నామని ప్రజలకు వెల్లడించారు. ఈ ఏడాది 2025 కు వీడ్కోలు పలుకుతూ 2026 నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## నూతన సంవత్సరం2026 సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు.
## – ఆళ్లగడ్డ డిఎస్పి కె. ప్రమోద్ .

,తన సంవత్సరం 2026 ను ప్రజలందరూ బాధ్యతాయుతంగా, శాంతియుతంగా జరుపుకోవాలని ఆళ్లగడ్డ డిఎస్పి కె. ప్రమోద్ గారు పిలుపునిచ్చారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా నూతన సంవత్సరం సందర్భంగా ఆళ్లగడ్డ సబ్ డివిజన్ వ్యాప్తంగా కొన్ని ఆంక్షలు మరియు భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్య ఆంక్షలు,చర్యలు:– ఆళ్ళగడ్డ సబ్ డివిజన్ వ్యాప్తంగా నిర్ణీత సమయానికి హోటళ్లు, మద్యం దుకాణాలు, బార్లు, ఇతర వాణిజ్య సంస్థలు మూసివేయబడతాయి.– ఆళ్ళగడ్డ సబ్ డివిజన్ వ్యాప్తంగా ముఖ్య పట్టణాలు, ప్రధాన రహదారులపై ప్రత్యేక పోలీస్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించబడతాయి.– డిసెంబర్ 31 రాత్రి మరియు జనవరి 1 తేదీల్లో సబ్ డివిజన్ అంతటా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.– ఆళ్లగడ్డ సబ్ డివిజన్ వ్యాప్తంగా డీజేలు, లౌడ్స్పీకర్ల వినియోగం, శబ్ద కాలుష్యం, అశ్లీల నృత్యాలు పూర్తిగా నిషేధించబడ్డాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయబడతాయి.– బహిరంగ ప్రదేశాల్లో కేక్ కటింగ్, డాన్సులు, పార్టీలు, రంగులు పూయడం, టపాకాయలు కాల్చడం పూర్తిగా నిషేధించబడింది.– బైక్ రేసింగ్, అధిక వేగంతో వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం లేదా వారు నడపడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు సిఫారసు చేయబడుతుంది. మైనర్లకు వాహనాలు ఇస్తే మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం వారి తల్లిదండ్రుల పైన కూడా కేసులు నమోదు చేయబడతాయి . –మహిళల భద్రత ను దృష్టి లో ఉంచుకొని మఫ్టీ టీం లు ఏర్పాటు చేయడం జరుగుతుంది. డిసెంబర్ 31 రాత్రి ఎవరైనా మహిళల పై అసభ్యంగా ప్రవర్తించిన , వారిపై చెడు కామెంట్లు చేసిన వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకొనబడతాయి.– ప్రైవేట్ ప్రదేశాల్లో జరిగే కార్యక్రమాలకు ముందస్తు పోలీస్ అనుమతి తప్పనిసరి.– డిసెంబర్ 31 రాత్రి 8 :00 గంటల నుండి బందోబస్త్ ఏర్పాటు చేయడం జరుగుతుంది.– సబ్ డివిజన్ వ్యాప్తంగా ముఖ్యమైన ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేయబడింది.– చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.– అత్యవసర సమయం లో టతిజీశ్రీ 100 కానీ 112 కు గాని ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు. – యువత తొందరపాటు చర్యలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కొని తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు.–

## తగినంత యూరియా వుంది కలెక్టర్

సిద్దిపేట రైతులు ఎవరు కూడా అధైర్య పడవద్దని జిల్లాలో సరిపడినన్ని యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కె. హైమావతి రైతులకు సూచించారు. మిర్దొడ్డి మండలం అల్వాల గ్రామంలోని రైతు వేదికలో యూరియా కార్డుల పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు యాసంగి సీజన్ లో ఎక్కడ కూడా యూరియా కొరత రాకుండా పగడ్బందిగా ప్రణాళిక ప్రకారం అన్ని సెంటర్ లలో యూరియా బస్తాలను రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నాం. మీ ప్రాంతాల్లోని వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటారని మీ యొక్క పాసు బుక్ తీసుకుని వచ్చి యూరియా కార్డులను తీసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఒక ఎకరాకు 2 బస్తాల చొప్పున యూరియా పంపిణీ చెయ్యాలని వ్యవసాయ శాఖ అధికారులకు తెలిపారు. కౌలు రైతులు సైతం అధైర్య పడవద్దని మీరు చేస్తున వ్యవసాయ క్షేత్ర పట్టేదార్ పాస్ బుక్ లేదా జిరాక్స్ తీసుకువస్తే యూరియా అందిస్తామని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న యూరియా కొరత కథనాలను నమ్మవద్దని ప్రతి రైతుకు యూరియా అందించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట వ్యవసాయ శాఖ ఏఓ, ఏఈఓ తదితరులు ఉన్నారు.

# అంతర్ రాష్ట్ర బ్యాగ్ లిఫ్టింగ్ ముఠా అరెస్ట్

## - రూ.75 లక్షల బంగారు, వెండి నగలు స్వాధీనం

## కడప ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్



బద్వేలు కడప జిల్లాలో బస్సులు, బస్సు స్టాండ్లు ఆటోలలో ప్రయాణికులను లక్ష్యంగా చేసుకొని బ్యాగ్ లిఫ్టింగ్‌కు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను యర్రగుంట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో భారీగా దొంగ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వై.ఎస్.ఆర్ కడప జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు.

సుమారు 507 గ్రాముల బంగారు ఆభరణాలుసుమారు 1½ కేజీ వెండిరూ. 61,000 నగదుసుమారు రూ. 4 లక్షల విలువైన కారునేరాలకు ఉపయోగించిన మొబైల్ ఫోన్లుఈ కేసులో మొత్తం 9 మంది అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేశారు.

ఈ ముఠా సభ్యులు బస్సులు మరియు ఆటోలలో ప్రయాణికుల్లా కలిసి ప్రయాణిస్తూ, ఒకరు టికెట్ తీసుకున్నట్టు నటించడం, మరొకరు మాటలతో దృష్టి మళ్లించడం ద్వారాప్రయాణికులను ఏమరపాటు గురిచేసి, వారి బ్యాగుల్లో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు, పర్సులు, బాక్సులు దొంగిలిస్తున్నట్లు వెల్లడైంది. దొంగతనం అనంతరం, మధ్యలో దిగిపోయి, వెనుక వస్తున్న తమ కారులో ఎక్కి, అనుమానం రాకుండా గుడుల వద్దకు వెళ్లి విశ్రాంతి తీసుకునే పద్ధతిని అనుసరించేవారని తెలిపారు.

# అసెంబ్లీలో రేవంత్‌ను ఎదుర్కొనేందుకు హరీష్‌కు పవర్స్

హైదరాబాద్ అసెంబ్లీలో బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా హరీష్ రావును నియమిస్తూ కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఉభయ సభల్లో పార్టీ గళాన్ని బలంగా వినిపించేందుకు అనుభవజ్ఞులైన నేతలకు బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉప నేతలుగా బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకాల ద్వారా అటు అసెంబ్లీలో, ఇటు మండలిలో అధికార పక్షాన్ని ధీటుగా ఎదుర్కోవాలని కేసీఆర్ దిశానిర్దేశం చేసినట్లయింది.శాసనసభలో హరీష్ రావుతో పాటు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ లకు కూడా డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా నియమించారు. సభా వ్యవహారాలపై పూర్తి అవగాహన ఉన్న హరీష్ రావుతో పాటు, మహిళా, బీసీ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని సబితా ఇంద్రారెడ్డి, తలసానిలకు ఈ కీలక బాధ్యతలు అప్పగించారు. వీరు ముగ్గురూ సభలో పార్టీ పక్షాన కీలక అంశాలపై చర్చను నడిపించనున్నారు. శాసనమండలిలో ఎల్. రమణతో పాటు పి.సతీష్ రెడ్డిని ఉప నేతలుగా ఎంపిక చేశారు. సభ్యులను సమన్వయం చేసేందుకు దేశపతి శ్రీనివాస్‌ను పార్టీ విప్‌గా నియమించారు.అసెంబ్లీలో సబిత, తలసానికి కూడా డిప్యూటీ లీడర్ హోదా ఇచ్చినప్పటి హరీష్ రావు మాత్రమే అధికారపక్షాన్ని ముఖ్యంగా రేవంత్ రెడ్డిని ఎదుర్కోనున్నారు. కేసీఆర్ అసెంబ్లీకి హాజరయ్యే అవకాశాలు లేకపోవడంతో ఈ నియామకాలు ఆసక్తికరంగా ఉన్నాయి. గతంలోనూ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని హరీష్ రావే ఎదుర్కొన్నారు. కేటీఆర్ ఎక్కువగా జోక్యం చేసుకునేవారు కాదు. ఈ సారి నేరుగా హరీష్ రంగంలోకి వస్తున్నారు.

# బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ కీలక భేటీ చర్చించిన అంశాలివే

హైదరాబాద్ బీఆర్ఎస్ నేతలతో మాజీ సీఎం-బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమావేశమయ్యారు. నందినగర్ నివాసంలో జరిగిన ఈ భేటీలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు గులాబీ బాస్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ప్రధానంగా పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించి అసెంబ్లీ వేదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగట్టాలన్నదే బీఆర్ఎస్ వ్యూహం.ఇందులో భాగంగానే ఈ అసెంబ్లీ సమావేశాలను పూర్తిగా ఉపయోగించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ విషయంలో గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని, ఈ ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టి కేవలం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను మాత్రమే నిర్మించిందని అధికార కాంగ్రెస్ పార్టీ ఆరోపణ. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల కాలంలో అటు కృష్ణా, ఇటు గోదావరి రెండు నదులపై చేపట్టిన ప్రాజెక్టులు, నీటి వాటాలు పరిష్కరించామని ఆ పార్టీ చెప్పుకొస్తోంది.ఇదే విషయంపై కొద్ది రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం మధ్య మాటల యుద్ధం వ్యక్తిగత దూషణలకు దారి తీసింది. వీటన్నింటికీ అసెంబ్లీ వేదికగా సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ గట్టి పట్టుదలతో ఉంది. ఇందులో భాగంగానే కేసీఆర్‌తో కేటీఆర్, హరీష్ రావు, ఇతర నాయకులు సమావేశమయ్యారు. ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది?ప్రభుత్వం చెప్పే ప్రతీ అంశంపై సమాధానంతో సిద్ధంగా ఉండాలని ఇప్పటికే పార్టీ నేతలకు కేసీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది.

# 18.20 లక్షల విలువైన 91 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేసిన సీపీ గౌష్ ఆలం




కరీంనగర్ సీఇఐఆర్ పోర్టల్ ద్వారా కరీంనగర్ కమిషనరేట్‌లో రికవరీల జోరు: ఏడాదిలో 2,056 ఫోన్ల అప్పగింత.కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను వెలికితీయడంలో సిఇఐ ఆర్ పోర్టల్ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ, బాధితులకు ఊరట కలిగిస్తున్నారు. బుధవారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా పాల్గొని, సుమారు 18 లక్షల 20 వేల రూపాయల విలువ గల 91 రికవరీ మొబైల్ ఫోన్లను బాధితులకు స్వయంగా అందజేశారు.?

టెక్నికల్ టీమ్‌కు ప్రత్యేక ప్రశంసలు-రివార్డుల ప్రకటన:?

ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ. ఫోన్లను ట్రేస్ చేయడంలో అద్భుత ప్రతిభ కనబరిచిన రూరల్ పోలీస్ స్టేషన్ టెక్నికల్ టీమ్ సభ్యులు కానిస్టేబుళ్ళు విశ్వతేజ, రాంసాయి, కీర్తనలను ప్రత్యేకంగా అభినందించారు. వీరి కృషిని గుర్తించి వారికి త్వరలోనే రివార్డులు అందజేయాలని అధికారులకు సూచించారు.?వార్షిక గణాంకాలు జనవరి1- డిసెంబర్ 29, 2025,?అఇఎఫీ అవనిబితీజీశ్రీ ఇనబీతిజూఎవనిబి ఎటవనిబితిబిఎ ఖీవణతిబబివతీ, పోర్టల్ ద్వారా కరీంనగర్ కమిషనరేట్ సాధించిన పురోగతిని సీపీ వివరించారు:?మొత్తం ఫిర్యాదులు: 6,700?గుర్తించిన ఫోన్లు: 3,939?బాధితులకు అప్పగించినవి: 2,056 52% సక్సెస్ రేటు,?రికవరీ ప్రక్రియలో ఉన్నవి.. 1,883పోలీస్ ?స్టేషన్ల వారీగా ప్రతిభ, ?రికవరీలలో మానకొండూర్ 75%, కరీంనగర్ రూరల్ (ల73%, అత్యుత్తమ ఫలితాలు సాధించగా, చొప్పదండి, ఇల్లందకుంట, రామడుగు పోలీస్ స్టేషన్లు 70% రికవరీతో మెరుగ్గా నిలిచాయి. కరీంనగర్ వన్ టౌన్ అత్యధికంగా 1,011 ఫోన్లను గుర్తించి రికార్డు సృష్టించింది.?ఈ కార్యక్రమంలో ఏసీపీ విజయకుమార్, ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, ఎస్సైలు నరేష్, లక్ష్మా రెడ్డి మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# ఫౌండేషన్ సేవలు మరింత విస్తరిస్తాం

## - సైనిక్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు అరిగెల రాకేష్

మెట్ పల్లి పేదలకు సాయం చేయడానికి ఫౌండేషన్ సేవలను మరింత విస్తరిస్తామని మెట్ పల్లి సైనిక్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు అరిగెల రాకేష్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మెట్ పల్లి సైనిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం ప్రాంతానికి చెందిన పుసులూరి నవ్య అను మహిళ సహకారంతో రోడ్డు పక్కన ఉండే అభాగ్యులకు చలికాలంలో రక్షణగా దుప్పట్లను పంపిణీ చేశారు. అలాగే మరికొన్ని నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించడం జరిగింది. అలాగే మెట్ పల్లి పెద్దమ్మ దేవాలయం వద్ద ఉన్న గోశాలకు నెలకు సరిపడా పశుగ్రాసం అందించారు. ఈ సందర్భంగా సైనిక్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు అరిగెల రాకేష్ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయాలని ఉద్దేశంతో ఫౌండేషన్ స్థాపించడం జరిగిందన్నారు. ఫౌండేషన్ తో పాటు కొంతమంది ఉదార స్వభావంతో అందిస్తున్న ఆర్థిక సహాయంతో శివ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫౌండేషన్ సేవలను మరింత విస్తరించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ సైనిక్ ఫౌండేషన్ సభ్యులు పోతుగంటి వినోద్, మిట్టపల్లి కార్తీక్, కోయల్కర్ హరీష్, కురుమ శెట్టి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# మీకు రోజూ తగినంత కాల్షియం అందుతుందా

## ఎవరెవరికి ఎంత కాల్షియం కావాలో తెలుసుకోండి.!


## ఆఖీ. వి.శ్రావణ్ కుమార్ మెడికేర్ హాస్పిటల్ కోహెడ



కోహెడకో మన శరీరానికి అవసరమైన ముఖ్యమైన మినరల్స్‌లో కాల్షియం ఒకటి. ఇది ఎముకలను దృఢంగా ఉంచుతుందన్న విషయం అందరికీ తెలిసిందే. కాల్షియం ఉన్న ఆహారాలను తీసుకుంటేనే మనకు కాల్షియం బాగా లభిస్తుంది. దీంతో ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. ఇక పెద్దల్లో సుమారుగా 1200 నుంచి 1400 గ్రాముల కాల్షియం ఉంటుంది. ఇది 99 శాతం వరకు వారి ఎముకలు, దంతాల్లోనే ఉంటుంది. మిగిలిన 1 శాతం శరీరంలోని ఇతర భాగాల్లో ఉంటుంది. కనుక ఈపాటికే మీకు అర్థమైపోయి ఉంటుంది. ఎముకలకు ఎంతగా కాల్షియం కావాలో. కనుక కాల్షియం ఉండే ఆహారాలను రోజూ తీసుకోవాలి.కాల్షియం కేవలం ఎముకలు, దంతాలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచడమే కాదు. పలు ఇతర పనులకు కూడా అవసరం అవుతుంది. దీని వల్ల గుండెకు మేలు జరుగుతుంది. గుండె కొట్టుకునే వేగం నియంత్రించ బడుతుంది. కండరాల పనితీరుకు అవసరం అవుతుంది. మెదడు ఆలోచించేందుకు, శరీర పెరుగుదలకు కూడా కాల్షియం అవసరం అవుతుంది.పెద్దలకు రోజుకు సుమారుగా 800 మిల్లీగ్రాముల మేర కాల్షియం కావాలి. అదే యువత, గర్భిణీలు, మెనోపాజ్ దశలో ఉన్న మహిళలకు రోజుకు 1200 మిల్లీగ్రాముల కాల్షియం అవసరం. అయితే కాల్షియం సులభంగా లభించాలంటే అవి ఉన్న ఆహారాలను రోజూ తినాలి. ముఖ్యంగా మనకు కాల్షియం నువ్వుల్లో అధికంగా లభిస్తుంది. వీటిని గుప్పెడు మోతాదులో రోజూ పెనంపై కాస్త వేయించి తినాలి. లేదా నువ్వులు, బెల్లంతో తయారు చేసే నువ్వుల లడ్డూను రోజుకు ఒకటి తిన్నా చాలు..మనకు కాల్షియం పుష్కలంగా లభిస్తుంది. ఇది ఎముకలను దృఢంగా మారుస్తుంది.ఇక కాల్షియం మనకు ఇతర ఆహారాల్లోనూ అధికంగా లభిస్తుంది. అంజీర్ పండ్లు, రాజ్మా, ఆవాలు, పాలు, డ్రైఫ్రూట్స్,నట్స్, ములగ ఆకు నారింజలు, రొయ్యలు, గుడ్లు, పెరుగు వంటి ఆహారాలను తరచూ తీసుకుంటుంటే కాల్షియం బాగా లభిస్తుంది. దీంతో కాల్షియం లోపం రాకుండా చూసుకోవచ్చు. ఇక మనం తినే ఆహారాల్లో ఉండే కాల్షియంను శరీరం సరిగ్గా శోషించుకోవాలంటే అందుకు "విటమిన్ డి" అవసరం అవుతుంది. కనుక కేవలం కాల్షియం మాత్రమే కాదు. విటమిన్ డి కూడా సరిగ్గా లభించేలా చూసుకోవాలి. ఇందుకు గాను ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య సుమారుగా 20 నిమిషాల పాటు శరీరానికి ఎండ తగిలేలా ఉండాలి. దీంతో మన శరీరం విటమిన్ డిని దానంతట అదే తయారు చేసుకుంటుంది. ఇది కాల్షియం శోషణకు అవసరం అవుతుంది. అలాగే రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. కొవ్వును కరిగిస్తుంది. కనుక కాల్షియం పొందాలంటే విటమిన్ డి కూడా లభించేలా చూసుకోవాలి.విటమిన్ డి మనకు రోజుకు 10 నుంచి 20 మైక్రోగ్రాములు లేదా 400 నుంచి 800 ఐయూ మేర అవసరం అవుతుంది. ఇది సూర్య రశ్మితోపాటు పుట్టగొడుగులు, నారింజ పండ్లు, మాంసం, గుడ్లు, పాలు వంటి ఆహారాల ద్వారా లభిస్తుంది. కనుక విటమిన్ డి, కాల్షియం రెండూ సమపాళ్లలో అందినప్పుడే మన శరీరంలో ఎముకలు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. కనుక ఇవి రెండూ అందేలా చూసుకోవాలి. దీంతో అనేక ప్రయోజనాలు కూడా కలుగుతాయి..మెడికేర్ హాస్పిటల్ కోహెడ-ఆఖీ.వి. శ్రావణ్ కుమార్ తెలిపారు.

# భూపోరాటాలకు సిద్దమయిన జాగృతి

హైదరాబాద్ తెలంగాణ ఉద్యమకారులతో కలిసి కల్వకుంట్ల కవిత భూ పోరాటానికి సిద్దమయ్యారు. కరీంనగర్ జిల్లా మానకొండూరులో ప్రభుత్వ భూమిలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, తెలంగాణ ఉద్యమకారులు గుడిసెలు వేయనున్నారు. కవిత మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల చొప్పున ఇంటి స్థలం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇంటి స్థలాల హామీని డిసెంబర్ 9వ తేదీలోగా నెరవేర్చకుంటే భూ పోరాటాలకు చేస్తామని ఇదివరకే స్పష్టం చేసానని అన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో కరీంనగర్ నుంచి భూ పోరాటానికి శ్రీకారం చుడుతున్నామని అన్నారు. కమ్యూనిస్ట్ పార్టీల తరహాలో భూ పోరాటాలుంటాయి. తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు ఇచ్చే వరకు ఉద్యమిస్తామని అన్నారు.



## అసెంబ్లీలో పెన్షనర్ల బకాయిల విడుదల ప్రకటించాలి.
## టీ.పీ.సి.ఏ.రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్.




జగిత్యాల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పెన్షనర్లకు ఇచ్చిన హామీల మేరకు పెండింగ్ బకాయిల విడుదల,పీ.ఆర్.సి.మంజూరు అసెంబ్లీలో ప్రకటించాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు.బుధవారం టీ.పి.సి.ఏ.ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్ల పక్షోత్సావాలు నిర్వహిస్తున్న సందర్భంగా అసోసియేషన్ కార్యాలయంలో జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన 24 మంది ఉద్యోగులను హరి అశోక్ కుమార్ చేతుల మీదుగా ఘనంగా పట్టు శాలువలు కప్పి, మెమెంటోలు,డైరీలను అందించి సన్మానించారు.అనంతరం 2025 సంవత్సరంకు వీడ్కోలు,2026 సంవత్సరంకు స్వాగతం వేడుకలతో పాటు పెన్షనర్ల జిల్లా సంయుక్త కార్యదర్శి ఎమ్.డి.ఇక్బాల్ 70 వ జన్మదిన వేడుకలు,జాతీయ పెన్షనర్ల పక్షోత్సావాలు నిర్వహించారు.ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ 2024 ఏప్రిల్ 1 నుంచి రిటైర్మెంట్ అయిన వారికి ఇంకా అందని ప్రయోజనాలు,పెండింగ్ బకాయిలు వెంటనే క్లియర్ చేయాలని,పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలని,మెరుగైన ఫీట్మెంట్ తో పీ ఆర్.సీ.మంజూరు చేయాలని,ఈ.హెచ్.ఎస్.పథకంను అమలుచేయాలని డిమాండ్ చేశారు.బెనిఫిట్స్ రాక 39 మంది రిటైర్డ్ ఉద్యోగులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో పెన్షనర్లు పోరుబాట పట్టకుండా చూడాల్సిన భాద్యత ప్రభుత్వంపై ఉందన్నారు.. ఉద్యోగుల,పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి టీ.ఈ.జి.జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సి.హన్మంత రెడ్డి,రిటైర్డ్ జిల్లా అటవీ శాఖాధికారి పూసాల అశోక్ రావు,కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథము,ఉపాధ్యక్షులు వెల్ముల ప్రకాష్ రావు,కె.సత్యనారాయణ,ఎమ్.డి.యాకుబ్,ఆర్గనైజింగ్ కార్యదర్శులు సయ్యద్ యూసుఫ్, విజయలక్ష్మి, బొబ్బాటి కరుణ,కట్ట గంగాధర్,నాయిని సంజీవ రావు,,దిండిగాల విఠల్, కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం,మెట్ పల్లి అధ్యక్షుడు కుందేళ్ల మురళి,రాయికల్ అధ్యక్షుడు ఏనుగంటి రాములు,మల్యాల అధ్యక్షుడు ఎమ్.డి.యాకూబ్,కార్యదర్శి వీరారెడ్డి, జిల్లా,డివిజన్,వివిధ మండల యూనిట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ భగవాన్ నామస్మరణం చేయాలి
## గూడెం రాములు యాదవ్

**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి డిసెంబర్ 31(ప్రజాబలం )** వికారాబాద్జిల్లా:మర్పల్లి,వెంకటేశ్వరస్వామికృపాకటాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలిశ్రీ ధనలక్ష్మివెంకటేశ్వరకళ్యాణోత్సవంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు గూడెం రాములు యాదవ్, ప్రతిఒక్కరు భక్తి భావనలవర్చుకొని భగవంతుని నామస్మరణ చేయాలని దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర గుట్ట వద్ద శ్రీ జ్ఞానేశ్వరి మాత ఆధ్వర్యంలో శ్రీ ధనలక్ష్మి వెంకటేశ్వర కళ్యాణం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులను తీసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రతి ఒక్కరూచింతన అలవర్చుకొని భక్తి మార్గంలో నడవాలని దీంతో మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా జీవితంలో ఉన్నత స్థాయికి ఇది ఎందుకు దోహదం చేస్తుందన్నారు. ఈ కళ్యాణోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఆ వెంకటేశ్వరస్వామికృపాకటాలతో ప్రజలందరికీలభించిఆయురారోగ్యాలతో జీవించాలని మనసా ర కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో శతల్లి రంగారెడ్డి, వడ్ల వెంకటేశం, శ్రీనివాస్ రెడ్డి (లడ్డు), గోవర్ధన్ రెడ్డి, సంతోష్ రెడ్డి, మంగలి వెంకట్, వడ్ల సాయి, గ్రామస్తులు మహిళలు భజన భక్తులు తదితరులు పాల్గొన్నారు.





## వికారాబాద్ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి డిసెంబర్ 31 (ప్రజాబలం)** వికారాబాద్ జిల్లా: వికారాబాద్ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్ కె ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టరేట్ అవార్డుగ్రహీత సనా గారి కొండల్ రెడ్డి, 2026 నూతన సంవత్సరంలో వికారాబాద్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో అందరూ సంతోషంగా నూతన సంవత్సరం ప్రారంభించాలని కోరుకుంటూ వికారాబాద్ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు మీ మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సన్నగారి కొండల్ రెడ్డి

## యూరియా కోసం మళ్లీ కష్టాలు

వరంగల్, డిసెంబర్ 31,తెలంగాణలో రైతులకు యూరియా సమస్య ఇంకా తీరలేదు. నెలలు గడుస్తున్నా, సాగు సీజన్ కొనసాగుతున్నా రైతుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలో జరిగిన ఒక ఘటన అద్దం పడుతోంది. పొలాలకు సకాలంలో ఎరువులు అందక, పంటలు ఎండిపోతాయనే ఆందోళనతో అన్నదాతలు పడుతున్న అగచాట్లు వర్ణనాతీతంగా మారాయి. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడినా ప్రయోజనం లేకపోయింది.తమ కళ్ల ముందే పంటలు దెబ్బతింటుంటే చూస్తూ భరించలేక, కనీసం ఎరువులు ఇప్పించమని కోరుతూ ఒక రైతు ఏకంగా వ్యవసాయ అధికారి కాళ్ల మీద పడి వేడుకోవడం అందరినీ కలిచివేసింది.

## మర్పల్లి పోలీస్ స్టేషన్ ను అకస్మాత్తుగా తనిఖీ చేసిన వికారాబాద్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి






**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి డిసెంబర్ 31(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి, మర్పల్లి పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, మర్పల్లి పీఎస్ లో గౌరవ వందనం అందించిన సిబ్బంది,విధి నిర్వహణలో బాధ్యత గా ఉండాలనితెలిపారు,ఆత్మహత్యలను కౌన్సెలింగ్ విధానంలో తగ్గించాలి,రోడ్ ప్రమాదాలను తగ్గించాలి,డ్రంక్ అండ్ డ్రైవ్ రోజు వారిగా నిర్వహించాలి,పాత నేరస్థుల మీద నిఘా ఉంచాలి,పాత కేసులను త్వరిత్య గదిలో పరిష్కరించాలి న్యూ ఇయర్ ఎక్కడ ఇబ్బందులు జరగకుండాప్రజలందరూ సంతోషంగా జరుపుకునేటట్టు విధి నిర్వహణలో ఎలాంట్ గా ఉండాలని తెలిపారు మోమిన్ పేట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్, మర్పల్లిసబ్ ఇన్స్పెక్టర్ రవుఫ్, ఏఎస్ఐ భూపతిరెడ్డి జందార్ నారాయణ, సిబ్బంది గౌరవ వందనం తెలిపారు

## cగ్రేటర్ ఉప్పల్ మున్సిపల్ కార్పోరేషన్c పేరు పెట్టాలి!
## సామాజిక కార్యకర్త, సీనియర్ జర్నలిస్ట్ భారత సుదర్శన్



హైదరాబాద్ డిసెంబర్ 31.సోయిలేని, వెన్నెముక లేని రాజకీయ నాయకులతో cఉప్పల్ అస్థిత్వంc పూర్తిగానీరుగారిపోతోందని సామాజిక కార్యకర్త, సీనియర్ జర్నలిస్ట్ భారత సుదర్శన్ అన్నారు. అన్ని రకాలుగా cఉప్పల్ ప్రాంతంc గ్రేటర్ హైదరాబాద్ లో అత్యంత కీలకంగా ఉన్నా కూడా ప్రభుత్వం తగినంత ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదన చెందారు.అటుమల్కాజిగిరి..ఇటు ఎల్బీనగర్ ప్రాంతాలకు కేంద్రంగా ఉన్న cఉప్పల్ ప్రాంతంcను వి ఽ ˊ ృ రి ఽ ˊ ా కొందరుఉన్నతాధికారులుఉప్పల్,మల్కాజిగిరి, ఎల్బీనగర్ జోన్లతో cగ్రేటర్ ఉప్పల్ మున్సిపల్ కార్పోరేషన్c పేరు పెట్టకుండా cగ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పోరేషన్c పేరు పెట్టేందుకు ప్రయత్నించడం తీవ్ర అన్యాయమని భారత సుదర్శన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ప్రధాన కారణం ఇక్కడి సోయిలేని, వెన్నెముక లేని రాజకీయ నాయకులని సుదర్శన్ ఆవేదనచెందారు.ఆనాడు తాము cఉప్పల్ జిల్లాcను ఏర్పాటు చేయాలని, మెట్రో కి cఉప్పల్ మెట్రో స్టేషన్c అని పేరు పెట్టాలని కొట్లాడినా అధికారులు నియంతృత్వ పోకడలతో cఉప్పల్ అస్థిత్వం, ఆత్మగౌరవంc ను కాలరాసారన్నారు. జరుగుతున్న పరిణామాలతో కలత చెందే తాను స్పందించాల్సి వస్తోందని సుదర్శన్ తెలిపారు. ఇప్పటికైనా cగ్రేటర్ ఉప్పల్ మున్సిపల్ కార్పోరేషన్c ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. లేకుంటే cఉప్పల్ అస్థిత్వం, ఆత్మగౌరవంc కోసం ప్రజల్ని మరింత చైతన్యపరిచి ఆందోళనలను చేస్తామని ఆయన తెలిపారు.

## మంద సంజీవరెడ్డి కి గౌరవ డాక్టరేట్ ప్రదానం
## గౌరవ డాక్టరేట్ తో సన్మానించిన ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ



హైదరాబాద్ డిసెంబర్ 31 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రజాసేవలో అలుపెరుగని సేవలు అందించినందుకు గాను, రాజకీయాల్లో ప్రజల నుంచి మన్ననలను పొందినందుకు గాను తెలంగాణ రాష్ట్ర మాజీ పొల్యూషన్ బోర్డు మెంబర్ బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఘట్కేసర్ మాజీ జడ్పిటిసి మంద సంజీవరెడ్డి అన్న గారికి అరుదైన గుర్తింపు లభించింది. ఈ మేరకు పుదుచేర్రీ లో ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా మంద సంజీవ రెడ్డి అన్న మాట్లాడుతూ డాక్టరేట్ అందజేసి గౌరవించిన ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ సభ్యులకు ధన్యవాదాలు అని, ప్రజా సేవలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను అవార్డును అందజేశారని అన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని ఇచ్చినందుకు ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని మంద సంజీవరెడ్డి అన్నారు.

## స్టాక్ మార్కెట్ మించి
## బంగారం, వెండి రాబడి

ముంబై, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్) దేశంలో బంగారం, వెండి ధరలు భగ్గుమంటున్న తరుణంలో నిన్నటి నుంచి తగ్గుముఖం పడుతున్నాయి. తులం బంగారం ధర దాదాపు 1,42,000 వరకు వెళ్లి బంగారం ధర.. మంగళవారం నుంచి క్రమంగా దిగి వస్తున్నాయి. వెండి కూడా అంతే ధర రూ.1,70,000 వరకు వెళ్లిన వెండి ధర.. ఇప్పుడు భారీగానే దిగి వస్తోంది. ప్రస్తుతం డిసెంబర్ 31న బంగారం ధరలు భారీగా దిగి వచ్చాయి. ప్రస్తుతం తులం బంగారం ధర రూ.1,35,880 వద్దకు చేరుకుంది. అదే విధంగా కిలో వెండి ధర రూ.2,40,000 వేల వద్ద కొనసాగుతోంది. ఈ ఏడాదిలో బంగారం, వెండి ఎంత పెరిగింది?ఈ ఏడాది 2025 జనవరి 1వ తేదీన దేశీయంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.78,000 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.71,500 వద్ద కొనసాగింది. ప్రస్తుతం తులం ధర రూ.1,35, 880 వద్ద ఉంది. ఇదే విధంగా వెండి కిలోకు రూ.90,000 వద్ద ఉండేది. ప్రస్తుతం రూ.2,40,000 వద్ద కొనసాగుతోంది.2025 సంవత్సరంలో బంగారం, వెండి ధరలలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. దీనిలో బంగారం ధర 74 శాతానికి పైగా పెరిగింది. వెండి ధర 138 శాతం పెరుగుదలను నమోదు చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. దీనికి ప్రధాన కారణం భౌగోళిక రాజకీయ ఉద్రిక్తత, కేంద్ర బ్యాంకులు నిరంతరం బంగారం కొనుగోలు చేయడం, బంగారు ఇఈ కోసం డిమాండ్, దీని కారణంగా బంగారం పెరిగిందని నివేదికలు చెబుతున్నాయి. పారిశ్రామిక డిమాండ్ కారణంగా వెండి ధర ఎక్కువగానే ఉంది. ఈలోగా వెండి సరఫరా, డిమాండ్కు సంబంధించి మార్కెట్లో కూడా మార్పులు కనిపించాయి. 2026 సంవత్సరంలో బంగారం, వెండి పెరుగుదల కొనసాగుతుందని అంచనా. 2025 సంవత్సరం బంగారం, వెండి, రాగికి నిర్ణయాత్మక సంవత్సరంగా గుర్తుండిపోతుంది. ఎందుకంటే మూడు లోహాల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఇది 40 సంవత్సరాలకు పైగా కాలంలో అత్యంత బలమైన వస్తువుల ర్యాలీలలో ఒకటిగా ఉన్నాయని అనేక మంది విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఆనంత్ రతి, స్టాక్ బ్రోకర్స్లోని కమోడిటీస్ అండ్ కరెన్సీ డైరెక్టర్ నవీన్ మాథుర్ ప్రకారం, 2025 విలువైన లోహాలకు అసాధారణమైన సంవత్సరం. రిటైల్ పెట్టుబడిదారులు, సంస్థల నుండి హెడ్జ్ ఫండ్స్, గ్లోబల్ సెంట్రల్ బ్యాంకుల వరకు అన్ని రంగాలలోని పెట్టుబడిదారులు బంగారంలో తమ పెట్టుబడులను పెంచారు.బంగారం, వెండి నాలుగు దశాబ్దాలలో అత్యుత్తమ పనితీరును కనబరిచాయి. 2025లో వెండి దాదాపు 138 శాతం పెరిగి, ప్రముఖ ఆస్తిగా మారింది. అలాగే బంగారం ధరలు 74 శాతానికి పైగా పెరిగాయి. ఇది దశాబ్దంలో అత్యంత లాభదాయకంగా మారింది.2025లో బంగారం, వెండి నుండి వచ్చే రాబడి స్టాక్ మార్కెట్, ఇతర పెట్టుబడి రాబడి కంటే ఎక్కువగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. పారిశ్రామిక డిమాండ్ కారణంగా వెండి రికార్డు లాభాలను చవిచూసింది. ఈ సంవత్సరం వెండి బంగారం కంటే 100 శాతం రాబడిని అందించింది. బంగారం 83 శాతం రాబడిని అందించింది. అదే సమయంలో నిఫ్టీ 50 డిసెంబర్ 19, 2025 నాటికి 9.4 శాతం రాబడిని అందించింది.

# 2026 క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన దళిత నాయకులు




**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 31 డిసెంబర్ 2025**రాజేంద్రనగర్ నియోజకవర్గ స్థానిక దళిత నాయకుల ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సరం యొక్క క్యాలెండర్ ఆవిష్కరణ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహ కూడలిలో జరిగినది. ఇట్టి శుభకర కార్యక్రమంలో అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ మాజీ అధ్యక్షులు గుడిసె యాదయ్య, పచ్చ నర్సింగ్ రావు, పంబల రాజు, అంబేద్కర్ సంఘ అధ్యక్షులు సంజీవ, పత్యారా నరసింహ, నవ జ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షులు మంగళారం శ్రీనివాస్, కావలి అనంతరం, సునిగంటి పెంటయ్య, పెండ్యాల జంగయ్య బచ్చల రాజు, నిమ్మల మురళి, వెంకటేష్, సంజు తదితరులు పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగినది

# ఓటర్ల మ్యాపింగ్ వారం లోపు పూర్తి చేయాలి

## భూభారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ప్రావీణ్య




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 31(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి/స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా చేపడుతున్న ఓటర్ల మ్యాపింగ్‌ను వేగవంతం చేసి వారం రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు,బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీవోలు,తహసిల్దార్లు, ఎన్నికల విభాగపు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి ఓటర్ మ్యాపింగ్ పురోగతి, భూభారతి దరఖాస్తుల స్థితిగతులనుసమీక్షించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని,బి ఎల్వోలు, బిఎల్వో సూపర్వైజర్ల సమన్వయంతో ఫీల్డ్ స్థాయిలో ఓటర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలని



సూచించారు.ఏఈఆర్ ఓ వారిగా రోజువారీ పురోగతి నివేదికలు తీసుకొని రెగ్యులర్‌గా సమీక్షించాలని ఆర్డీవోలకు సూచించారు,జాప్యం జరగకుండా వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు,భూభారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించాలని తహసిల్దార్లకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. పూర్తి పారదర్శకంగా భూభారతి చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు,ఈ సమీ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, సబ్ కలెక్టర్ ఉమా హారతి, రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహసిల్దార్లు,ఎన్నికల విభాగపు అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

# మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం డిసెంబర్ 31**:నూతన సంవత్సరంలో లక్ష్యాలను ఏర్పర్చుకొని ప్రణాళికాబద్ధంగా వాటిని సాధించేలా ముందుకు సాగాలిజిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి న వా త ్ న సంవత్సరంలో మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ప్రజలు అన్ని రంగాల్లో రాణించి సుఖసంతోషాలతో విలసిల్లాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. ఈ సంవత్సరంలో ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పర్చుకొని ప్రణాళికాబద్ధంగా వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం -2026 లో ప్రజలు కొత్త ఆలోచనలు, సరికొత్త నిర్ణయాలు, మంచి ఆశయాలతో ముందుకెళ్ళాలని సూచించారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితానికి వారి శ్రేయస్సుతో పాటు ఆనందాన్ని తీసుకువస్తుందని ఆకాంక్షిస్తూ జిల్లా ప్రజలకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మరింత ఉన్నతాశయాలను ఏర్పర్చుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. అలాగే ప్రభుత్వం సూచించిన నిబంధనలను పాటిస్తూ కొత్త సంవత్సర వేడుకలను సంయమనంతో జరుపుకోవాల్సిందిగా కలెక్టర్ కోరారు. జిల్లా ప్రజలందరు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అభిలషించారు. కొత్త ఏడాదిలో ఎల్లవేళలా అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తూ, కలెక్టర్ మను చౌదరి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## సీబీఎస్సీ పరీక్షల్లో మార్పులు...

న్యూఢిల్లీ, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్) సీబీఎస్ఈ బోర్డు నిర్వహించనున్న 10వ, 12వ తరగతుల పరీక్షల టైం టేబుల్ 2026లో స్వల్ప మార్పు చోటుచేసుకున్నట్లు సీబీఎస్సీ బోర్డు ప్రకటించింది. మార్చి 3, 2026న జరగాల్సిన పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. సీబీఎస్సీ పదో తరగతి, 12వ తరగతుల విద్యార్థులకు మార్చి 3న జరగాల్సిన పరీక్షలను రీషెడ్యూల్ చేసినట్లు సీబీఎస్ఈ తన ప్రకటనలో వెల్లడించింది.పరిపాలనాపరమైన కారణాల వల్లనే ఈ పరీక్షల షెడ్యూల్‌లో మార్పు చేసినట్లు వివరించింది. దీంతో మార్చి 3వ తేదీన పదో తరగతి విద్యార్థులకు జరగాల్సిన పరీక్షను మార్చి 11వ తేదీకి మార్పు చేసింది. అలాగే 12వ తరగతి విద్యార్థులకు మార్చి 3న జరగాల్సిన పరీక్షను ఏప్రిల్ 10వ తేదీకి మార్పు చేసినట్లు ప్రకటనలో తెలిపింది. ఈ మార్పు మినహా మిగతా పరీక్షల తేదీల్లో ఎలాంటి మార్పులేదని స్పష్టం చేసింది. ఇతర పరీక్షలన్నీ గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే యథాతథంగా జరుగుతాయని తెలిపింది.కాగా సీబీఎస్సీ బోర్డు పరీక్షలు ఫిబ్రవరి 17, 2026 నుంచి ప్రారంభమవుతాయి. పరీక్షలు ఆయా తేదీల్లో ప్రతిరోజూ ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరగనున్నాయి. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మార్చి 3న పదో తరగతి విద్యార్థులకు టిబెటన్, జర్మన్, నేషనల్ క్యాడెట్ కార్ప్స్, జపనీస్, స్పానిష్, మిజో, కశ్మీరీ, ఎలిమెంట్స్ ఆఫ్ బుక్ కీపింగ్ అండ్ అకౌంటెన్సీ వంటి పరీక్షలు జరగాల్సి ఉంది. ఇక 12వ తరగతి విద్యార్థులకు ఇదే తేదీన లీగల్ స్టడీస్ పరీక్ష జరగాల్సి ఉంది. తాజాగా మార్చి 3వ తేదీన జరిగే అన్ని పరీక్షలను వాయిదా వేయడంతో ఆయా పరీక్షలు మార్చి 11, ఏప్రిల్ 10 తేదీల్లో జరగనున్నాయి. ఈ మేరకు పాఠశాలలు తమ విద్యార్థులకు వీలైనంత త్వరగా సమాచారాన్ని తెలియజేయాలని బోర్డు సూచించింది.

# గోల్డెన్ అవర్‌లో వైద్య సహాయం అందిస్తే ప్రాణనష్టం నివారణ సాధ్యం

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం డిసెంబర్ 31**:రోడ్డు ప్రమాద బాధితులకు మొదటి గంటలోపు (గోల్డెన్ అవర్) వైద్య సహాయం అందిస్తే, ప్రస్తుత రోడ్డు ప్రమాద మరణాలు చాలా వరకు తగ్గుతాయని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న జాతీయరోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ మిని మీటింగ్ హాల్ లో ఏర్పాటు చేసిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశానికి రోడ్డు సేఫ్టి డిసిపి మనోహర్ తో కలిసి అదనపు కలెక్టరు హాజరైనారు. జిల్లాలోని సమస్యాత్మకమైన, మరమ్మత్తులు అవసరమైన రోడ్ల వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అదనపు కలెక్టరు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు మొదటి గంటలోపు (గోల్డెన్ అవర్) వైద్య సహాయం అందిస్తే, రోడ్డు ప్రమాద మరణాలు చాలా వరకు తగ్గుతాయని అన్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని మొదటి గంటలో ఆసుపత్రికి చేర్చిన వారికి 25 వేల నగదు బహుమతితోపాటు (రాహ్ వీర్) ప్రశంసాపత్రాన్ని



అందజేయడం జరుగుతుందన్నారు. గత సమావేశంలోని సమస్యలను ఎంత వరకు పరిష్కరించారు, ఇంకాఎన్ని పెండింగ్ లో ఉన్నవి అని సంబంధిత అధికారులను, మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట ఎలక్ట్రిక్ పోల్స్ ను షిఫ్ట్ చేసిరోడ్డు విస్తీర్ణం పెంచాలని, రోడ్డు ఇరు వైపుల ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు ఆదేశించారు.జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి అక్కడ అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్ల పై వర్షం నీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల పై ఎక్కువ ప్యాచ్ వర్క్ చేయకుండా అవసరమైన మేరకు కొత్త రోడ్లను నిర్మించాలని తెలిపారు. రోడ్ సేఫ్టి డిసిపి మనోహర్ మాట్లాడతూ రోడ్డు ప్రమాద బాధితులకు 7రోజుల వరకు నగదు రహిత ఉచిత వైద్య చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో గోల్డెన్ అవర్ లో చికిత్స అందించి బాధితుల ప్రాణాలు కాపాడటమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ అంశాల పై ప్రజలలో అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆర్.టి.ఎ కమిటి సభ్యులు జయ్ పాల్ రెడ్డి మాట్లాడుతూరోడ్డు భద్రత మాసోత్సవాల పై ప్రజలకు అవగహన కల్పించాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. హాకీంపేట, తూంకుంటలో బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బిఈఈ శ్రీనివాస మూర్తి, పోలీస్, ట్రాఫిక్ అధికారులు, నేషనల్ హై వే, వైద్య, విద్యా, టిజిఆర్టిసి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టాదారు పాస్ పుస్తకం వివరాలు నమోదు చేయాలి

## ఎరువుల పంపిణీలో ఇబ్బందులు లేకుండా చూడాలి

## ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

## పెద్దూర్ పీఏసీఎస్, సిరిసిల్లలోని ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాప్ లో తనిఖీ



**రాజన్న సిరిసిల్ల జిల్లా, డిసెంబర్ – 31 (ప్రజాబలం ప్రతినిధి)**ఎరువులు కొనుగోలు చేస్తున్న రైతుల పట్టాదారు పాస్ పుస్తకం వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాప్, పెద్దూర్ లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో బుధవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా ఆయా షాపుల్లో ప్రస్తుతం రిజిస్టర్, స్టాక్ ఎరువుల నిలువలను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని బస్తాల ఎరువులు విక్రయించారో ఆరా తీశారు.ఇప్పటిదాకా విక్రయించిన ఎరువుల, రైతుల పట్టాదారు పాస్ పుస్తకం వివరాలు తనిఖీ చేసి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫెర్టిలైజర్ షాప్ లు ఉదయమే తెరవాలని, సాగుకు అనుగుణంగా ఎరువుల పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరిశీలనలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయనున్న కవిత

కరీంనగర్, డిసెంబర్ 31, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఉద్యమకారులతో కలిసి వారికి ఇంటి స్థలాలు కేటాయించాలని పోరాటం చేయనుంది. కరీంనగర్ జిల్లా మానకొండూరు వేదికగా కవిత భూ పోరాటాన్ని ప్రారంభించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేస్తున్నారు. ఈ హామీని అమలు చేయాల్సిందిగా డిసెంబర్ 9వ తేదీ వరకు గడువు ఇచ్చినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఆమె ప్రత్యక్ష పోరాటానికి దిగారు. కమ్యూనిస్ట్ పార్టీల శైలిలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేయడం ద్వారా తమ ఉద్యమంలో భాగంగా నిరసనను దిగాలని నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదని మాజీ ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. కరీంనగర్‌లో మొదలైన ఈ భూ పోరాటాన్ని త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేయాలని కవిత భావిస్తున్నారు. ఉద్యమకారులకు దక్కాల్సిన ఇంటి స్థలాల హక్కు కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కవిత తెలిపారు. అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి స్థలం ఇచ్చే వరకు తెలంగాన ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని ఈ సందర్భంగా ఆమె పునరుద్ఘాటించారు.కరీంనగర్ గడ్డ మీద ప్రారంభించిన ఏ ఉద్యమమైన విజయవంతమవుతుందని.. ఇప్పుడు ఇదే కరీంనగర్ నుండి నేడు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం కోసం చేపట్టిన ఉద్యమం కూడా విజయవంతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ గడ్డ నుంచి ప్రారంభం అయిన పోరాటం... భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఉద్యమకారులను ఏకం చేసి పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరుల కుటుంబాలతో పాటు, ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు ఎత్తిన పిడికిలి దించకుండా పోరాడుతాం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేంతవరకు ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉండాలని నిర్ణయం తీసుకున్నారు.

# అర్హులకు సదరం సర్టిఫికెట్ అందించాలి

## సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్

## వివిధ జిల్లాల అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం

## హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, డిసెంబర్ - 31(ప్రజాబలం ప్రతినిధి)**రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో క్రమం తప్పకుండా సదరం శిబిరాలు నిర్వహించాలని, అర్హులకు సదరం సర్టిఫికెట్లు అందించాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ఆదేశించారు. సదరం శిబిరాల నిర్వహణ, యూడీఐడీ తదితర అంశాలపై అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, డీఆర్డీఓలు, అధికారులతో సెర్ప్ సీఈవో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లాల వారీగా సదరం శిబిరాల నిర్వహణ, పెండింగ్ అప్లికేషన్ల వివరాల పై ఆరా తీశారు.సెర్ప్ సీఈవో మాట్లాడారు. సదరం శిబిరాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, దరఖాస్తుదారులకు సమాచారం చేరవేయాలని, వారు ఆబ్సెంట్ కాకుండా చూసుకోవాలని సూచించారు. వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో వసతులు కల్పించాలని సూచించారు. భవనాలు, ఫర్నిచర్, ఇతర సౌకర్యాల కోసం నిధులు ప్రభుత్వం మంజూరు చేస్తున్నదని, అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. వైకల్య నిర్ధారణ పరీక్షల కోసం అవసరమైన వైద్యులను నియమించు కోవాలని తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికి వెంటవెంటనే నిర్ధారణ శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. యూడీఐడీ కార్డుల జారీ, ఇతర అంశాలపై వివరించారు.జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేస్తాం..ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వైకల్య నిర్ధారణ పరీక్ష కేంద్రంలో అన్ని వసతులు కల్పిస్తామని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. అప్లికేషన్లు పెండింగ్ లో లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, డీపీఎం వంగ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు పోలీసు యాక్ట్...

## పోలీసుల అనుమతి లేనిది ధర్నాలు,రాస్తారోకోలు,నిరసనలు,ర్యాలీలు,పబ్లిక్ మీటింగ్స్,చేపట్టకూడదు

## జిల్లా యస్.పి. పరితోష్ పంకజ్ ఐపియస్.



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 31(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు అనగా జనవరి 1వ తేది నుండి 31 వరకు సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ. పరితోష్ పంకజ్,ఒక ప్రకటనలో తెలియజేశారు,కావున సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేనిది ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించరాదని శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే,ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు,జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు,వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా ఎస్పీ సూచించారు,అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# సంగారెడ్డి జిల్లా,నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

## ప్రజల జీవితాల్లో ఆరోగ్యం,శాంతి, సుఖసంతోషాలు, అభివృద్ధి ఉండాలి: ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 31(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/నూతన సంవత్సరం సందర్భంగా సంగారెడ్డి జిల్లా నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు హృదయపూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరం ప్రజల జీవితాల్లో ఆరోగ్యం,శాంతి, సుఖసంతోషాలు, అభివృద్ధి తీసుకురావాలని ఆకాంక్షించారు,ప్రజల సహకారం, ఆశీర్వాదాలతో సంగారెడ్డి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.కొత్త సంవత్సరం సంగారెడ్డి జిల్లా ప్రజలందరికీ శుభప్రదంగా, విజయవంతంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# రాజస్థాన్‌లో కారులో 150 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం

జైపూర్, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్) రాజస్థాన్‌లోని టోంక్ జిల్లాలో 150 కిలోల అక్రమ అమ్మోనియం నైట్రేట్‌తో కూడిన పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యూరియా ఎరువుల సంచులలో దాచి ఉంచిన ఈ పేలుడు పదార్థాలతో పాటు, దాదాపు 200 పేలుడు కాట్రిడ్జ్‌లు, ఆరు కట్టల సేఫ్టీ ఫ్యూజ్ వైర్ (సుమారు 1,100 మీటర్లు)ను కూడా గుర్తించారు.బరోని పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాన్ని అడ్డుకున్నట్లు అధికారులు తెలిపారు. నిందితులు పేలుడు పదార్థాలను బుండి నుంచి టోంక్‌కు తరలిస్తుండగా పట్టుబడ్డారు.టోంక్ జిల్లా పోలీసులకు నిఘా వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు, బరోని పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా ఉన్న కారును తనిఖీ చేయగా యూరియా సంచుల్లో అమ్మోనియం నైట్రేట్ ఉన్నట్లు గుర్తించారు.ఈ ఘటనలో సురేంద్ర మోచి, సురేంద్ర పట్వా అనే ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పేలుడు పదార్థాలు ఎక్కడి నుంచి సేకరించారు, వాటిని ఎందుకు ఉపయోగించాలనుకున్నారు అనే విషయాలపై పోలీసులు వారిని విచారిస్తున్నారు.

# న్యూ ఇయర్ వేడుకల పేరుతో ప్రజా భద్రతకు భంగం కలిగించవద్దు

## జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపిఎస్.



**రాజన్న సిరిసిల్ల జిల్లా, డిసెంబర్ 31 (ప్రజాబలం ప్రతినిధి)**న్యూ ఇయర్ వేడుకల పేరుతో ప్రజా భద్రతకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవు.ఆనందోత్సాహాల మధ్య న్యూ ఇయర్ వేడుకలు శాంతియుతంగా జరుపుకుందాం.ఆనందంగా మొదలవ్వాలి నిర్లక్ష్యం వల్ల విషాధంగా మరకూడదు.డిసెంబర్ 31న జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని.మద్యం సేవించి ర్యాష్ డ్రైవింగ్ , బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ తొలగించి వాహనాలు నడుపుతే కఠిన చర్యలు తీసుకుంటామని.డీజేలు, అధిక శబ్ద పరికరాలపై పూర్తి నిషేధం - ఉల్లంఘిస్తే కేసులు తప్పవు.మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే,వాహనాల యజమానులపై, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం.2026 సంవత్సరంలో ప్రజలందరికి మంచి కలగాలని




ఆశిస్తూ , జిల్లా ప్రజలకు పోలీస్ శాఖ తరుపున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పరిధిలో చైనా మంజా పూర్తిగా నిషేధించామని . నిబంధనలకు విరుద్ధంగా చైనా మంజ విక్రయించినా,వినియోగించినా చట్టరీత్యా చర్యలు తప్పవు.సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో యువత గాలిపటాలను ఎగరవేయడానికి సిద్ధమవుతున్న వేళ, కొందరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా చైనా మంజాను విక్రయాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టడం జరుగుతుందని,నైలాన్, సింథటిక్ దారాలతో తయారైన ఈ చైనా మంజా మనుషులకు, వాహనదారులకు తీవ్ర ప్రమాదం కలిగించడంతో పాటు ఎగిరే పక్షులకు ప్రాణాంతకంగా మారుతున్నదని, అలాగే పర్యావరణానికి కూడా తీవ్రమైన నష్టం కలిగిస్తున్నదని పేర్కొన్నారు.ఈ ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు జిల్లాలో చైనా మంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అలాగే ఎవరైనా చైనా మంజాను విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆయన కోరారు.

# ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలు పరిష్కారించాలి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 31(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కారించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వంను డిమాండ్ చేశారు. బుధవారం నాడు సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు బహిరంగ లేఖ పంపించటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలో సమస్యల విద్యార్థులు సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలని కోరారు, ప్రభుత్వం పాఠశాల లో మంచినీళ్లు, బాత్రూమ్ లు సరిగా లేక విద్యార్థులు టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.మునిపల్లి మండలం పెద్దలోడి గ్రామంలో ప్రభుత్వ హై స్కూల్లో ఉన్న మంచినీటి కోసం విద్యార్థులు అవస్థలుపడుతున్నారని ప్రతి సారి విద్యాధికారులకు చెప్పిన పట్టించుకోవటం లేదని విమర్శించారు,పాఠశాలలో పిఈటీ టీచర్ లేరు. కావున కలెక్టర్ చర్యలు తీసుకొని పాఠశాలలో ఉన్న సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు,ఈ కార్యక్రమం సిపిఎం నాయకులు నర్సిములు, రమేష్ గౌడ్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమల్లోకి కొత్త ఇమ్మిగ్రేషన్

న్యూఢిల్లీ, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్) అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం గ్రీన్ కార్డ్ హోల్డర్లకు, అంటే అమెరికాలో శాశ్వత నివాసం ఉన్నవారికి.. అలాగే గ్రీన్ కార్డ్ లేకుండా అమెరికాలో నివసిస్తున్న వారికి కఠినమైన ఇమ్మిగ్రేషన్ నిబంధనలను అమలు చేసింది. ఈ నిబంధనల వల్ల అమెరికాలో నివసిస్తున్న పౌరులు కానివారి కష్టాలు పెరగనున్నాయి. అమెరికా పౌరసత్వం లేని వారిపై దీని ప్రభావం నేరుగా పడుతుంది.అమెరికా ప్రభుత్వం ప్రకారం ఈ కొత్త నిబంధనల ముఖ్య ఉద్దేశ్యం ఏంటంటే.. సరిహద్దు భద్రతను బలోపేతం చేయడం. అదే విధంగా అక్రమ చొరబాట్లను అరికట్టడం. మీరు కూడా అమెరికాలో నివసిస్తూ, అమెరికా పౌరసత్వం లేనివారైతే ఈ నిబంధనల గురించి తెలుసుకోవడం మీకు చాలా ముఖ్యం. అమెరికాలో శాశ్వత నివాసం ఉంటున్న గ్రీన్ కార్డ్ హోల్డర్లకు సైతం ట్రంప్ నిర్ణయాలతో తలనొప్పులు తప్పడం లేదు.అమెరికా ప్రభుత్వం ఈ కొత్త ఇమ్మిగ్రేషన్ నిబంధనలను దేశవ్యాప్తంగా డిసెంబర్ 26, 2025 నుంచి అమలు చేసింది. ఈ నిబంధనల ప్రకారం అమెరికా పౌరసత్వం లేని వారు, గ్రీన్ కార్డ్ హోల్డర్లతో సహా ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. కొత్త నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి అమెరికా నుండి బయటకు వెళ్లి తిరిగి దేశంలోకి ప్రవేశిస్తే, అతను బయోమెట్రిక్ వ్యవస్థ ద్వారా వెళ్లాల్సి ఉంటుంది. అంటే, అమెరికాలో నివసిస్తున్న పౌరులు కాని వారందరి గుర్తింపు ఇకనుంచి డిజిటల్ పద్ధతిలో జరుగుతుంది. ఇందులో వేలిముద్రలు, ఫోటోలు ఉంటాయిగతంలో అమెరికాలో 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు, వృద్ధులకు బయోమెట్రిక్ ప్రక్రియ నుండి మినహాయింపు ఉండేది. దేశంలోకి ప్రవేశించేటప్పుడు లేదా బయటకు వెళ్ళేటప్పుడు వారికి వేలిముద్రలు ఇవ్వడం, ఫోటో తీయించుకోవడం అవసరం లేదు. కానీ కొత్త నిబంధనల అమలులోకి వచ్చాక ఈ మినహాయింపు రద్దు చేశారు. ఇప్పుడు ప్రతి వయస్సు వారు బయోమెట్రిక్ ప్రక్రియ ద్వారా వెళ్ళవలసి ఉంటుందికొత్త నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ, ఇప్పుడు ఏ వ్యక్తి అయినా అమెరికాలోకి ప్రవేశించినా.. దేశం నుంచి బయటకు వెళ్ళేటప్పుడు రెండు సందర్భాలలోనూ బయోమెట్రిక్ విధానం ద్వారా మాత్రమే వెళ్లే వీలుంటుంది. గతంలో ఈ నిబంధన దేశంలోకి ప్రవేశించేటప్పుడు మాత్రమే వర్తించేది. ఎవరు ఎంతకాలం అమెరికాలో ఉన్నారు. ఎప్పుడు దేశం నుండి బయటకు వెళ్లారనే విషయాలను తెలుసుకోవడం దీని ఉద్దేశ్యం. దాంతోపాటు అక్రమ చొరబాట్లు, గడువు ముగిసినా అమెరికాలో ఉండే వీలు లేకుండా పోతుంది.

# జగ్గారెడ్డి స్వగృహంలో అయ్యప్ప మహా పడి పూజ

**ప్రతీ ఏటా డిసెంబర్ 31న ఆనవాయితీగా సత్యనారాయణ స్వామి కథ, అయ్యప్ప మహాపడి పూజ.**

**పెద్ద ఎత్తున పాల్గొన్న అయ్యప్ప స్వాములు, భక్తులు, నాయకులు, కార్యకర్తలు.**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 31(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి పట్టణం లోని రామ్ నగర్ రామ్ మందిర్ వద్ద జగ్గారెడ్డి స్వగృహం లో సత్యనారాయణ కథ, అయ్యప్ప మహా పడి పూజ ఘనంగా జరిగాయి. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, కొత్త సంవత్సరానికి స్వాగతం






పలుకుతూ ప్రతీ ఏటా డిసెంబర్ 31న ఆనవాయితీగా ఈ పూజలను జగ్గారెడ్డి నిర్వహిస్తుంటారు. ప్రతీఏడు మాదిరిగానే ఈ సారి సైతం ఈ పూజలు కన్నుల పండుగ గా జరిగాయి. ఉదయం 10 గంటలకు సత్యనారాయణ స్వామి కథ తో ప్రారంభమయ్యే ఈ పూజ కార్యక్రమాల్లో మధ్యాహ్నాము అయ్యప్ప పూజ, సాయంత్రం మొదలుకుని అర్ధరాత్రి వరకు మహా పడి పూజా కార్యక్రమాలు ఉంటాయి. ఈసారి ప్రత్యేకంగా మధ్యాహ్నాము యోగిని పుష్పార్చన,రుద్రాభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ భజన బృందాల చే ఏర్పాటు చేసిన భజనలు భక్తులను అలరించాయి. ఈ పూజా కార్యక్రమాల్లో జగ్గారెడ్డి కుమార్తె ,అల్లుడు జయా- గుణ లతో పాటు కుమారుడు దత్తు, జగ్గారెడ్డి, నిర్మల పాల్గొన్నారు.

# వేములవాడలో ఘనంగా ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

**ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించిన కమిటీ సభ్యులు కదారి శివ.**

**విద్యార్థుల సమస్యలు పరిష్కరించేంతవరకు ఎస్ఎఫ్ఐ పోరాటం ఆగదు.**




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** విద్యార్థి పోరాటాల వేగుచుక్క ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వేములవాడ పట్టణంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ సభ్యులు కదారి శివ ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వేములవాడ మండల కార్యదర్శి కటారి శివ మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 1970 సంవత్సరంలో కేరళలోని త్రివేంద్రం నగరంలో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో, అధ్యయనం పోరాటం నినాదంతో డిసెంబర్ 29, 30,31 తేదీలలో 8 మంది తోటి ఏర్పడి నేడు దేశంలోని 30 లక్షల మంది విద్యార్థుల సభ్యత్వంతో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఆవిర్భవించిందని, నేడు దేశంలో చదువుతున్నటువంటి విద్యార్థులందరికీ నాణ్యమైన, శాక్ష్మయమైన, ఉచిత విద్య ప్రతి ఒక్కరికి అందించాలని ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని తెలిపారు. కానీ నేడు దేశంలో పరిపాలిస్తున్నటువంటి మతోన్మాద బీజేపీ పార్టీ విద్యార్థులకు వ్యతిరేకంగా నూతన విద్యా విధానం తీసుకొచ్చి ఆశాక్ష్మయమైన, చరిత్రను వక్రీకరించే విద్యను నేడు విద్యార్థులకు అందిస్తుందని ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిన కూడా తాగుబోతులకు మంత్రిని కేటాయిస్తారు తప్ప, విద్యాశాఖకు మంత్రి లేకపోవడం చాలా సిగ్గుచేటు అని ప్రభుత్వాన్ని అని తీవ్రంగా విమర్శించారు. తక్షణమే తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని నియమించి, పెండింగ్ లో ఉన్నటువంటి స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్లు విడుదల చేసి, సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని మండల కార్యదర్శి కదారి శివ డిమాండ్ చేశారు.

# జీవో 252 ను సవరించాలి.

**జర్నలిస్టు సమాజానికి న్యాయం చేయండి.**

**ప్రభుత్వ విప్ కు జర్నలిస్టుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో వినతి.**



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ విషయంలో కొత్త మార్గదర్శకాలతో ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 252 లో కొన్ని సవరణలు చేసే విధంగా చూడాలని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే హెచ్-143) రాజన్న సిరిసిల్ల జిల్లా సంఘం డిమాండ్ చేస్తుంది. బుధవారం రోజున టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధి బృందంతో కలిసి వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను క్యాంపు కార్యాలయంలో కలిసి జీవోను సవరించాలని వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా టి యు డబ్ల్యూ జే జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పత్రిక స్వేచ్ఛను గౌరవిస్తూ ప్రజా పాలన ప్రభుత్వం నూతన అక్రిడిటేషన్లు జారీ కోసం జీవో 252 తీసుకురావడం అభినందనీయం అన్నారు. అయితే ఈ జీవోలోని కొన్ని నిబంధనలతో ఇప్పటివరకు అక్రిడిటేషన్లు కలిగిన దాదాపు 10,000 మందికి నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. డెస్క్ జర్నలిస్టులు, ఫీల్డ్ జర్నలిస్టులు అన్న తేడా లేకుండా అందరికీ అక్రిడిటేషన్లు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం టి యు డబ్ల్యూ జే అభ్యర్థనపై వేములవాడ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందిస్తూ ఆయన పి ఆర్ కమిషనర్ తో ఫోన్లో మాట్లాడారు. త్వరలోనే అర్హులైన ప్రతి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డు అందేలా చూస్తానని ప్రభుత్వ విప్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా టెమ్జు అధ్యక్షుడు ఇరుకుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శులు సామల గట్టు, మహమ్మద్ అజీమ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, ల తోపాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# హనుమాజీపేటలో చిరుత సంచారం.

# అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు.

**చిరుత పాదముద్రలను ధృవీకరించిన అటవీశాఖ అధికారులు.**

**వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రైతులు, పశువుల కాపరులు గుంపులుగా వెళ్లాలని, ఒంటరిగా వెళ్ళవద్దు అని అటవీశాఖ అధికారులు హెచ్చరిక.**





**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట గ్రామంలో చిరుత పులి సంచారం స్థానిక గ్రామస్తులను తీవ్రప్రయాందోళనకు గురిచేస్తుంది. హనుమాజిపేట గ్రామ శివారులో చిరుత సంచరిస్తుండడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు తక్షణమే రంగంలోకి దిగి ఆ ప్రాంతంలో క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. అటు అటవీ శాఖ అధికారుల తనిఖీలలో లభ్యమైన పాదముద్రలను పరిశీలించిన అధికారులు అవి చిరుత పులి అడుగులేనని అధికారికంగా ధ్రువీకరించారు. గత కొన్ని రోజులుగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగి, మర్రిమడ్ల, వట్టి మల్ల గ్రామాలలో చిరుత తిరుగుతూ ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేసిన విషయం సుపరిచితమే, అదే చిరుత ఇప్పుడు హనుమాజీపేట గ్రామ పరిసరాల్లోకి రావడంతో స్థానిక ప్రజలు భయంతో వనికి పోతున్నారు. హనుమాజీపేట గ్రామ పరిసరాలలో చిరుత సంచారం నిజం కావడంతో అటవీశాఖ అధికారులు స్థానికులకు పలు హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే సమయంలో, అలాగే పశు వుల కాపరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళలో ఒంటరిగా బయటకు రావద్దని ప్రజలను హెచ్చరించారు. వ్యవసాయ క్షేత్రాల వద్దకు రైతులు వెళ్లేటప్పుడు గుంపులుగా వెళ్లాలని, ఏదైనా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. చిరుత సంచారంతో హనుమాజీపేట గ్రామస్తులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. అటవీ శాఖ అధికారులు నిఘా పెంచి చిరుతను త్వరగా పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# రాజన్న సేవలో ఇండియన్ రెవిన్యూ సర్వీస్(ఐ ఆర్ ఎస్) వడోదర గుజరాత్. వంశీకృష్ణారెడ్డి.



వేములవాడ టౌన్, (ప్రజాబలం), బుధవారం రోజున తెలంగాణ రాష్ట్రంలో అతి ప్రాచీనమైన దేవాలయం, దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన శ్రీ రాజరాజస్వామి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంను ఇండియన్ రెవిన్యూ సర్వీస్ అధికారి వంశీకృష్ణారెడ్డి దర్శించుకుని, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు ఆశీర్వచన మండపంలో ఆశీర్వచనాలు అందించారు. ఆయన వెంట దేశీ గోవా రక్షణ సమితి ప్రాంత సంపత్ ప్రముఖ పుట్కూరి రాధాకృష్ణారెడ్డి మరియు వేములవాడ మండల సంపర్క ప్రముఖ రేగూరి లక్ష్మణ్, వేములవాడ మండల సహ ప్రముఖ మహేష్ కావల్ల తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ఏడాదిగా ఘన స్వాగతం

న్యూఢిల్లీ, డిసెంబర్ 31, (న్యూస్ పల్స్) 2026కి స్వాగతం పలికిన పసిఫిక్ దేశాలుప్రపంచవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. క్యాలెండర్ మారుతున్న వేళ.. కిరిబాటి దీవుల తర్వాత న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ నగరం 2026కు ఘన స్వాగతం పలికింది. అక్కడి స్థానిక సమయం ప్రకారం గడియారం ముల్లు 12 దాటగానే.. ఆక్లాండ్ నడిబొడ్డున ఉన్న న్యూజిలాండ్ ఎత్తైన కట్టడం 'స్కై టవర్' బాణసంచా వెలుగులతో మెరిసిపోయింది.సుమారు 5 నిమిషాల పాటు సాగిన ఈ కనువిందులో 3,500 రకాల బాణసంచాను స్కై టవర్ అంతస్తుల నుంచి కాల్చారు. అయితే, అక్కడి వాతావరణం వేడుకలకు కాస్త ఆటంకం కలిగించింది. భారీ వర్షం, ఉరుముల సూచన ఉండటంతో న్యూజిలాండ్ నార్త్ ఐలాండ్‌లోని పలు చిన్న కమ్యూనిటీ ఈవెంట్లను రద్దు చేశారు. అయినా ప్రధాన వేడుకలు మాత్రం వర్షంలోనే కొనసాగాయి. ఆక్లాండ్ కంటే ముందే, పసిఫిక్ మహాసముద్రంలోని మారుమూల దేశమైన 'కిరిబాటి'లోని ఓ అటోల్ (కిరితిమతి దీవి) ప్రపంచంలోనే తొలిసారిగా 2026లోకి అడుగుపెట్టింది. అక్కడి అనుభవాన్ని ఓ పర్యాటకుడు వివరిస్తూ.. "శాటిలైట్లు లేవు, మనుషుల జాడ లేదు, చిమ్మచీకటి, లెక్కలేనన్ని పీతలు మాత్రమే ఉన్నాయి" అంటూ ప్రకృతి ఒడిలో న్యూ ఇయర్ జరుపుకున్నట్లు తెలిపారు. ఇక 600 మంది జనాభా మాత్రమే ఉండే న్యూజిలాండ్ చాతం ఐలాండ్‌లోనూ కొత్త ఏడాది సంబరాలు జరిగాయి. తెల్లవార్లూ తమ బృందం వేడుకలు చేసుకుంటుందని అక్కడి ఓ హోటల్ యజమాని పేర్కొన్నారు. ప్రపంచంలోని తూర్పు దేశాల నుంచి పడమర వైపునకు కొత్త సంవత్సరం 2026 నెమ్మదిగా విస్తరిస్తోంది.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com